


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 163

శనివారం 3-9-2022



అధ్యక్షుడిగా ఆటగాడు

ఫుట్‌బాల్ సమాఖ్య ఎన్నికల్లో మాజీ గోల్ కీపర్ కల్యాణ్ చౌబే గెలుపు - 13లో



స్టార్‌బక్స్ సీఈవో మనోడే..!

భారత సంతతికి చెందిన లక్ష్మణ్ నరసింహన్ నియామకం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



99% మందికి కలుషిత గాలే..

దేశంలో 99 శాతం మంది కలుషిత గాలి పీలుస్తున్నారు. ఈ విషయాన్ని గ్రీన్‌పీస్ సంస్థ తన నివేదికలో వెల్లడించింది.


వివరాలు 6లో



సెతల్వాద్‌కు మధ్యంతర బెయిల్

గుజరాత్ ప్రభుత్వం కూల్చివేతకు కుట్ర పన్నారన్న ఆరోపణలపై అరెస్టయిన సెతల్వాద్‌కు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చింది.

వివరాలు 6లో



మహా విపత్తుకు సూచికలు!

హిమాలయాల్లో మంచు కరగడం వల్లే పాక్‌లో వరదలు, చైనాలో కరువు, భారత్‌లో వాతావరణ మార్పులని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వివరాలు 6లో



ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికే..

అమెరికాలో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి డొనాల్డ్ ట్రంప్ కుట్రలు పన్నుతున్నారని అధ్యక్షుడు బైడెన్ ఆరోపించారు.

వివరాలు 6లో

బల్క్ కుట్ర బహిర్గతం

కాకినాడ బల్క్ డ్రగ్ పార్క్‌పై టీడీపీ పన్నాగం బట్టబయలు

- రాష్ట్రానికి కేటాయించొద్దంటూ కేంద్రానికి లేఖ.. గతంలోనూ ఎన్సీటీకి లేఖ రాసిన యనమల
- అభివృద్ధికి అడ్డుపడుతూ విపక్షం క్షుద్ర రాజకీయాలు
- 16 రాష్ట్రాలతో పోటీపడి దక్కించుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- దేశవ్యాప్తంగా మూడు బల్క్ డ్రగ్ పార్క్‌లు మంజూరు
- ఏపీతోపాటు గుజరాత్, హిమాచల్‌కు కేటాయింపు
- ప్రధాని సొంత రాష్ట్రంలో అన్ని పక్షాల హర్షాతిరేకాలు
- మన రాష్ట్రంలో మాత్రం విషం చిమ్మిన దుష్ట చతుష్టయం
- యూఎస్ ఎఫ్‌డీఏ నిబంధనల ప్రకారం నడుచుకునే ఫార్మా కంపెనీలతో కాలుష్యం ఉండదంటున్న నిపుణులు
- భారీ పెట్టుబడులు.. స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి
- బల్క్ డ్రగ్ పార్క్‌ను విపక్షం అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు

2లో



మరీ ఇంత దిక్కుమాలిన రాజకీయాలా? పొరుగు రాష్ట్రం తెలంగాణ... బల్క్‌డ్రగ్ పార్కు తమకివ్వకపోవటం అన్యాయమంటోంది. వివక్ష చూపిందంటూ కేంద్రాన్ని నిందిస్తోంది. ఇక స్వరాష్ట్రం గుజరాత్‌పై ప్రత్యేక అభిమానంతో ప్రధాని దీన్ని కేటాయించారంటూ ప్రశంసాపూర్వక నిందలు కొన్ని పక్షాల నుంచి వినిపిస్తున్నాయి. అలాంటి పార్కు ఏపీకి వస్తే... ఇక్కడి ప్రతిపక్షం మాత్రం ఇక్కడ పెట్టవద్దంటోంది. దీన్ని నిలిపేయాలంటూ లేఖలపై లేఖలు రాసి... రాద్ధాంతానికి రెడీ అంటోంది. రాష్ట్రానికి పారిశ్రామిక వేత్తలు రావటం లేదని విమర్శలు చేసేదీ వీరే!!. అభివృద్ధి లేదనే ఆరోపణలూ వీరివే. తీరా భారీ ఎత్తున ఉపాధి కల్పించే బల్క్‌డ్రగ్ పార్కును సాధిస్తే... దాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నదీ వీరే!!. ఇదీ ఇక్కడి ప్రతిపక్ష టీడీపీ... దాంతో అంటకాగుతున్న మీడియా తీరు.

మాకేది బల్క్‌డ్రగ్ పార్కు?

- తెలంగాణపై ఎందుకీ వివక్ష?
- హైదరాబాద్ ఫార్మాసిటీ కనపడలేదా?: ఆ రాష్ట్ర మంత్రి కేటీఆర్

ఫార్మా పార్కుపై రాజకీయాలు దుర్మార్గం

బాబు, యనమలను రాష్ట్రం నుంచి బహిష్కరించాలి: మంత్రి అమర్‌నాథ్

2లో

శుక్రవారం ఇడుపులపాయలో తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్సార్‌కు సీఎం వైఎస్ జగన్
ఘన నివాళి

2లో

ఇడుపులపాయలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు

సచివాలయాల్లో సేవలు సంతృప్తికరం

- పాలసీల అమలుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి
- పులివెందుల నియోజకవర్గంపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రోజంతా పార్టీ నేతలు, కార్యకర్తలతో మమేకం
- పేరుపేరునా ఆప్యాయంగా పలకరింపు

- వివరాలు 2లో

న్యూస్‌రీల్

మంత్రి విశ్వరూప్‌కు అస్వస్థత



రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన్ని రాజమహేంద్రవరంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మంత్రి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని.. మెదడులో మైల్డ్ క్లాట్ ఒకటి ఏర్పడి తక్షణమే వదిలేయడం వల్ల అస్వస్థతకు గురయ్యారని వైద్యులు చెప్పారు.

వివరాలు 14లో ▸

పవన్ అభిమానుల విధ్వంసం



జనసేన అధినేత, నటుడు పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు విశాఖలోని లీలా మహల్ థియేటర్ యాజమాన్యానికి తీవ్ర నష్టాన్ని చేకూర్చాయి. పవన్ అభిమానులు కేక్‌కు బదులుగా సీట్లు, సీలింగ్, స్క్రీన్ కట్‌చేసి.. మద్యం సీసాలతో థియేటర్‌లో విధ్వంసం సృష్టించారు.

వివరాలు 10లో ▸

లారీలో పేలిన సిలిండర్లు



ప్రకాశం జిల్లా దద్దవాడ వద్ద గురువారం అర్ధరాత్రి తృటిలో పెనుప్రమాదం తప్పింది. షార్ట్‌సర్క్యూట్ వల్ల లారీలో నుంచి ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్లు గాలిలోకి ఎగిరి పేలిపోయాయి. ఒకదాని వెంట ఒకటిగా.. 100కు పైగా సిలిండర్లు పేలడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

వివరాలు 10లో ▸



అలలపై వైమానిక క్షేత్రం

'ఐఎన్ఎస్ విక్రాంత్'ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

6లో

లైట్‌హౌస్‌లకు నూతన శోభ!

మచిలీపట్నం: సముద్రంలో నౌకాయానానికి దిక్సూచి... తీరాన్ని గుర్తించేందుకు వేటకు వెళ్లే మత్స్యకారులకు మార్గదర్శి... అనుమతిలేకుండా వచ్చే బోట్లు, షిప్‌లను గుర్తించి, నౌకాదళ సిబ్బందిని అప్రమత్తం చేసే రక్షణ కవచం.. ఇలా తీరం వెంబడి ఉన్న లైట్ హౌస్‌లు బహుముఖ సేవలు అందిస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన లైట్ హౌస్‌లు త్వరలోనే పర్యాటకంగా కొత్త అందాలను సంతరించుకోనున్నాయి. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా తీర ప్రాంతాల్లోని బీచ్‌లు, లైట్ హౌస్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రణాళికలు రూపొందించి ముందుకెళ్తున్నాయి.

- 'సాగరమాల' కింద పర్యాటకంగా అభివృద్ధికి కసరత్తు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన ప్రణాళికలు
- ఆంధ్రా తీరంలోని 17 లైట్ హౌస్‌లకు మహర్దశ



దేశంలో 189 లైట్ హౌస్‌లు... రాష్ట్రంలో 17..

దేశంలో 189 లైట్ హౌస్‌లు ఉండగా, ఆంధ్రా తీరంలో 17 లైట్‌హౌస్‌లు ఉన్నాయి. రాష్ట్రంలోని సంతపల్లి, భీమునిపట్నం, డాల్ఫిన్ నోస్, పూడిమడక, పెంటకోట, వాకలపూడి, శాక్రమెంటో, రవ్వ పోర్ట్, అంతర్వేది, మచిలీపట్నం, నాగాయలంక, వాడరేవు, రామాయపట్నం, ఇసకపల్లి, కృష్ణపట్నం, ఆర్మగాన్ తీరంలో లైట్‌హౌస్‌లు ఉన్నాయి. ఇవి విశాఖపట్నం కేంద్ర కార్యాలయ పరిధిలో పని చేస్తాయి. త్వరలోనే ఈ లైట్‌హౌస్‌లు పర్యాటకంగా అభివృద్ధి చెందనున్నాయి.

ఫ్లాష్, కాల వ్యవధితో గుర్తింపు

సముద్రతీరంలో లైట్ హౌస్‌లు అన్నీ చూడటానికి ఒకేరకంగా ఉంటాయి. కానీ, వాటిలో భిన్నమైన ఏర్పాట్లు ఉంటాయి. లైట్ హౌస్ వెలువరించే ఫ్లాష్‌లు(లైటు కాంతి) సంఖ్య, కాలవ్యవధి ఆధారంగా అది ఏ తీర ప్రాంతం అనేది గుర్తిస్తారు. సముద్రంపై వేటకు వెళ్లిన, తప్పిపోయిన బోట్లకు సంబంధించిన వారు తమ దగ్గర ఉన్న సెల్‌ఫోన్ సిగ్నల్ అందక, వాతావరణ పరిస్థితులు అనుకూలించని సమయంలో గమ్యస్థానాలకు చేరేందుకు లైట్ హౌస్‌లు బాగా ఉపయోగపడతాయి. ప్రతి లైట్ హౌస్‌కు రాడార్ వ్యవస్థను అనుసంధానం చేయడంతో సముద్రంపై తిరిగే అనుమతిలేని బోట్లను గుర్తించి విశాఖపట్నంలో ఉన్న కేంద్ర కార్యాలయానికి సిగ్నల్స్ ఇస్తుంది. తద్వారా భద్రతా దళాలను సకాలంలో అప్రమత్తం చేస్తాయి.

తూర్పు తీరంలోనే ఎత్తయిన మచిలీపట్నం లైట్ హౌస్

బ్రిటీష్ కాలం నుంచి మచిలీపట్నం ఓడరేవు ద్వారా విదేశాలకు సరుకులను ఎగుమతి చేసేవారు. అప్పట్లో మచిలీపట్నానికి సమీపంలోనే నాగాయలంక మండలం గిలకలదిండి వద్ద లైట్ హౌస్ నిర్మించారు. అది తక్కువ ఎత్తులో ఉండటంతో 1983లో మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద 50.56 మీటర్లు ఎత్తు(165.879 అడుగులు)లో మరో లైట్ హౌస్‌ను నిర్మించారు. ఇది తూర్పు తీరంలోనే ఎత్తయిన లైట్ హౌస్‌గా గుర్తింపు పొందింది. ఇక్కడ మూడు ఫ్లాష్‌లు వస్తాయి. సముద్రంలో 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న వారికి కూడా ఇవి కనిపిస్తాయి.

ప్రజలు చూడొచ్చు

విశాఖపట్నం కేంద్ర కార్యాలయం నుంచే లైట్‌హౌస్‌ల కార్యకలాపాలు ఉంటాయి. రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు సందర్శకులకు ప్రవేశం ఉంటుంది. కేంద్ర అధికారుల ఆదేశాలకు అనుగుణంగా లైట్‌హౌస్‌ల వద్ద ఎంతో అప్రమత్తతతో విధులు నిర్వహిస్తాం.

– మనోజ్ హల్దార్, మచిలీపట్నం లైట్‌హౌస్ స్టేషన్ అధికారి

విభజన సమస్యల పరిష్కారమే అజెండా

నేడు తిరువనంతపురంలో దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశం

- ఆర్థిక మంత్రి బుగ్గన నేతృత్వంలో హాజరు కానున్న అధికారుల బృందం
- పోలవరం త్వరగా పూర్తయ్యేలా తగినన్ని నిధులివ్వాలని కోరనున్న ఏపీ
- తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యలు త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి
- రామాయపట్నం పోర్టు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రస్తావన
- రెవెన్యూ లోటు గ్రాంట్‌తో పాటు ఏడు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీకి డిమాండ్
- ఏపీ భవన్, విభజన చట్టంలోని సంస్థల ఆస్తులను పంపిణీ చేయాలి

14లో

దోచుకుని పంచుకోవడమే బాబు ఆశయం



- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం
- చంద్రబాబు ఓ ఆషాడభూతి.. అష్టావక్రుడు
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన రోజు గొప్పా?
- చంద్రబాబు దిగజారుడుతనానికి.. సిగ్గుమాలిన చర్యలకు ఇది పరాకాష్ట
- ఆయన్ను మళ్లీ అధికారంలోకి తేవాలనేది ఎల్లో మీడియా దింపుడు కళ్లం ఆశ
- అందుకే ప్రభుత్వంపై దుష్ప్రచారం
- ఆ కోవలోనిదే నెల్లూరులో దంపతుల హత్యపై ఈనాడు తప్పుడు కథనం

- వివరాలు 10లో

రాష్ట్రంలో 'ఆంధ్ర గోపుష్టి' కేంద్రాలు



- విజయవాడలో ఈ నెలాఖరున తొలిస్టాల్ ఏర్పాటు
- ఆ తర్వాత దశలవారీగా 50కు పైగా నగరాల్లో విస్తరణ
- ఏ–2 పాలు, పాల ఉత్పత్తులకు 'ఆంధ్ర గోపుష్టి' పేరిట మార్కెటింగ్
- ఎన్ఎస్ఓపీ ప్రమాణాలతో వైఎస్సార్ దేశవాళీ గో పెంపకం కేంద్రాలు కూడా ఏర్పాటు
- ఆర్గానిక్ సర్టిఫికేషన్‌తో తొలి విడతలో గతేడాది 57 ఏర్పాటు
- మలివిడతలో మరో 52 కేంద్రాలు మంజూరు.. త్వరలో 27 క్షేత్రాలు గ్రౌండింగ్

14లో

ఇదండీ సంగతి



..మనకు ఎవరయినా అవకాశం ఇస్తేగా మాట్లాడటానికి..!

వైఎస్సార్‌కు సీఎం జగన్ ఘన నివాళి

ఇడుపులపాయలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు

సాక్షి ప్రతినిధి, కడప: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఇడుపులపాయలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఉదయం 8.40 గంటలకు సీఎం వైఎస్ జగన్, సతీమణి వైఎస్ భారతి, తల్లి వైఎస్ విజయమ్మ, సోదరి షర్మిల, ఇతర కుటుంబ సభ్యులు వైఎస్సార్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేశారు. వైఎస్సార్ ఘాట్‌లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర బీసీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోతుల సునీత, గంగుల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డాక్టర్ సుధ, కడప మేయర్ సురేష్ బాబు, తదితరులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి, షర్మిల తదితరులు

బల్క్ కుట్ర బహిర్గతం


కాకినాడలో బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి యనమల రామకృష్ణుడు రాసిన లేఖ

సాక్షి, అమరావతి: చేతనైతే ఊరికి ఉపకారం చేయాలి.. అపకారం మాత్రం తలపెట్టకూడదు! మాజీ మంత్రి యనమల మాత్రం పురిటిగడ్డకే ద్రోహం తలపెడుతున్నారు! వేల మంది స్థానిక యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలకు అడ్డుపుల్లలు వేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్న విపక్ష టీడీపీ క్షుద్ర రాజకీయాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఔషధాల దిగుమతి తగ్గించుకొని ఫార్మా రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మూడు రాష్ట్రాల్లో బల్క్ డ్రగ్ పార్క్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. తీవ్ర పోటీ నెలకొన్న ఈ పార్క్‌ల కోసం ఆంధ్రప్రదేశ్‌తోపాటు గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎంపికయ్యాయి. 16 రాష్ట్రాలతో పోటీ పడి మరీ మన రాష్ట్రం దీన్ని సాధించుకుంటే ఆంధ్రప్రదేశ్‌కు రాకుండా అడ్డుకునేందుకు ప్రతిపక్ష టీడీపీ మూడు నెలల క్రితమే ప్రయత్నాలు ప్రారంభించినట్లు వెల్లడైంది. రూ.వేల కోట్ల పెట్టుబడులతో పాటు వేల మందికి ఉపాధి కల్పించే ప్రతిష్టాత్మక పార్క్‌ను రాష్ట్రానికి రాకుండా నిరోధించేందుకు టీడీపీ పన్నిన కుట్రలు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కేంద్రానికి, ఎన్జీటీకి రాసిన లేఖల ద్వారా వెలుగులోకి వచ్చాయి.

ఆపాలంటూ యనమల లేఖలు

కాకినాడ సమీపంలో ఫార్మా రంగ పరిశ్రమల ఏర్పాటుతో రైతులు, మత్స్యకారుల జీవనోపాధి దెబ్బ తింటుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బల్క్ డ్రగ్ పార్కు వల్ల తీవ్ర పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, దీన్ని రద్దు చేయాలంటూ తాజాగా కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖకు రాసిన లేఖలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ఇవే అంశాలను గత జూలై 16న లేఖ ద్వారా ఢిల్లీలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ ఆదర్శ్‌కుమార్ గోయెల్, చెన్నైలోని ఎన్జీటీ సదరన్ జోనల్ కార్యాలయానికి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. తక్షణమే కేంద్రం జోక్యం చేసుకుని ఈ ప్రాంతంలో ఫార్మా పరిశ్రమల ఏర్పాటును నిలిపివేయాలని కోరారు.

అక్కడ స్వాగతం.. ఇక్కడ దుర్బుద్ధి

తెలంగాణ, తమిళనాడు, కర్నాటక లాంటి దక్షిణాది రాష్ట్రాల నుంచి గట్టిపోటీ ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం బల్క్ డ్రగ్ పార్కును దక్కించుకుంది. దీంతో ఈ పార్కును రద్దు చేయాలంటూ యనమల మరోసారి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శికి లేఖ రాయడం టీడీపీ దుర్బుద్ధిని బయటపెట్టిందంటూ ఫార్మా నిపుణులు, పారిశ్రామికవేత్తలు విమర్శిస్తున్నారు. ఒకపక్క ప్రధాని మోదీ సొంత రాష్ట్రానికి బల్క్ డ్రగ్ పార్కు కేటాయించడాన్ని రాజకీయాలకు అతీతంగా అక్కడ ప్రతిపక్ష పార్టీలన్నీ స్వాగతిస్తూ భారీ ప్రకటనలు జారీ చేయగా మన రాష్ట్రంలో మాత్రం ఆ పార్కునే రద్దు చేయాలంటూ టీడీపీ పదేపదే లేఖలు రాయడంపై తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. తెలంగాణ, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో రాజకీయంగా ఎన్ని విభేదాలున్నా అభివృద్ధి విషయంలో కలిసి పనిచేస్తుంటాయని, ఇక్కడ టీడీపీ మాత్రం ప్రతిష్టాత్మక బల్క్ డ్రగ్ పార్కును మన రాష్ట్రం దక్కించుకుంటే అభినందనలు తెలపకపోగా రద్దు చేయాలంటూ కేంద్రానికి లేఖ రాయడం దారుణమని ఫార్మా రంగ నిపుణులు పేర్కొంటున్నారు. స్థానిక యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తూ రూ.వేల కోట్ల పెట్టుబడులు రాకుండా అడ్డుకునే కుట్రలపై మండిపడుతున్నారు.

యూఎస్ ఎఫ్‌డీఏ అనుమతించిన కంపెనీలే..

ఫార్మా కంపెనీల వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, అందుకే బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్నామంటూ యనమల పేర్కొనటంపై సోషల్ మీడియా వేదికగా పలువురు విరుచుకుపడుతున్నారు. బల్క్ డ్రగ్ పార్క్ అంటే ఏమిటి? అక్కడ వ్యర్థాలను శుద్ధి చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే అంశాలపై కనీస అవగాహన లేకుండా దుగ్ధతో లేఖలు రాయటాన్ని తప్పుబడుతున్నారు. యూఎస్ ఎఫ్‌డీఏ అనుమతి ఉన్న కంపెనీలు మాత్రమే బల్క్ డ్రగ్ పార్కులో ఏర్పాటవుతాయని, ఒక్క చుక్క వ్యర్థం బయటకు వచ్చినా వాటి అనుమతులే రద్దు అవుతాయని స్పష్టం చేస్తున్నారు. అందువల్లే ఈ విషయంలో ఫార్మా కంపెనీలు చాలా జాగ్రత్తలు తీసుకుంటాయని ఫార్మా రంగ నిపుణులు గుర్తు చేస్తున్నారు.

కట్టుదిట్టంగా ట్రీట్‌మెంట్ ప్లాంట్స్

బల్క్ డ్రగ్ పార్కులో ఏర్పాటయ్యే కంపెనీల నుంచి వచ్చే ఘన, ద్రవవ్యర్థాలను శుద్ధిచేసేందుకు ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తారు కాబట్టి వ్యర్థాలు బయటకువెళ్లే అవకాశం ఉండదని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలు ఫార్మా కంపెనీలున్న హైదరాబాద్‌లో లేని కాలుష్యం కాకినాడకు ఎక్కడి నుంచి వస్తుందంటూ నెటిజన్స్ ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క రాష్ట్రానికి పరిశ్ర మలు రావడంలేదంటూ దుష్ప్రచారం చేస్తూ మరోపక్క దాదాపు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే బల్క్‌డ్రగ్ పార్కును ఎందుకు అడ్డుకుంటున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. పార్కుకు అడ్డుపడటం ద్వారా తుని నియోజకవర్గంలో యువతకు ఉపాధి దొరకకుండా యనమల వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

గుజరాత్‌లో స్వాగతిస్తారు



రాష్ట్రానికి బల్క్ డ్రగ్ పార్క్ రావడం స్వాగతించాల్సిన విషయం. ఇప్పుడు నూతన టెక్నాలజీ ద్వారా పరిశ్రమల వ్యర్థాలను 99 శాతం రీ సైకిల్ చేస్తున్నారు. వ్యర్థాల నియంత్రణకు జీరో లిక్విడ్ డిజార్డ్ (జెడ్ఎల్‌డీ) విధానం అందుబాటులో ఉంది. సముద్రంలో 35 వేల పీపీఎం సాల్ట్ ఉంటుంది. దాన్ని రివర్స్ ఆస్మోసిస్ ద్వారా 3 పీపీఎంకి తగ్గిస్తున్నామంటే టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. దేశంలో ఉన్న అసలైన పొల్యూషన్ పేదరికం, నిరుద్యోగం లాంటివి పోగొట్టాలంటే పరిశ్రమలను పెంచాల్సిందే. గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో పరిశ్రమలు వస్తే స్వాగతిస్తారు.

– ప్రొఫెసర్ మురళీకృష్ణ, జేఎన్‌టీయూకే, సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ మాజీ సభ్యుడు

ఉమ్మడి వ్యర్థ నియంత్రణ వ్యవస్థ



బల్క్ డ్రగ్ పార్కులో ఏర్పాటయ్యే ఫార్మా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ఉమ్మడి వ్యర్థ నియంత్రణ వ్యవస్థ ఉంటుంది. దీంతో ఫార్మా కంపెనీలు సొంతంగా వ్యర్థ నియంత్రణ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో తక్కువ రేటుకే వ్యర్థాల శుద్ధి అందుబాటులోకి తేవడం కంపెనీలకు కలిసొచ్చే అంశం.

– ఈశ్వర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్

ఎఫ్‌డీఏ అనుమతులున్నవే



దేశంలో ఏర్పాటయ్యే బహుళజాతి ఫార్మా కంపెనీలు యూఎస్ ఎఫ్‌డీఏ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మన దేశ నిబంధనలతో పోలిస్తే ఇవి చాలా కఠినంగా ఉంటాయి. యూఎస్ ఎఫ్‌డీఏ నిబంధనల ప్రకారం ఉంటేనే ఆ కంపెనీలు ఉత్పత్తి చేయడానికి అనుమతిస్తాయి. ఈ విషయం తెలుసుకోకుండా ఫార్మా కంపెనీల ద్వారా కాలుష్యం ఏర్పడుతుందంటూ యనమల నిరాధార ఆరోపణలు చేస్తున్నారు.

– లంకా శ్రీధర్, రాష్ట్ర పెట్టుబడుల సలహాదారు

యువతకు ఉపాధి



తీర ప్రాంతంలో పరిశ్రమలు రావడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

– గంగిరి నాగేంద్ర, కొత్త పెరుమాళ్లపురం, తొండంగి మండలం

సచివాలయాల్లో సేవలు సంతృప్తికరం

పులివెందుల నియోజకవర్గంపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్


పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: సచివాలయాల ద్వారా ప్రజల లోగిళ్లకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వ్యవస్థ సక్రమంగా నడవాలంటే ఎక్కడా వివక్ష ఉండకూడదని చెప్పారు. నా వాడు, నీ వాడు అన్న భేదాలు లేకుండా వ్యవస్థ సమాంతరంగా కొనసాగాలని, ప్రభుత్వ పాలసీల అమలుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఆయన ఇడుపులపాయ నెమళ్ల పార్కు వద్ద పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై మూడు విడతలుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నేతలు, అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు నేతలు, కార్యకర్తలు, స్థానిక బంధువులు, స్నేహితులను ఒకే చోట చూసిన ఆనందంలో అందరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. అందరితో మమేకమై నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. కలెక్టర్ వి.విజయరామరాజు, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అభివృద్ధి పనుల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా చక్రాయపేట, వేంపల్లె రూరల్, అర్బన్ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయా ప్రాంతాల నేతలు ముఖ్యమంత్రిని కోరారు. ఇప్పటి వరకు పెద్ద ఎత్తున చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి గురించి తెలిపారు. తమ ప్రాంతంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడంపై వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలువురు నేతలు వినతి పత్రాలు అందజేశారు. వాటిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి తావు లేకుండా కుల, మత, వర్గ ప్రాంతాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులందరికీ సీఎం అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్‌వర్మ, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా పార్కుపై రాజకీయాలు దుర్మార్గం

- చంద్రబాబు, యనమలను రాష్ట్రం నుంచి బహిష్కరించాలి: మంత్రి అమర్‌నాథ్
- కేంద్రానికి లేఖలతో సొంత జిల్లా ప్రజలకు యనమల వెన్నుపోటు



సాక్షి, విశాఖపట్నం: ఫార్మా పరిశ్రమ హబ్‌గా రాష్ట్రం నిలవనుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఏపీకి బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటూ టీడీపీ నేత యనమల రామకృష్ణుడు కేంద్రానికి లేఖ రాయడం దారుణమన్నారు. శుక్రవారమిక్కడ సర్క్యూట్ హౌస్‌లో మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ ఒకటో తేదీ అంటే చంద్రబాబు, యనమల రామకృష్ణుడికి వెన్నుపోటు పొడిచేందుకు అనుకూలమైన రోజని వ్యాఖ్యానించారు. 1995లో చెట్టు కింద ప్లీడర్‌ను ప్రజాప్రతినిధిగా, మంత్రిగా, స్పీకర్‌గా చేసి రాజకీయ భవిష్యత్ ప్రసాదించిన ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన ఘనత యనమలకే దక్కుతుందన్నారు. మూడున్నర దశాబ్దాల పాటు ఎమ్మెల్యేగా గెలిపించి రాజకీయ పదవులు కట్టబెట్టిన సొంత జిల్లాకు బల్క్ డ్రగ్ పార్క్ వస్తే అడ్డుకుంటూ లేఖలు రాసి మరోసారి వెన్నుపోటుదారుడిగా నిరూపించుకున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, యనమలను రాష్ట్రం నుంచి ప్రజలు బహిష్కరించాలన్నారు. టీడీపీ నాయకులే కాదు కార్యకర్తలు కూడా చంద్రబాబును పూర్తిగా మరిచిపోయారన్నారు. జైలుకు వెళ్లిన వారికే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అడగకుండానే పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వంపై ప్రజలు ఎందుకు తిరగబడాలో చంద్రబాబు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు గెలుచుకోవడంపై తాము కసరత్తు చేస్తుంటే చంద్రబాబు, ఆయన కుమారుడు కుప్పంలో ఎలా నెగ్గాలో మల్లగుల్లాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఏ నియోజకవర్గం దొరక్క చివరికి హిందూపురం నుంచి పోటీ చేయడానికి కోడలిని బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

హంసలా ఆరు నెలలున్నా చాలు

రాష్ట్రంలో ఏ మంచి కార్యక్రమం జరిగినా చంద్రబాబుకు నిద్ర పట్టదని మంత్రి అమర్‌నాథ్ పేర్కొన్నారు. మహానేత వైఎస్సార్‌కు యావత్ తెలుగు ప్రజలంతా నివాళులర్పిస్తూ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే చంద్రబాబు సహించలేక పోతున్నారని దుయ్యబట్టారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. కాకిలా కలకాలం ఉండేకన్నా హంసలా ఆరు నెలలు బతికినా చాలన్నారు.

మాకేది బల్క్‌డ్రగ్ పార్కు?

తెలంగాణపై ఎందుకీ వివక్ష: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మూడు బల్క్‌డ్రగ్ పార్కుల్లో తెలంగాణకు అవకాశం కల్పించకపోవడంపట్ల ఆ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కె.తారకరామారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి హైదరాబాద్‌లోని ఫార్మాసిటీని కనీసం పరిగణలోకి తీసుకోకుండా కేంద్రం వివక్ష ప్రదర్శించిందని విమర్శించారు. కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఎరువులు, రసాయనాలశాఖ మంత్రి మన్సుక్ మాండవీయకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. బల్క్‌డ్రగ్ పార్క్‌ల ఏర్పాటులో ఏపీ, హిమాచల్, గుజరాత్ సరసన తెలంగాణకు చోటు దక్కకపోవడాన్ని ప్రశ్నించారు. దేశంలో లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగానికి వెన్నెముకగా నిలుస్తూ ప్రపంచ వ్యాక్సిన్ల రాజధానిగా పేరొందిన హైదరాబాద్‌ను కేంద్రం ఉద్దేశపూర్వకంగా విస్మరించిందన్నారు. 70 శాతానికిపైగా ముడి ఫార్మా ఉత్పత్తుల కోసం చైనాపై ఆధారపడుతున్న నేపథ్యంలో బల్క్‌డ్రగ్ తయారీలో దేశీయంగా స్వయం సమృద్ధి సాధించేందుకు బల్క్‌డ్రగ్ పార్క్‌లను కేంద్రం ప్రకటించిందన్నారు. తెలంగాణకు బల్క్‌డ్రగ్ పార్కు కేటాయించాలని, హైదరాబాద్‌లోని ఫార్మా సిటీలో 2వేల ఎకరాల్లో పార్క్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రానికి తెలియచేస్తూ ఫార్మా సిటీ మాస్టర్ ప్లాన్‌ను కూడా అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. రాజకీయ లబ్ధి కోసం దేశ ప్రయోజనాలను పణంగా పెట్టొద్దని ఆయన కోరారు.

పోర్టల్ ద్వారా దసరా టికెట్ల విక్రయం

- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ
- విజయవాడ దుర్గగుడిలో ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలలో వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను విక్రయించేందుకు ప్రత్యేకంగా పోర్టల్‌ను రూపొందించనున్నామని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. దీని ద్వారానే దర్శనం టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్ లాల్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, పోలీసు కమిషనర్ టీకే రాణా, దేవస్థాన ఈఓ భ్రమరాంబ తదితరులతో కలిసి దసరా ఏర్పాట్లపై ఆయన శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఐపీ బ్రేక్ దర్శనానికి ఒక్కో స్లాట్‌లో రెండు వేల మందికి అమ్మవారి దర్శనం అయ్యేలే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ ప్రకారం పది లెటర్లు, బ్రేక్ దర్శనానికి ఐదుగురిని అనుమతించాలని నిర్ణయించామన్నారు. ఘాట్‌రోడ్డు మీదుగా సర్వదర్శనానికి రెండుక్యూలైన్లు అందుబాటులో ఉంటాయని, రూ.100, రూ.300 టికెట్ల క్యూలైన్లు మరో రెండు ఉంటాయన్నారు. దసరా ఉత్సవాలలో అంతరాలయ దర్శనంలేదని, ఉత్సవాల అనంతరం వీఐపీ టికెట్ల ద్వారా అంతరాలయంలోకి అనుమతిస్తామని మంత్రి తెలిపారు. బ్రేక్ దర్శనాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తామని, అదే విధంగా సిఫార్సు లేఖలపై ప్రత్యేక కసరత్తు చేస్తున్నామన్నారు. దసరా ఉత్సవాలలో వికలాంగులు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లుచేసే ఆలోచనలో ఉన్నామన్నారు.


గుంటూరులోని నల్లకుంటకు చెందిన బాలుడు సింహాచలానికి దివ్యాంగ ఫించన్ అందజేస్తున్న వలంటీర్ గీత


కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో తుని రూరల్ మండలం కేవో మల్లవరానికి చెందిన నూకాలమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సత్య


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ 41వ డివిజన్ పరిధిలో వృద్ధుడు బి.కోటేశ్వరరావుకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ శాంతి


ఒంగోలులోని ఏనుగుచెట్టు వీధిలో డయాలసిస్ చేయించుకుంటున్న రాజ్యలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సాయిలక్ష్మి


నెల్లూరు రెయిన్‌బో ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న శ్రీనివాసులుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లావణ్య


ఏలూరు రాణినగర్‌లో శీరా సీతమ్మకు శుక్రవారం వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కుమారి


అనంతపురం జిల్లా గుంతకల్లులో ఉన్న దానప్పకు పింఛన్ అందజేస్తున్న కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కారుమంచి వలంటీర్ శ్రీనివాసులు


విజయనగరం జిల్లా రాజాంలో చికిత్స పొందుతున్న రేగిడి మండలం కందిశికి చెందిన అప్పలనాయుడుకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ రాము

59.78 లక్షలమందికి రూ. 1,520.08 కోట్ల పింఛను

- 95.36 శాతం మందికి పంపిణీ పూర్తి
- మరో మూడురోజులు కొనసాగనున్న పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 59,78,879 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం రెండు రోజులుగా రూ.1,520.08 కోట్లను పింఛన్ల రూపంలో పంపిణీ చేసింది. గ్రామ, వార్డు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి డబ్బులు అందజేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 62,69,877 మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.1,594.66 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 95.36 శాతం మందికి పంపిణీ పూర్తయింది. మిగిలిన వారికోసం మరో మూడురోజులు వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేస్తారని సెర్ప్ అధికారులు తెలిపారు.


విశాఖలో చికిత్స పొందుతున్న అనకాపల్లి జిల్లా గంగాదేవిపేటకు చెందిన పారిపల్లికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హరి


వైఎస్సార్ జిల్లా బి.కోడూరు మండలంలో వృద్ధురాలు లక్షుమ్మకు పింఛన్ నగదును అందజేస్తున్న వలంటీర్ ఓబులేసు

ఆస్పత్రుల పర్యవేక్షణకు యాప్

సమస్యల పరిష్కారం, సౌకర్యాల మెరుగుకు చర్యలు

- నాణ్యమైన సేవలందించాలన్న సీఎం జగన్ ఆలోచనలకు కార్యరూపం
- యాప్‌ను రూపొందించిన వైద్య విధాన పరిషత్
- ఆస్పత్రుల సమాచారాన్ని అప్‌లోడ్ చేయనున్న సూపరింటెండెంట్‌లు
- యాప్‌లో నమోదు చేసిన సమాచారం డ్యాష్‌బోర్డుకు
- ఆ వెంటనే సమస్యలకు పరిష్కారం

సాక్షి, అమరావతి : ప్రజలకు ఆస్పత్రుల్లో మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వాస్పత్రుల నిర్వహణ, పర్యవేక్షణకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆస్పత్రుల నిర్వహణను నిత్యం పర్యవేక్షించి, సమస్యలను పరిష్కరించడం, సౌకర్యాలను మెరుగు పరచడం ద్వారా నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆస్పత్రుల్లో సెక్యూరిటీ, శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, బయోమెడికల్ పరికరాల నిర్వహణ, ఈ–హెచ్‌ఆర్ తదితర అంశాలపై పర్యవేక్షణకు ఏపీ వైద్య విధాన పరిషత్ ఈ యాప్‌ను రూపొందించింది. వైద్య విధాన పరిషత్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా



175 సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీలు), 53 ప్రాంతీయ (ఏరియా) ఆస్పత్రులు, 17 జిల్లా ఆస్పత్రులు, రెండు ఎంసీహెచ్, ఒక చెస్ట్ డిసీజెస్ ఆస్పత్రి ఉన్నాయి. వీటిలో 16,340 పడకల సామర్థ్యం ఉంది. ఈ ఆస్పత్రుల నిర్వహణ, సౌకర్యాల పర్యవేక్షణకు 'ఏపీ హెల్త్ సెకండరీ కేర్' యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌లో ప్రతి ఆస్పత్రికి ఒక లాగిన్‌ను కేటాయించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ లేదా ఆర్‌ఎంవో ఈ యాప్‌లో లాగిన్ అయి అందులోని మాడ్యూల్స్ ఆధారంగా వివరాలను నమోదు చేయాలి. ఆస్పత్రిలో సెక్యూరిటీ విధానం, సెక్యూరిటీకి స్కోరింగ్, శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ తదితర అంశాలపై స్కోరింగ్ ఇవ్వాలి. అనుబంధ ప్రశ్నలకు ఎస్/నో రూపంలో సమాధానాలివ్వాలి. వాటికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. ఉదాహరణకు ఆస్పత్రిలో రోగుల రక్షణకు సంబంధించిన సెక్యూరిటీ విజిట్ మాడ్యూల్‌లో.. సెక్యూరిటీ గార్డ్ 24 గంటలు అందుబాటులో ఉంటున్నాడా... అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాలి. గార్డ్ అందుబాటులో ఉన్నాడని 'ఎస్' అని పెడితే వెంటనే లైవ్ ఫొటో అప్‌లోడ్ చేయాలని యాప్ అడుగుతుంది. విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డ్ లైవ్ ఫొటోను అప్‌లోడ్ చేయాలి.

ఎన్‌ఏబీహెచ్ ప్రమాణాలకు అనుగుణంగా యాప్

నేషనల్ అక్రిడిటేషన్ ఫర్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్‌ఏబీహెచ్) ప్రమాణాలకు అనుగుణంగా యాప్‌లో ప్రశ్నావళిని రూపొందించాం. యాప్‌పై సూపరింటెండెంట్‌లు, ఆర్‌ఎంవోలకు శిక్షణ ఇచ్చాం. యాప్‌లో ఉండే వివరాలన్నీ రాష్ట్ర డ్యాష్ బోర్డుకు అనుసంధానం చేశాం. ఎక్కడైనా సెక్యూరిటీ, శానిటేషన్ ఇతర అంశాల నిర్వహణలో లోపాలున్నట్లు యాప్‌లో నమోదు చేస్తే డ్యాష్ బోర్డులో కనిపిస్తుంది. దాని ఆధారంగా సమస్యలు పరిష్కరిస్తాం. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో భాగంగా యాప్‌ను తీసుకువచ్చాం.

– డాక్టర్ వినోద్‌కుమార్,
కమిషనర్, ఏపీ వైద్య విధాన పరిషత్

క్లుప్తంగా

అధికారుల అర్ధ సంవత్సర పరీక్షలు వాయిదా

అక్టోబర్ 25 నుంచి నిర్వహణ

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో స్టేట్, ఆలిండియా సర్వీస్ అధికారులకు నిర్వహించ తలపెట్టిన అర్ధ సంవత్సర పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించాల్సి ఉంది. అయితే సవరించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 25 నుంచి 28 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 'బీజేపీ పోరు సభలు'

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ఐదు వేల ప్రాంతాల్లో 'బీజేపీ పోరు సభలు' నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో వైఫల్యాలను, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత ఎనిమిదేళ్లలో ఆంధ్రాకు కేటాయించిన నిధులు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసి, 2024 ఎన్నికల్లో గెలిపించాలని కోరుతామని తెలిపారు. కాగా, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జి సునీల్ దియోధర్ ట్విట్టర్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా రామిరెడ్డి

సాక్షి, అమరావతి : వైద్య, ఆరోగ్య శాఖలో వ్యాధుల నియంత్రణ విభాగం అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వి.రామిరెడ్డికి ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను(ఎఫ్‌ఏసీ) ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్‌గా అదనపు బాధ్యతల్లో ఉన్న విశాఖపట్నం రీజినల్ డైరెక్టర్(ఆర్డీ) డాక్టర్ స్వరాజ్యలక్ష్మి ఆగస్టు నెలాఖరున పదవీ విరమణ చేశారు. దీంతో డైరెక్టర్ బాధ్యతలను రామిరెడ్డికి అప్పగించారు. అలాగే విశాఖపట్నం ఆర్డీగా ఏపీ శ్యాక్స్ ఏపీడీ డాక్టర్ ఉమాసుందరిని నియమించారు.

ఈఏపీ సెట్ అడ్మిషన్లలో ఇంటర్ అర్హత మార్కుల సడలింపు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మా కోర్సులతోపాటు ప్రొఫెషనల్ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్ కనీస అర్హత మార్కులను సడలించినట్లు ఏపీఈఏపీ సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం 2022–23 విద్యా సంవత్సరానికి మాత్రమే ఈ సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు ఏపీఈఏపీ సెట్ ర్యాంకుతో పాటు ఇంటర్ లేదా దానికి సమానమైన అర్హత పరీక్ష(10+2)లో ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్‌లో కనీసం 45 శాతం మార్కులు(రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులు 40 శాతం) పొందాలి. అయితే 2022–23కు ఈ నిబంధనను ప్రభుత్వం సడలించిందని కన్వీనర్ తెలిపారు. ఇంటర్‌లో అర్హత మార్కులు లేని కారణంగా దరఖాస్తులు తిరస్కరణకు గురైన అభ్యర్థులు సమీపంలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలని పేర్కొన్నారు.

స్కూళ్లలో నాడు - నేడు పనులపై ఆడిట్

లోపాలు సరిచేయడానికి ఏర్పాట్లు

- సచివాలయాల్లోని సంక్షేమ, ఇంజనీరింగ్ సిబ్బంది, హెచ్‌ఎంల ఆధ్వర్యంలో పరిశీలన
- ఈనెల 7 లోగా పరిశీలన పూర్తి చేయాలి
- పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సర్క్యులర్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో 'మనబడి నాడు - నేడు' పథకం కింద స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, ఆస్పత్రుల్లో కల్పించిన మౌలిక సదుపాయాల్లో లోపాలుంటే గుర్తించి వాటిని సరిచేయడానికి ప్రభుత్వం ఆడిట్ పేరుతో పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా నాడు–నేడు ఫేజ్–1 పాఠశాలల్లో ఆడిట్‌కు పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కె.సురేష్‌కుమార్ సర్క్యులర్ జారీచేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని సంక్షేమ, విద్య సహాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆయా స్కూళ్ల హెడ్ మాస్టర్లతో కలిసి పరిశీలన చేపట్టాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ డిపార్ట్‌మెంట్ బెనిఫిషియరీ ఔట్ రీచ్ అప్లికేషన్ లాగిన్ ద్వారా ఈ పరిశీలన చేస్తారు.

డేటా సేకరణ ఇలా...

స్కూళ్లలో జరిగిన పనుల్లో లోపాలు, ఖాళీలు ఉంటే గుర్తించేందుకు పాఠశాల హెడ్ మాస్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సమక్షంలో పరిశీలన చేయాలి. వారికి కేటాయించిన పాఠశాలలను సందర్శించేందుకు సంక్షేమ, విద్య సహాయకులను ప్రధానోపాధ్యాయులు ఆహ్వానించాలి. అక్కడ పరిశీలనలో వారు సేకరించిన సమాచారాన్ని మొబైల్ అప్లికేషన్‌లోని ఎంట్రీ స్క్రీన్‌లో పూరించాలి. సంక్షేమం, విద్య అసిస్టెంట్ నింపిన ఆ ఫారంను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై ముగ్గురూ సంతకాలు చేయాలి. ఈ ఫారాన్ని ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లాగిన్ ద్వారా లబ్ధిదారుల ఔట్‌రీచ్ అప్లికేషన్‌కు అప్‌లోడ్ చేయాలి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. జిల్లా విద్యా శాఖాధికారులు, అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్లు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారులు, మండల విద్యా శాఖాధికారులు దీనిని పర్యవేక్షించాలి. ఈ నెల ఏడో తేదీలోపు ఈ కార్యాచరణను పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. నిర్దేశిత సమయంలో పనిని పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్లు రోజూ సమీక్షిస్తారని పేర్కొన్నారు.

రైతుకు రక్షగా భూముల రీసర్వే

- అక్టోబర్ 2 నాటికి 2 వేల గ్రామాల్లో రీసర్వే పూర్తికావాలి
- ఉన్నతాధికారులు, జేసీలతో సమీక్షలో రెవెన్యూ మంత్రి ధర్మాన



సాక్షి, అమరావతి: గత మూడేళ్లుగా రెవెన్యూ శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు ఆ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ప్రతి పంచాయతీకి ఒక వీఆర్వో, ఒక సర్వేయర్‌ను శాశ్వత ప్రాతిపదికన నియమించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ శాఖపై ఉన్నతాధికారులు, జాయింట్ కలెక్టర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ వందేళ్ల తర్వాత దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామన్నారు. దీన్ని పూర్తిచేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఒక బలహీన రైతు తన హక్కు నిరూపించుకోవడానికి ఎవరి దగ్గరికి వెళ్లకుండా తన భూమికి చెందిన హక్కుపత్రం పొందడానికి వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా రెవెన్యూ శాఖకు మంచిపేరు వస్తుందన్నారు. అక్టోబర్ 2 నాటికి రెండువేల గ్రామాల్లో రీసర్వే పూర్తిచేసి అక్కడి రైతులకు భూ హక్కు పత్రాలు అందించడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. 2023 డిసెంబర్ నాటికి రాష్ట్రమంతా రీసర్వే పూర్తికావాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యుటేషన్ ద్వారా రికార్డులు మారే విధానం తీసుకొస్తామని చెప్పారు. 30 లక్షల మందికి ఇళ్లపట్టాల పంపిణీ, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాల ఏర్పాటు చరిత్రాత్మకమైనవన్నారు. 1954 సంవత్సరానికి ముందు అసైన్ అయిన అసైన్డ్ భూములు, చుక్కల భూములు, మాజీ సైనికోద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను నిబంధనల ప్రకారం నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించే అధికారం కలెక్టర్లకే ఇచ్చినట్లు చెప్పారు. దీనివల్ల భూములపై త్వరగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, కోర్టు కేసులు కూడా తగ్గుతున్నాయని తెలిపారు. చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వుల్లో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ జేసీలు కిందిస్థాయి అధికారులను చైతన్యపరచాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం, భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ), రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ సిద్ధార్థజైన్, సీసీఎల్‌ఏ కార్యదర్శి బాబు, అదనపు కార్యదర్శులు గణేష్‌కుమార్, తేజ్‌భరత్ తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ఏలూరు 7వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని

గడప గడపన ఉత్సాహం

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం ఉత్సాహభరితంగా సాగింది. తమ ఇంటికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు చేపట్టారు.



కృష్ణా జిల్లా పెడనలో అవ్వతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

> ఎవడు ఫలాపేక్ష కాంక్షింపక బ్రహ్మార్పణముగా కర్మల నాచరించునో, అతడు తామరాకుకు నీటిబిందువులు అంటని రీతిగా పాపమున చిక్కుబడడు.
>
> – భగవద్గీత

సాక్షి

శనివారం, సెప్టెంబర్, 3

వీగర్లపై చైనా పంజా

చైనా వాయవ్యప్రాంతం షింజియాంగ్‌లో సర్కారీ దౌష్ట్యానికి లోనవుతున్న మైనారిటీ వీగర్ ముస్లింల విషయంలో ఐక్యరాజ్యసమితి పట్టనట్టు వ్యవహరిస్తున్నదని కొంతకాలంగా హక్కుల సంస్థలు చేస్తున్న ఆరోపణలకు బ్రేక్ పడింది. అక్కడ చైనా ప్రభుత్వం తీవ్ర మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న సంగతి నిజమేనని గురువారం విడుదలైన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల పరిరక్షణ సంస్థ(యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) నివేదిక నిర్ధారించింది. ఈ నివేదిక బయటకు రాకుండా ఆపడానికి చైనా చేయని ప్రయత్నం లేదు. దీన్ని పూర్తిగా బుట్టదాఖలయ్యేలా చూడాలనీ, కనీసం నివేదిక విడుదలను దీర్ఘకాలం వాయిదాపడేలా చూడాలనీ చైనా అనేక ఎత్తులు వేసింది. ఇప్పుడిక నివేదికను ఖండించే పనిలోపడింది. 48 పేజీల యూఎన్‌హెచ్‌ఆర్‌సీ నివేదికకు 122 పేజీల్లో బదులిచ్చింది. ఆ ప్రాంత శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉగ్రవాదాన్ని, తీవ్రవాదాన్ని అణచేస్తున్నాం తప్ప సాధారణ పౌరుల జోలికి పోవటం లేదన్నది దాని సారాంశం.

నియంతృత్వం, అణచివేత గాల్లోంచి ఊడిపడవు. వాటికి రాజకీయ కారణాలతోపాటు ఆర్థిక, భౌగోళిక, జాతి, మత, భాషాపరమైన కారణాలు కూడా ఉంటాయి. వరమో, శాపమో వీగర్ ముస్లింలు అత్యధికంగా ఉండే షింజియాంగ్ ప్రాంతం పర్వతాలు, అడవులు, ఎడారులతో నిండి ఉంటుంది. వాటిమధ్య బతకడానికి అనువైన చోటు ఎంచుకోవడం వారికి కష్టమే. అందుకే జనావాసప్రాంతాలు విసిరేసినట్టు ఎక్కడెక్కడో ఉంటాయి. ఇరుగుపొరుగున రష్యాతోపాటు పలు మధ్య ఆసియా దేశాలుంటాయి. అందుకే దీన్ని నియంత్రించేందుకు ప్రస్తుత చైనా పాలకులు మాత్రమే కాదు... గతంలో పాలించినవారూ ప్రయత్నించారు. ఎందుకంటే ఇక్కడ అపారమైన ప్రకృతి సంపద ఉంది. పైగా వ్యూహాత్మకంగా చూస్తే పశ్చిమ దేశాలకు సమీపంగా, వాటిపై తన ప్రభావాన్ని పెంచుకునేందుకు వీలుగా ఈ ప్రాంతం ఉంటుంది. భౌగోళికంగా చిన్నదే అయినా షింజియాంగ్ ఎప్పుడూ బేలగా లేదు. చరిత్రలోకి తొంగిచూస్తే అనేక రాజరిక వ్యవస్థలకు అది కొరకరాని కొయ్యగా నిలిచింది. నియంత్రించడానికి ప్రయత్నించిన ప్రభుత్వాలకు చుక్కలు చూపింది. స్వయంప్రతిపత్తి నిలుపుకోవడమే లక్ష్యంగా పోరాడింది. 1949లో చైనా విప్లవ విజయానికి కాస్త ముందు ఆ ప్రాంతం స్వయంపాలనను రుచిచూసింది కూడా. కానీ జాతుల సమస్య విషయంలో కమ్యూనిస్టులకున్న అవగాహనను గౌరవించి కావొచ్చు... తొలిసారి వారికి తలవంచింది. ఆధిపత్య హాన్ జాతి పెత్తనమే ఇక్కడా కనబడటం, 1966–76 మధ్య సాగిన సాంస్కృతిక విప్లవకాలంలో అది మరింత బాహాటం కావడంతో మళ్లీ ఆ ప్రాంతం పోరుబాట పట్టింది. పథకం ప్రకారం వేరే ప్రాంతాలనుంచి హాన్ జనాభాను ఇక్కడికి తరలించడం, క్రమేపీ వారి రాజకీయ, ఆర్థిక ప్రాబల్యం పెంచడంతో వీగర్‌లు రగిలిపోయారు. 90వ దశకం మొదట్లో చెదురుమదురు నిరసనలుగా మొదలైన ఉద్యమం 2009 నాటికి తిరుగుబాటుగా మారింది. హింస చెలరేగి వందలాదిమంది ప్రాణాలు కోల్పోవడంతో 2014 నాటికి అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పూర్తిస్థాయి అణచివేత చర్యలకు ఆదేశాలిచ్చారు. అప్పటినుంచీ నరకానికి ప్రతీకలుగా ఉండే నిర్బంధ శిబిరాలకు లక్షలాదిమంది వీగర్లను తరలించారు. అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఉండే ఆ శిబిరాలు కిక్కిరిసి ఉంటున్నాయని వార్తలొస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈమధ్యవరకూ చైనా ఎవరినీ అనుమతించక పోవడంతో అనుమానాలు బలపడ్డాయి. సమితిలో కదలికలు రావడం మొదలయ్యాక శిబిరాల్లో పరిస్థితులు కొంత మారాయంటున్నారు. నిర్బంధితుల విడుదల కూడా చోటుచేసుకున్నదని కథనాలు వచ్చాయి. కానీ జరగాల్సినదాంతో పోలిస్తే ఇది చాలా స్వల్పం.

ఒక దేశ ఆంతరంగిక సమస్యగానో, సంబంధం లేని వ్యవహారమనో భావించి ప్రపంచ ప్రజానీకం ఈ నియంతృత్వ ధోరణులను చూస్తూ ఊరుకుంటే అంతటా ఇలాంటి పాలకులే తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈమధ్యే యూఎన్‌హెచ్‌ఆర్‌సీ హైకమిషనర్‌గా రిటైరైన మిషెల్ బాష్లెట్ చిలీలో పినోచెట్ పాలనాకాలంలో స్వయంగా నిర్బంధాన్ని అనుభవించినవారు. అందుకే ఆమె హైకమిషనర్‌గా వచ్చినప్పుడు అందరిలో ఆశలు చిగురించాయి. అందుకు తగ్గట్టు చైనా ఎంత మొండికేసినా దాన్ని ఒప్పించడానికి ఆమె ఓపిగ్గా ప్రయత్నించారు. పరిమిత సంఖ్యలోనైనా పాత్రికేయులను అక్కడి ప్రభుత్వం అనుమతించక తప్పని స్థితి ఏర్పడటం బాష్లెట్ విజయమే. కానీ ఏళ్లతరబడి నివేదిక వెలుగు చూడకపోవడం, అత్యంత అమానుషమైన ఉదంతాలు నిజమంటూనే వాటిని నరమేథంగా మాత్రం పరిగణించకపోవడం ఆమె పనితీరును ప్రశ్నార్థకం చేసింది. బక్క దేశాలపై ఆరోపణలు వచ్చినప్పుడు విరుచుకుపడే అగ్రరాజ్యాలు బలమైన దేశాలు కళ్లెదుటే దురాగతాలకు పాల్పడుతున్నా పట్టించుకోవు. అరబ్ దేశాలు వీగర్ ముస్లింలకు ఏదో ఒరగబెడతాయనుకోవడం దండగ. మతాన్ని కించపరిచారన్న ఆరోపణలపై తప్ప సాధారణ ముస్లింలపై జరిగే దాడుల విషయంలో అవి ఎప్పుడూ మౌనమే పాటిస్తాయి. చైనా రాక్షసత్వాన్ని నిగ్గుతేల్చడానికి మరింత లోతైన దర్యాప్తు అవసరమని నివేదిక తెలిపింది. యూఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్య దేశాలు అంగీకరిస్తేనే అది సాధ్యం. చైనా దీన్నెలాగైనా అడ్డుకుంటుంది. మొత్తానికి ఈ నివేదిక చైనా నేర వైఖరిని బయటపెట్టింది. ఉనికి కోసం, కనీస మానవ హక్కుల కోసం పోరాడుతున్న వీగర్ ముస్లింలకు నైతిక మద్దతునీయడం దేశదేశాల్లోని ప్రజాస్వామికవాదుల తక్షణ కర్తవ్యం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం
వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.సప్తమి ఉ.9.52 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** అనూరాధ రా.9.23 వరకు తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.2.37 నుండి 4.12 వరకు
దుర్ముహూర్తం: ఉ.5.50 నుండి 7.26 వరకు
అమృతఘడియలు: ఉ.11.28 నుండి 1.01 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

జోహార్ వైఎస్సార్!

వైయస్సరనగానె వర్షంబు గుర్తొచ్చు
చెరగని చిరునవ్వు గురుతు కొచ్చు
ధవళ కాంతులజల్లు ఉడుపులు గుర్తొచ్చు
తనశైలి కంఠస్వరంబు గురుతు
జనుల పలకరించు హావభావము గుర్తు
ఆప్యాయముగ పిల్చు తీరు గురుతు
పాద యాత్ర మొదలు పెట్టిన రోజైన
రెండువేలన్ మూడు తేది గుర్తు

తొమ్మిదేప్రెలంటె యువకుల కేరింత
తలకు రైతు లాగ పాగ జుట్టి
మండు టెండ లోన జర జరా నడచిరి
జీద బక్క జనుల బ్రతుకరయ

చిలక గోరు వంక చందాన కాపురము
చేయు చున్న ఒక్క జంట ఉండె
భర్త గుండె జబ్బు భార్య లబో దిబో
గన్న యట్టి మీరు కలత బడిరి

వాన రాక చెరువు వాగులెండి పోయి
కరువు కాటకాల క్రుంగి నట్టి
బక్క రైతు డొక్క పరికించి ఖేదించి
భయము వీడు మంటు భుజము తట్టి

త్రాగు సాగు నీరు ఆ భగీరదుడల్లె
అంద జేసి రైతు కండ నిలచి
విత్తు నిచ్చి ఉచిత విద్యుత్తు నందించ
పంట పండి రైతు పరవశించె

రోగి బాధ తీర్చ ఆరోగ్యశ్రీ యంటు
నూట ఎనిమిదంటు నాలు గంటు
పల్లె పల్లె యందు ఇంటికే వైద్యంబు
భరత దేశ మందు మొదటి సారి

రచ్చబండ కొస్త రండిరారండని
మమ్ము పిలిచి మీరు బయలు దేర
ఎదురు జూచి నాము కోలాట మాడుతూ
రచ్చ బండ కాడ రచ్చ రచ్చ

జాము గడచిపోయే జాడ తెలియదాయె
భయము ఆవహించె కీడు నెంచి
గుండె పగిలె పోయె చెడువార్త విన్నంత
బండ నెత్తి మీద బడ్డ యట్ల

నింగి కెగిరి నట్లె యెగిరి తిరిగిరాక
స్వర్గ లోక దారి బట్టి నావు
పావురాల గుట్ట పరలోక సోపాన
మైన తీరు దైవ ఘటన గాదె

పావురమ్ము బోలె కపట మెరుగనట్టి
మనసు మీది సుమ్ము విమల చరిత
మరువ జాల మన్న రెండు సెప్టెంబరు
తెలుగు జాతి యొక్క గ్రహణ రోజు

రాజ శేఖరుండ నీరాజనాలంటు
విగ్ర హంబు వెలసె ఊరి కొకటి
ప్రజల గుండెలందు ఇంతగా నిలిచిన
నాయకుండు గలడె మీరు తప్ప

– కల్లూరి ఆనంద్ రెడ్డి, పులివెందుల

బంగారు బాతును కాపాడుకోవాలి!

విశ్లేషణ



పి. సతీష్

ఎల్ఐసీ దేశానికి ఎంతో ఇచ్చింది. ఇంకెంతో ఇవ్వనుంది. మరి ప్రభుత్వం దానికి తిరిగి ఏమిస్తోంది? నష్టాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలనూ, కార్పొరేషన్లనూ ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేయడం ఒక విధానంగా పెట్టుకున్న కేంద్రం... అక్షయ పాత్రలాంటి ఎల్ఐసీనీ ప్రైవేటీకరించడానికి నిర్ణయించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? 1956లో ప్రభుత్వం సమకూర్చిన ఐదు కోట్ల రూపాయలతో వ్యాపారం ప్రారంభించి 66 ఏళ్లలో రూ. 31 వేల కోట్లు ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో ఇచ్చింది ఎల్ఐసీ. 2022 మార్చి 31 నాటికి రూ. 40,84,826 కోట్లు దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిగా పెట్టింది. అదే సమయంలో పేద, మధ్య తరగతి ప్రజలకు చౌకగా బీమా సౌకర్యాన్నీ కల్పిస్తూ వచ్చింది. అయినా ఎల్ఐసీలో 3.5 శాతం వాటాను ప్రభుత్వం అమ్మివేసింది.

ఈ మధ్య ఎన్‌టీఆర్ఐను ప్రారంభిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్) ఎల్ఐసీ (లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) లేకుండా దేశ ప్రగతిని ఊహించుకోలేమనీ, ఎల్ఐసీ గత 66 ఏళ్లలో అద్భుతంగా రాణిస్తోందనీ కితాబు ఇచ్చారు. అటువంటి అద్భుత సంస్థ 'యోగక్షేమం వహామ్యహం' (ప్రజల యోగక్షేమాలకు నేనే బాధ్యత వహిస్తాను) అనే నినాదంతో మొదలై 2022 సెప్టెంబర్ 1 నాటికి 66 ఏళ్ళు పూర్తి చేసుకుని 67వ ఏడాదిలోకి అడుగుపెట్టింది.

1956లో ఎల్ఐసీ ఆవిర్భవించిన నాటి నుండి 'ప్రజల పొదుపు ప్రజా సంక్షేమానికి' అనే నినాదంతో, ఉన్నత లక్ష్యాలతో పనిచేయబట్టే... నేడు ప్రజల, పాలసీ దారుల చిరస్మరణీయమైన నమ్మకం చూరగొంది. అడుగడుగునా తనను నమ్మి తన మీద భరోసా పెట్టుకున్న ఖాతాదారులకు అభయం ఇచ్చి, ఎల్ఐసీ దేశీయ జీవిత బీమా రంగంలో మార్కెట్ మేకర్‌గా తన జైత్రయాత్ర కొనసాగిస్తోంది. 2022 మార్చి 31 నాటికి ఎల్ఐసీ రూ. 40,84,826 కోట్ల పెట్టుబడులను మన దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టింది. ఇందులో రూ. 28,85,569 కోట్ల నిధులను హౌసింగ్, నీటిపారుదల సౌకర్యాల కల్పనకూ; కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీలకూ కేటాయించింది. 12వ పంచవర్ష ప్రణాళిక కాలంలో రూ. 14,23,055 కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ఎల్ఐసీ సమకూర్చింది. దేశ అంతర్గత వనరుల సమీకరణలలో ఎల్ఐసీ వాటా 25 శాతం పైమాటే!

2021–22 ఆర్థిక సంవత్సరంలో క్లెయిముల చెల్లింపుల రూపేణా దాదాపు లక్ష కోట్ల మేరకు పాలసీ దారులకు చెల్లించింది. 99 శాతం క్లెయిముల పరిష్కారం రేటుతో క్లెయిముల పరిష్కారంలో ప్రపంచం లోనే అత్యుత్తమ సంస్థగా పేరెన్నికగన్నది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే (ఏప్రిల్ నుండి జూన్ లోపల) 85,298 కోవిడ్ డెత్ క్లెయిములను పరిష్కరించి, రూ. 2,334 కోట్లు పాలసీదారుల వారసులకు చెల్లించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 614 శాతం ఎక్కువ. నిమిషానికి 41 పాలసీలను విక్రయిస్తూ, 2021–22 ఆర్థిక సంవత్సరంలో 2 కోట్ల 17 లక్షల పాలసీలను ఎల్ఐసీ సేకరించింది. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం నికర ప్రీమియం ఆదాయం పెరిగింది.

22 సంవత్సరాల పోటీ తర్వాత కూడా ఎల్ఐసీ ప్రీమియం ఆదాయం అంశంలో మార్కెట్ వాటాలో 65 శాతం కలిగి ఉంది. పాలసీల సంఖ్యలో దాదాపు 74 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. ఇది అపూర్వమైన ఘనత. ఏ దేశంలో లేని విధంగా... ఒకే కంపెనీ, అది కూడా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంపెనీ, మార్కెట్ ఆధిపత్యాన్ని కలిగి ఉండటం ఒక్క ఎల్ఐసీ విషయంలో మాత్రమే సాధ్యమైంది. గత ఏడాది ఈక్విటీ మార్కెట్ల పెట్టుబడులపై రూ. 36,000 కోట్లు లాభం ఆర్జించిన ఎల్ఐసీ సంస్థ, ఈ ఏడాదిలో రూ. 42,000 కోట్లు లాభాలు ఆర్జించింది.



గత ఏడాది జూన్ నాటికి ఎల్ఐసీ ఆస్తులు రూ. 38.13 లక్షల కోట్లు కాగా, ఇప్పుడవి రూ. 42 లక్షల కోట్లకు చేరుకున్నాయి. 23 ప్రయివేటు బీమా కంపెనీల మొత్తం ఆస్తుల కన్నా 3 రెట్లు ఆస్తులు, ఎల్ఐసీ సంస్థ కలిగి ఉంది. రెండో అతిపెద్ద ప్రయివేటు జీవిత బీమా కంపెనీ ఎస్‌బీఐ లైఫ్‌తో పోలిస్తే, ఎల్ఐసీ ఆస్తులు 16 రెట్లు ఎక్కువ. దేశంలో మొత్తం మ్యూచ్యువల్ ఫండ్ల ఆస్తుల కన్నా, ఎక్కువ ఆస్తులను ఎల్ఐసీ కలిగి ఉంది.

2021–22లో పాలసీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులలో 98 శాతం 15 రోజుల వ్యవధిలోనే పరిష్కరించి అత్యుత్తమ పారదర్శక సంస్థగా నిలిచింది. 'ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన' పథకం ద్వారా అతి తక్కువ ప్రీమియంతో ప్రజలకు బీమా రక్షణ కల్పిస్తోంది. కార్పొరేట్ నిర్వహణలో ఎల్ఐసీ అనేక అవార్డులు, రివార్డులు పొందింది. స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు చోటుచేసుకున్న ప్రతి సందర్భంలోనూ ఎల్ఐసీనే మార్కెట్లను ఆదుకుంది. 'మోస్ట్ ట్రస్టెడ్ బ్రాండ్'. 'బెస్ట్ బ్రాండ్ అవార్డ్'తో సహా ప్రతిష్ఠాత్మకమైన 25 అవార్డులను ఎల్ఐసీ సొంతం చేసుకుంది. అనేక సార్లు అత్యుత్తమ కార్పొరేట్ నిర్వహణకు 'బంగారు నెమలి'ను పొందింది.

ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుదేలై ఉన్న అస్తవ్యస్త పరిస్థితుల నడుమ ఎల్ఐసీని స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేశారు. దాంతో తర్వాత కాలంలో ఎల్ఐసీ షేర్ విలువ దాదాపు 28 శాతం తగ్గిపోయింది. దీన్ని అవకాశంగా తీసుకుని, ఎల్ఐసీ సంస్థ ఏనుగు వలే శక్తిమంతమైనది అయినప్పటికీ, అది నాట్యం చేయలేదని కొందరు మార్కెట్ పండితులు ప్రతికూల వ్యాఖ్యలు చేశారు. అయితే, జేపీ మోర్గాన్ సంస్థ తన తాజా నివేదికలో, ఎల్ఐసీ నిజ విలువను, శక్తిని గుర్తించడంలో మార్కెట్ విఫలమైందని వ్యాఖ్యానించింది.

గత ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టర్లో ఎల్ఐసీ నూతన వ్యాపార వృద్ధి రేటు 95 శాతంగా ఉంది. కాగా, ప్రయివేటు బీమా కంపెనీల వృద్ధి దాదాపు 48 శాతం మాత్రమే. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి దాకా ఎల్ఐసీ వృద్ధి రేటు 63 శాతం కాగా, ప్రయివేటు కంపెనీల వృద్ధి రేటు 38 శాతంగా ఉంది. తాజాగా ఎల్ఐసీ ఫార్చ్యూన్ గ్లోబల్ -500 కంపెనీల జాబితాలో చోటు సంపాదించింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి లిస్ట్ అయిన కంపెనీల ఆదాయం, లాభాల ఆధారంగా తయారు చేసిన ఈ జాబితాలో లిస్టింగ్ అయిన రెండు నెలల లోపలే ఎల్ఐసీ 98వ స్థానం పొందింది. ఎల్ఐసీ వ్యాపారాభివృద్ధి పెరుగుతున్న నేపథ్యంలో మళ్లీ ఎల్ఐసీ షేర్ విలువ కూడా పెరుగుతోంది.

దేశంలో ద్రవ్యోల్బణం దౌడుతీస్తోంది. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ క్షీణిస్తోన్న పరిస్థితుల్లో సైతం ఎల్ఐసీ చక్కని ప్రదర్శన చేస్తోంది. ప్రయివేటు బీమా సంస్థలు మెట్రోలు, మహానగరాలకే పరిమితమయినా... ఎల్ఐసీ గ్రామీణ ప్రాంతాలకూ తన సేవలను విశేషంగా అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుండి ఎల్ఐసీకి 48.22 శాతం ఏజెంట్లు ఉండగా, వారి ద్వారా ఎల్ఐసీకి మొత్తం పాలసీలలో 21.46 శాతం, ప్రీమియంలో 15.6 శాతం వ్యాపారం వస్తోంది. గ్రామీణ ప్రాంతాలను, బలహీన వర్గాలను విస్మరిస్తే తలెత్తే ప్రతికూల ప్రభావం ఈ గణాంకాల ద్వారా అర్థమవుతుంది. ఎల్ఐసీ వ్యాపారాన్ని గమనిస్తే 28.89 శాతం పాలసీదారులు సాలీనా లక్ష కంటే తక్కువ సంపాదన గలవారు. 43 శాతం పాలసీదారుల వార్షిక ఆదాయం రూ. లక్ష నుండి రెండు లక్షల మధ్యలో ఉన్నది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ పాలసీల సగటు ఏడాది ప్రీమియం రూ. 25,000 కాగా, ప్రయివేటు కంపెనీ లలో ఇది రూ 1,06,000 గా ఉంది. దీనిని విశ్లేషించినప్పుడు ప్రైవేటు బీమా కంపెనీలు పెద్ద పాలసీలపై దృష్టి పెడితే, ఎల్ఐసీ సంస్థ ఒక్కటే సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకూ బీమా రక్షణ కలిగిస్తోందని స్పష్టమవుతోంది. పెద్ద ప్రీమియం పాలసీలు, అర్బన్ వ్యాపారం బీమా సంస్థలకు లాభసాటి గనుక, ఎల్ఐసీలో వాటాలు కొన్న పెట్టుబడిదారులకు అధిక లాభాలను తెచ్చి పెట్టే వ్యాపారం వైపు సంస్థ పరుగులు పెట్టవలసి వస్తే అది భారతదేశ గ్రామీణ పేద, బలహీన వర్గాల ప్రయోజనాలకు భంగకరం అవుతుంది. 40 లక్షల మంది ఎల్ఐసీ షేర్ హోల్డర్ల ప్రయోజనాల కన్నా, 40 కోట్ల పాలసీదారుల ప్రయోజనాలూ, విశాల దేశ ప్రయోజనాలే పరమావధిగా ఎల్ఐసీ బోర్డు అడుగులు వేయాలి.

ప్రజల, ఉద్యోగుల తీవ్ర వ్యతిరేకత నడుమ ఎల్ఐసీలో 3.5 శాతం వాటాలు మాత్రమే ప్రస్తుతానికి అమ్మడం జరిగింది. ఎల్ఐసీ కేంద్ర ప్రభుత్వానికి అక్షయ పాత్ర లాంటిది. 1956లో ప్రభుత్వం ఇచ్చిన ఐదు కోట్ల రూపాయలతో కార్యకలాపాలు ప్రారంభించి... ఇప్పటివరకూ 31 వేల కోట్ల రూపాయలు కేంద్రానికి డివిడెంట్ చెల్లించింది. నిరంతరం, దేశాభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం నిధులు అందిస్తూనే ఉంది. అటువంటి బంగారు బాతును జాగ్రత్తగా కాపాడుకోవాల్సింది పోయి తెగనమ్మే ప్రయత్నాలు చేయడం సరికాదు. ప్రభుత్వం తన విధానాన్ని పునస్సమీక్షించుకుంటుందని ఆశిద్దాం.

వ్యాసకర్త ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం,
సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షులు । 94417 97900

నాన్నే స్ఫూర్తిగా...



నాన్న భౌతికంగా దూరమైనా నేటికీ ఆయన చిరునవ్వు, ఆ జ్ఞాపకాలు అలానే నిలిచి ఉన్నాయి. దేశచరిత్రలోనే సంక్షేమాన్ని సరికొత్తగా నిర్వచించి, ప్రజల అవసరాలే పాలనకు ప్రధానాంశం కావాలని ఆయన చాటిచెప్పారు. ప్రతి అడుగులోనూ నాన్నే స్ఫూర్తిగా ఇకపై కూడా ఈ ప్రభుత్వం అడుగులు వేస్తుంది.

– వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

వాటిని తొలగించాలి



రాజ్యాంగ ప్రవేశికలోంచి లౌకికవాదం, సామ్యవాదం తొలగించాలని కోరుతూ నేను వేసిన రిట్ పిటీషన్ సుప్రీం కోర్టు ముందుకొచ్చింది. అంబేడ్కర్ 1949లో ఈ రెండు పదాలను చేర్చడాన్ని రాజ్యాంగ విధానసభలో తిరస్కరించారు. కానీ అత్యవసర పరిస్థితి కాలంలో ఇందిరాగాంధీ వీటిని చేర్చేలా చూశారు. ఇప్పుడు రిట్ పిటీషన్ ప్రధాన న్యాయమూర్తి ముందుకు సెప్టెంబర్ 23న వస్తుంది.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

శివాజీ ముద్ర




ఛత్రపతి శివాజీ ఏమీలేని దశ నుంచి భీతి గొలిపే అతిపెద్ద నౌకాదళాన్ని నిర్మించారు. ప్రస్తుత అత్యంత భీతి గొలిపే భారత నౌకాదళపు చిహ్నంలో ఆయన రాజముద్ర ప్రతిఫలిస్తోంది. కొందరు గొప్పదనం కోసం ముందుకెళ్తారు, కొందరు వెనక్కి వెళ్తారు. మనం రెండూ చేస్తాం. 'శం వో వరుణః' (వరుణా, శుభాలు కలిగించు).

– ఆనంద్ రంగనాథన్, రచయిత

కపటం లేని ఆ మందహాసం...

సందర్భం



భండారు శ్రీనివాసరావు

సరిగ్గా పదమూడేళ్ల క్రితం, 2009 సెప్టెంబరు రెండో తేదీన యావత్ తెలుగు ప్రజానీకం పడిన ఆందోళన ఇంకా గుండెల్లో పచ్చిగానే ఉంది. ఒక వ్యక్తి గుణ గణాలను సమాజం సంపూర్తిగా అవగాహన చేసుకునేది అతడి మరణం తర్వాతనే అన్నది రాజశేఖర రెడ్డి విషయంలో నూటికి నూరుపాళ్ళు నిజమైంది. 'రాజశేఖరా! నీపై మోజు తీరలేదురా!' అని తెలుగు ప్రజానీకం రెండో పర్యాయం అధికార పగ్గాలు అప్పగించి వంద రోజులు నిండీ నిండగానే, రాజశేఖరుడికి నూరేళ్ళు నిండిపోవడం అత్యంత విషాదకరం. మాట తప్పని మనిషిగా, మడమ తిప్పని వీరుడిగా పేరు తెచ్చుకున్న వైఎస్సార్ అరవై ఏళ్ళు రాగానే రిటైర్ అయిపోతానన్న మాటని నిలబెట్టుకుంటూ, జీవితం నుంచే రిటైర్ కావడం అన్నది, ఆయన పథకాల ద్వారా బతుకులు పండించుకుంటున్న బడుగు జీవుల దురదృష్టం.

1978 నుంచి ఒక జర్నలిస్టుగా ఆయన్ని కలుసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. విలేఖరులను విందు సమావేశాలకు ఆహ్వా నించినప్పుడు ఆయన తరహానే వేరుగా ఉండేది. బిగుసుకుపోయినట్టు ఉండడం, మర్యాద కోసం మొహాన నవ్వు పులుముకోవడం ఆయన స్వభావానికే విరుద్ధం. నవ్వులో స్వచ్ఛత, పిలుపులో ఆత్మీయత ఉట్టిపడేవి. నమ్మినవాళ్ళని నట్టేట ముంచకపోవడం, నమ్ముకున్నవాళ్ళకోసం ఎంత దూరమైనా వెళ్ళడం జన్మతః అబ్బిన గుణాలు. వీటివల్ల, రాజకీయ జీవితంలో మేలు కన్నా కీడే ఎక్కువగా జరిగిన సందర్భాలున్నా, ఆయన లెక్కపెట్టింది లేదు. తీరు మార్చుకున్నదీ లేదు. ఈ విలక్షణ లక్షణమే వైఎస్సార్‌కు రాష్ట్రవ్యాప్తంగా అభిమానులను తయారుచేసి పెట్టింది. ఎన్నికలు వచ్చినప్పుడు కేవలం తన నియోజకవర్గానికే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పార్టీ తరఫున ప్రచారం చేయగల ఖలేజాను ఆయనకు కట్టబెట్టింది.

1975లో నేను రేడియో విలేఖరిగా హైదరాబాదులో అడుగుపెట్టిన మూడేళ్ళ తరవాత రాజశేఖరరెడ్డి తొలిసారి శాసనసభకు ఎన్నిక కావడం, మంత్రి పదవి చేపట్టడం జరిగింది. వైఎస్సార్‌ను నేను మొదటిసారి చూసింది, ఆ రోజుల్లో సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న సరోవర్ హోటల్ (ఇప్పుడు మెడిసిటీ హాస్పిటల్) టెర్రేస్ మీద. సచివాలయంలో జరిగిన ఒక సంఘటన దరిమిలా వివరణ ఇచ్చేందుకు విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేసిన సందర్భమది. అప్పట్లో ఆయన ఒక తరహా మీసకట్టులో కనిపించేవారు. కానీ, కపటం లేని మందహాసానికి మాత్రం అప్పటికీ, ఇప్పటికీ ఆయనదే కాపీ రైట్.

ఇటు హైదరాబాదులోనూ, అటు ఢిల్లీలోనూ వైఎస్సార్ నివాసాలు జర్నలిస్టులతో కళకళలాడుతూ ఉండేవి. వేళాపాళాతో నిమిత్తం లేకుండా ఆ ఇళ్ళకి వెళ్ళివచ్చే చనువు ఉండేది. 2004లో ఆయన తొలిసారి సీఎం కాగానే, ఆయనతో ఉన్న సాన్ని హిత్యాన్ని ఉపయోగించుకుని, కేవీపీ ద్వారా నా మనసులోని మాటని ఆయన చెవిన వేశాను. అప్పటికే కొన్ని ప్రైవేటు టీవీ ఛానళ్ళు రంగప్రవేశం చేసినందు వల్ల, రేడియో కేంద్రానికి వచ్చి తొలి సందేశం రికార్డు చేయడమన్నది కొద్దిగా ఇబ్బందే. అయినా, ఆయన నా మాట మన్నించి, నేరుగా ఆకాశవాణి కేంద్రానికి వచ్చారు. అలాగే, హైదరాబాదు దూరదర్శన్‌లో నేను రిటైర్ కావడానికి ముందు కూడా స్టూడియోకు వచ్చి ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఒక విలేఖరికీ, ఒక రాజకీయ నాయకుడికీ నడుమ సహజంగా ఉండే సాధారణ సంబంధాన్ని మహోన్నతంగా పెంచి పెద్ద చేసిన పెద్దమనసు ఆయనది. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా పెనవేసుకున్న ఈ బంధం శాశ్వతంగా తెగిపోయిందే అన్న బాధతో, ఆ మహోన్నత వ్యక్తిత్వానికి నివాళి అర్పిస్తూ, 'రెండు కన్నీటి బొట్లు' రాల్చడం మినహా ఏమీ చేయలేని చేతకానితనం నాది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్



సెప్టెంబర్ 2న వైఎస్సార్ వర్ధంతి

సంక్షేమానికి చెదరని చిరునామా

సందర్భం



టి. వేణుగోపాలరావు


నాలుగేళ్ల క్రితం చెన్నై వెళ్లినప్పుడు మా బంధువొకాయన దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గురించి ఒక ప్రశ్న వేశారు. 'వైఎస్‌కు ముందు కూడా సంక్షేమ పథకాలు అమలు చేసిన నేతలున్నారు కదా, కానీ ఆ పథకాలు ప్రస్తావనకు వచ్చినప్పుడు వైఎస్‌నే అందరూ ఎందుకు గుర్తు చేసుకుంటార'న్నది ఆ ప్రశ్న సారాంశం. నిజమే... ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టి నిరుపేదలకు రోజూ గుక్కెడు బువ్వ అందుబాటులోకి వచ్చేలా చేశారు. 'గరీబీ హఠావో' అంటూ ఇందిరాగాంధీ కూడా ఎన్నో పథకాలు తెచ్చారు. అయితే వైఎస్ అమలు చేసిన పథకాల ఒరవడే వేరు. జన సంక్షేమానికి సిసలైన నిర్వచనంగా నిలిచాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 అసెంబ్లీ ఎన్నికల బరిలోకి కాంగ్రెస్ దిగే సమయానికి రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా నిస్తేజం అలుముకుంది. అప్పటికి ఏడెనిమిదేళ్ల క్రితం వచ్చిపడిన ఉదారవాద ఆర్థిక విధానాల పర్యవసానంగా చేతివృత్తులు దెబ్బతిన్నాయి. వరస కరవులతో రైతాంగం అల్లాడుతోంది. కొనుక్కునే స్థోమత ఉంటే తప్ప నాణ్యమైన చదువుకు దిక్కు లేకుండా పోయింది. రోగం వచ్చి ఆసుపత్రులకు వెళ్లినవారికి యూజర్ ఛార్జీల బాదుడు మొదలైంది. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచార యావతో ఇతర సీఎంల కన్నా అత్యుత్సాహంగా సంస్కరణలు అమలు చేయడం వల్ల ఏపీ మరింత దుర్భరంగా మారిందేమో గానీ దేశవ్యాప్తంగా కూడా పరిస్థితి ఏమంత మెరుగ్గా లేదు. నేలవిడిచి సాము చేసే నాయకులను తమ ముఖపత్రాలపై అచ్చోసే అంతర్జాతీయ పత్రికలకు అప్పుడు కొదవలేదు.

సరిగ్గా ఆ సమయంలో వైఎస్సార్ పాదయాత్ర నిర్వహించి ప్రజల దుర్భర స్థితిగతులను దగ్గర నుంచి చూశారు. 1,400 కిలోమీటర్ల పాదయాత్ర వునా సామాన్యుల గుండె ఘోషను అతిదగ్గర నుంచి వినగలిగారు. తర్వాత కాలంలో ఆయనే చెప్పుకున్నట్టు ఆ పాదయాత్ర ఎన్నో పాఠాలు నేర్పింది. రాగల అయిదేళ్లకూ పాలనా ప్రణాళికను నిర్దేశించింది. రాయలసీమ ప్రాంత నేతగా సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యంపై ఆయనకు మొదటి నుంచీ అవగాహన ఉంది. కానీ అది 'జలయజ్ఞం'గా రూపుదిద్దుకున్నది జనం మధ్యనే! అన్ని ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలన్న ఆ లక్ష్యం వేల కోట్ల వ్యయంతో ముడిపడి ఉంటుంది గనుక అది అసాధ్యమనుకున్నారంతా! కానీ భర్తృహరి చెప్పినట్టు ఎన్ని అడ్డంకులెదురైనా వెరవక తుదికంటా శ్రమించడమే కార్యసాధకుల నైజమని వైఎస్ భావించారు. ఈ అనితర సాధ్యమైన ప్రయత్నానికి సమాంతరంగా ఉచిత విద్యుత్ జీవోపై తొలి సంతకం చేసి అన్నివిధాలా చితికిపోయి ఉన్న రైతాంగానికి తక్షణ జీవశక్తిని అందించారు. వ్యవసాయాన్ని మళ్లీ పట్టాలెక్కించి, దాని పునరుజ్జీవానికి బాటలు పరిచారు. ఆకాశపు దారుల్లో హడావిడిగా పోయే ఆరోగ్య సిరిని భూమార్గం పట్టించి నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం దక్కేలా చూశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో నిరుపేదలకు ఉన్నత చదువులు అందుబాటులోకి తెచ్చారు. అధోగతిలో ఉన్న సహకార వ్యవస్థను ఆదుకున్నారు. పల్లెలు కళకళలాడేలా చేశారు.

ప్రపంచీకరణ విధానాల యుగంలో అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో మేళవించి చూపిన సాహసిగా, తనకు తెలిసినవారైనా కాకున్నా, తన పార్టీవారు అయినా కాకున్నా సాయం కోరివచ్చిన వారందరి పట్లా ఒకేలా స్పందించిన సహృదయుడిగా వైఎస్ చిరస్థాయిగా నిలుస్తారు. పీవీ హయాంలో కేంద్ర ఆర్థికమంత్రిగా పనిచేసి, ఆర్థిక సంస్కరణలను అమలు చేసిన ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ వంటి నేతను దేశవ్యాప్త రైతాంగానికి రుణమాఫీ తక్షణావసరమని ఒప్పించడంలో వైఎస్ రాజశేఖరరెడ్డిది కీలక పాత్ర. ఇలాంటి నాయకుడు సంక్షేమానికి శాశ్వత చిరునామా కావడంలో, ఆ విషయంలో అఖిల భారతావనికి అడుగుజాడ కావడంలో ఆశ్చర్యమేముంది?

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

'ధన'నాథుడు



గుంటూరులోని ఆర్.అగ్రహారం శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీ దశావతార గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గణనాథుడిని కోటీ అరవై ఐదు లక్షల రూపాయలతో అలంకరించారు. శ్రీలక్ష్మీగణపతికి భక్తులు పూజలు నిర్వహించారు.

చెత్త సేకరణపై నిఘా

సిటిజన్ యాప్‌ను రూపొందించిన పంచాయతీరాజ్ శాఖ

- ప్రతీ కుటుంబంలోని ఒకరి ఫోనులో యాప్ డౌన్‌లోడ్‌కు చర్యలు
- ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్న వారు 67.08 లక్షల మంది
- చెత్తను సేకరించారా లేదా తెలపాలని రోజూ ప్రతీ ఇంటికీ మెసేజ్
- లేదని బదులు వస్తే వెంటనే చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో 'క్లాప్'మిత్రలు రోజూ చెత్తను సేకరిస్తున్నారా లేదా అన్నది తెలుసుకునేందుకు పంచాయతీరాజ్ శాఖ యాప్ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. ఇందుకోసం 'సిటిజన్ యాప్'ను రూపొందించింది. దీనిని ప్రతీ కుటుంబంలో స్మార్ట్‌ఫోన్లు ఉన్న వారితో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్ర (క్లీన్ ఆంధ్ర ప్రదేశ్)లు డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 99,84,421 కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకు 67,08,960 మంది తమ ఫోన్లలో ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. మిగిలిన కుటుంబాల వారికీ ఆ యాప్‌ను అందుబాటులో తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, తూర్పు గోదావరి, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో అత్యధిక కుటుంబాలు ఈ యాప్‌ను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నాయి.

బదులిచ్చేవారు తక్కువే..

మరోవైపు.. చెత్త సేకరణపై పంపే మెసేజ్‌లకు ప్రతిస్పందిస్తున్న వారి సంఖ్య అతి తక్కువగా ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖాధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 70 లక్షల ఇళ్ల నుంచి రోజూ చెత్త సేకరణ చేస్తున్నట్లు వారు తెలిపారు. వీటిలో దాదాపు 50 లక్షల కుటుంబాలకు పైగానే రోజూ మెసేజ్‌లు పంపుతున్నామని.. కానీ, బదులిస్తున్న వారి సంఖ్య ఐదువేలలోపే ఉంటోందన్నారు. 20 రోజుల క్రితమే ఈ యాప్ ప్రక్రియ మొదలైందని.. అందరూ దానిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవడానికి మరో రెండు మూడు నెలల సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. అదే జరిగితే గ్రామాల్లో చెత్త సేకరణకు యాప్ పూర్తిస్థాయిలో దోహదపడుతుందని వారు చెబుతున్నారు.



చెత్త సేకరణపై రోజూ మెసేజ్‌లు..

ఇక సిటిజన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న ప్రతీ ఫోనుకు 'ఈ రోజు మీ ఇంటి నుంచి చెత్తను సేకరించారా' అని ప్రశ్నిస్తూ 'ఎస్' లేదా 'నో ' చెప్పాలని పంచాయతీరాజ్ శాఖ మెసేజ్ పంపుతోంది. ఎవరైనా 'నో' అని బదులిస్తే, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి సంబంధిత జిల్లా పంచాయతీ అధికారి ద్వారా ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి, క్లాప్‌మిత్ర నుంచి వివరణ కోరతారు. అదే రోజు లేదా మర్నాడు ఆ ఇంటి నుంచి చెత్తను సేకరించేలా మండల, జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపడతారు.

'పోలవరం'లో రాళ్ల నాణ్యత పరిశీలన



రాళ్ల నాణ్యత ప్రమాణాలు పరిశీలిస్తున్న సీఎస్ఎంఆర్ఎస్ బృందం సభ్యులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వినియోగించే రాళ్ల నాణ్యత ప్రమాణాలను కేంద్ర జలసంఘంలోని సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ సెంటర్ (సీఎస్ఎంఆర్ఎస్) బృందం పరిశీలించింది. సీఎస్ఎంఆర్ఎస్ సభ్యులు సందీప్ దనోత్, ఉదయ్ శుక్రవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుని పనులను పరిశీలించారు. గైడ్ బండ్(రాతి గోడ) నిర్మాణానికి ఉపయోగించే రాళ్లను పరీక్షించారు. ఒక కి.మీ పరిధిలో 53 మీటర్ల ఎత్తున రాతి గోడ నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు 42 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణం పూర్తయింది. ఈ పనులను పర్యవేక్షించారు. ప్రాజెక్టు ప్రాంతంలో ఉన్న ల్యాబ్‌లో కొన్ని పరీక్షలు నిర్వహించారు. శనివారం కాఫర్ డ్యామ్ నిర్మాణ పనులను కూడా పరిశీలించనున్నారు.

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- వైజాగ్ ఏజెన్సీలో 7,500 ఎకరాల్లో గంజాయి పంట ధ్వంసం
- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



తిరుపతి క్రైం: నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. జూలై, ఆగస్టు నెలల్లో రాష్ట్రంలో నేరాల శాతం బాగా తగ్గిందన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో జరిగిన నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్, తిరుపతి, చిత్తూరు ఎస్పీలు పరమేశ్వర్‌రెడ్డి, రిషాంత్‌రెడ్డిలతో ఆయన శుక్రవారం తిరుపతిలో సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ గత నాలుగేళ్లలో జూలై, ఆగస్టు నెలల్లో జరిగిన నేరాలతో పోలిస్తే ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో చాలావరకు తగ్గాయని చెప్పారు. ప్రతినెల నేరసమీక్ష నిర్వహిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేకకృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే టైం స్లాట్ ఆధారంగా డేటా సేకరించి బారికేడ్స్, స్పీడ్ బంప్స్, సూచిక బోర్డులు, పెట్రోలింగ్ వంటి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పోలీసులు విధుల్లో అత్యుత్సాహం ప్రదర్శించకుండా దృష్టి సారిస్తున్నామన్నారు. కుప్పంలో జరిగిన ఘటన శాంతి భద్రతలను ఇబ్బంది పెట్టేంత సమస్య కాదని చెప్పారు. చట్టపరంగా ఇరుపక్షాలను పిలిచామని, ఎస్పీ పిలిచినా టీడీపీ నాయకులు స్పందించలేదని తెలిపారు. కుప్పం ఘటనలో పాల్గొన్నవారంతా స్థానికులేనన్నారు. చంద్రబాబుకు భద్రత పెంపు అంశం తమది కాదన్నారు. వైజాగ్ ఏజెన్సీలో గత ఏడాది 7,500 ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేశామని, రైతులు గంజాయి పంటను విడిచి ప్రత్యామ్నాయ పంటలు పండించేలా ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఎంపీ గోరంట్ల మాధవ్ వీడియోపై బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఆ వీడియోపై సీఐడీ పోలీసులు విచారిస్తున్నారని తెలిపారు. ఇక నల్లబెల్లం విషయంలో రైతులందరిపై కేసులు పెట్టడం లేదన్నారు.

మూడేళ్లుగా కరువు మండలాలే లేవు

- వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి



ఏలూరు(మెట్రో): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి చెప్పారు. రాష్ట్ర వ్యాప్త రైతుల ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడారు. మూడేళ్లలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రైతు సంక్షేమంలో భాగంగా రూ. 83 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందించిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో గడిచిన మూడేళ్లలో ఎక్కడా కరువు మండలాలు నమోదు కాలేదని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని, మరింతగా రైతులకు ఏం కావాలో తెలుసుకునేందుకు సీఎం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 11 జిల్లాల్లో పర్యటించి రైతుల అభిప్రాయాలు, వినూత్న పంటల సాగు విధానాలను తెలుసుకున్నామన్నారు. అన్ని జిల్లాల్లో పర్యటించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. ఎటువంటి పక్షపాతం లేకుండా రైతు పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో స్థానికంగా ఉన్న అవసరాలు, అవకాశాలపై చర్చించి సాగును మరింత ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పామాయిల్ రైతులకు ధరలు చెల్లించామని, ప్రస్తుతం ధరల విషయంలోనూ ప్రభుత్వంతో సంప్రదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

81.26 శాతం మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 41.48 లక్షల మందిని పరీక్షించాలని లక్ష్యం
- 33,71,034 మంది విద్యార్థులకు పరీక్షలు పూర్తి
- రక్తహీనత బాధితుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు (హెల్త్ స్క్రీనింగ్) తుదిదశకు చేరుకున్నాయి. విద్యార్థుల్లో రక్తహీనతతో పాటు ఇతర సమస్యలను గుర్తించేందుకు వైద్యశాఖ ఈ కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45 వేల ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి వరకు చదువుతున్న 41.48 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 33,71,034 (81.26 శాతం) మంది విద్యార్థులను పరీక్షించారు. సచివాలయాల ఏఎన్ఎంలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులను పరీక్షించి వారి ఆరోగ్య వివరాలను స్కూల్ హెల్త్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. విద్యార్థుల ఎత్తు, బరువు, బాడీమాస్ ఇండెక్స్ వివరాలు సేకరించడంతోపాటు రక్తహీనత గుర్తించేందుకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్తహీనత సమస్య ఉన్న వారిపై వైద్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థుల్లో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ఇప్పటికే వారానికి ఒకసారి పాఠశాలల్లో ఐరన్ ఫోలిక్ మాత్రలను వైద్యశాఖ సరఫరా చేస్తోంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షల్లో గుర్తించిన రక్తహీనత బాధిత విద్యార్థులను సంబంధిత పీహెచ్‌సీ వైద్యుడికి మ్యాప్ చేస్తున్నారు. వైద్యులు ఆ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి రక్తహీనత సమస్యను అధిగమించడానికి చర్యలు చేపడుతున్నారు.

ఆర్బీకేలు వినూత్నం

- గ్రామ స్థాయిలో రైతులకు సేవలు
- 10,778 ఆర్బీకేల ద్వారా రెండేళ్లుగా రైతులకు ఇన్‌పుట్స్
- గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి కాకాణి, స్పెషల్ సీఎస్ ప్రజెంటేషన్

సాక్షి, అమరావతి : గ్రామ స్థాయిలో రైతుల మంగిటకే సేవలందించే సంకల్పంతో ఆర్బీకేలను తీసుకొచ్చామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఆలోచనల మేరకు ఏర్పాటు చేసిన ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో అంతర్జాతీయంగా పేరొందిన మాగ్నస్ సంస్థ పారిస్ కేంద్రంగా నిర్వహిస్తున్న రెండో గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో 'రైతు భరోసా కేంద్రాలు-ఫార్మర్స్ ఫెసిలిటేషన్ సెంటర్స్' అనే అంశంపై శుక్రవారం వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్యతో కలిసి మంత్రి ప్రజెంటేషన్ ఇచ్చారు. 10,778 ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు వంటి ఇన్‌పుట్స్‌ను రైతుల గడప వద్దకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఆర్బీకేలను నాలెడ్జ్ హబ్‌లుగా, వన్‌స్టాప్ సెంటర్లుగా తీర్చిదిద్దామన్నారు. ఆక్వా, మత్స్య, పాడి రైతులకు కూడా వీటి ద్వారా సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణనిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రాప్, ఈ కేవైసీ ద్వారా వాస్తవ సాగుదారులకే ప్రభుత్వ రాయితీలు, సంక్షేమ ఫలాలు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా అందిస్తున్నట్లు చెప్పారు. ఇథియోపియా దేశం కూడా ఆర్బీకేల సాంకేతికత కోసం రాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో ఒప్పందం చేసుకోబోతుందని తెలిపారు. గంటకుపైగా జరిగిన ఈ ప్రజెంటేషన్‌లో వివిధ రాష్ట్రాల అధికారులు ప్రతి విషయాన్నీ ఆసక్తిగా విన్నారు. తమ రాష్ట్రాల్లో కూడా ఆర్బీకే వ్యవస్థ అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. త్వరలోనే ఏపీలో పర్యటిస్తామన్నారు.

రెండు వారాల్లో ఎన్నికల ట్రిబ్యునళ్ల నోటిఫై

- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- అత్యవసరంగా దృష్టి సారించాల్సిన అంశమన్న హైకోర్టు
- విచారణ ఈ నెల 14కి వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల వివాదాలను విచారించే ట్రిబ్యునళ్లను రెండు వారాల్లో నోటిఫై చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం హైకోర్టుకు నివేదించింది. కర్నూలు మినహా మిగిలిన జిల్లాలకు ఎన్నికల ట్రిబ్యునళ్లను నోటిఫై చేయకపోవడాన్ని హైకోర్టు ప్రశ్నించిన నేపథ్యంలో ప్రభుత్వం తరఫున హోం, శాసన వ్యవహారాల శాఖల న్యాయవాది ఈ విషయాన్ని తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారీ ఉత్తర్వులు జారీ చేశారు. తగిన చర్యల నిమిత్తం ఈ ఉత్తర్వుల కాపీని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపాలని హైకోర్టు రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు. చిత్తూరు జిల్లా ఎన్నికల ట్రిబ్యునల్‌ను నోటిఫై చేయకపోవడాన్ని సవాలు చేస్తూ ఎస్.ప్రేమ్‌కుమార్ దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ రవినాథ్ తిల్హారీ విచారణ జరిపారు. గతంలో విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది టీడీ ఫణికుమార్ వాదనలు వినిపిస్తూ, జిల్లాకొక ఎన్నికల ట్రిబ్యునల్‌ను నోటిఫై చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చిత్తూరు జిల్లాకు ఇప్పటివరకు ట్రిబ్యునల్‌ను నోటిఫై చేయలేదన్నారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ.. కర్నూలు జిల్లాకు ఎన్నికల ట్రిబ్యునల్‌ను నోటిఫై చేయాలని ఈ ఏడాది ఏప్రిల్ 26న సీజే ధర్మాసనం ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. ఎన్నికల ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయకపోవడంపై ప్రభుత్వాన్ని వివరణ కోరారు. దీనికి ప్రభుత్వం తరఫున హోం, శాసన వ్యవహారాల శాఖల తరఫు న్యాయవాది వేలూరి మహేశ్వరరెడ్డి స్పందిస్తూ, చిత్తూరు జిల్లాకు ఎన్నికల ట్రిబ్యునల్‌ను నోటిఫై చేసే ఫైలు సర్క్యులేషన్‌లో ఉందని తెలిపారు. ఈ వ్యాజ్యం శుక్రవారం మరోసారి విచారణకు రాగా.. ఏప్రిల్‌లో ధర్మాసనం ఆదేశాలు ఇచ్చిన తరువాత జూన్ 21న హైకోర్టు నుంచి ట్రిబ్యునళ్లపై పాలనాపరమైన ప్రతిపాదనలు తీసుకున్నామని మహేశ్వరరెడ్డి చెప్పారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ, హైకోర్టు నుంచి ప్రతిపాదనలు తీసుకుని నెల రోజులైనా ఫైలు ఇంకా సర్క్యులేషన్‌లోనే ఉందని అన్నారు. కర్నూలు జిల్లా మినహా మిగిలిన జిల్లాలకు ఎన్నికల ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయలేదని, వాస్తవానికి ఇది అత్యవసరంగా దృష్టి సారించాల్సిన అంశమని న్యాయమూర్తి తెలిపారు. దీనికి మహేశ్వరరెడ్డి స్పందిస్తూ, నేటి నుంచి రెండు వారాల్లో ఎన్నికల ట్రిబ్యునళ్లను నోటిఫై చేస్తామని వివరించారు.




హైకోర్టుకొచ్చే రోడ్లను సక్రమంగా నిర్వహించాలి

- ఆమేరకు అధికారులను ఆదేశించండి
- హైకోర్టు ఉద్యోగుల సంఘం పిటిషన్

సాక్షి, అమరావతి: విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి హైకోర్టుకు వచ్చే రహదారులను సక్రమంగా నిర్వహించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరుతూ శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రోడ్ల నిర్వహణ సరిగా లేనందున ఉద్యోగులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ మార్గాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాలరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. హైకోర్టుకు వచ్చే మార్గంలో విద్యుత్ దీపాలు, భద్రత ఏర్పాటు చేసేలా పురపాలక శాఖ, సీఆర్డీఏ, పోలీసు అధికారులను ఆదేశించాలని కోరారు. హైకోర్టులో పని ఒత్తిడి వల్ల ఉద్యోగులు రాత్రి వరకు పని చేస్తున్నారని, ఇళ్లకు తిరిగి వెళ్లే సమయంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా సీడ్ యాక్సిస్ రోడ్డులో వీధి దీపాలు లేకపోవడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. మహిళా ఉద్యోగులు భయంభయంగా వెళ్లాల్సి వస్తోందన్నారు. కరకట్ట మీదుగా వెళ్లే సమయంలో పలువురు ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. గాయపడ్డ వారి వివరాలను వేణుగోపాలరావు తన పిటిషన్‌కు జత చేశారు.

వయసులో తండ్రీ కొడుకులకు ఏడేళ్లే తేడా!

- కారుణ్య నియామకంలో పోస్టల్ అధికారి సృష్టించిన లీల
- కర్నూలు జిల్లా అధికారిపై చర్యలకు ఉపక్రమించిన ఉన్నతాధికారులు



శంకరన్న ఆధార్‌కార్డ్

కర్నూలు (ఓల్డ్‌సిటీ): తండ్రి 1981లో పుడితే అతని కుమారుడు 1988లో పుట్టాడు. వినడానికి వింతగా ఉంది కదూ! కారుణ్య నియామకాల్లో ఓ తపాలా అధికారి చూపిన వింత లీల ఇది. ఈ లీల కర్నూలు జిల్లాలో జరిగింది. ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలోని దైవందిన్నె గ్రామ వాసి శంకరన్న నకిలీ స్కూల్ సర్టిఫికెట్‌తో 2005లో కారుణ్య నియామకం ద్వారా తపాలా శాఖలో గ్రామ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగం పొందాడు. ఆ సమయంలో ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫీసెస్ (ఐపీవో)గా పనిచేసిన కె.హరికృష్ణ ప్రసాద్ ఆ నియామకం చేశారు. అయితే 2019లో శంకరన్న కన్నుమూశాడు. ఇదే సమయంలో హరికృష్ణ ప్రసాద్ డివిజన్ హెడ్ (పోస్టల్ సూపరింటెండెంట్) హోదాలో ఉన్నారు. ఈ సమయంలో శంకరన్న కుమారుడు వీరేంద్రకు కూడా కారుణ్య నియామకం ద్వారా తండ్రి ఉద్యోగాన్ని హరికృష్ణ ప్రసాద్ కట్టబెట్టారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు రికార్డులు పరిశీలించగా.. శంకరన్న ఇచ్చిన స్కూల్ సర్టిఫికెట్‌లో 1981లో పుట్టినట్లుగా ఉంది. కానీ అతని ఆధార్ కార్డులో 1958లో పుట్టినట్లుగా ఉంది. ఇక వీరేంద్ర 1988లో పుట్టినట్లుగా అతని స్కూల్ సర్టిఫికెట్లు స్పష్టం చేస్తున్నాయి. సర్టిఫికెట్లలో తండ్రీ కొడుకులకు మధ్య ఏడేళ్ల మాత్రమే తేడా ఉండటంతో ఆశ్చర్యపోవడం ఉన్నతాధికారుల వంతైంది. శంకరన్నకు సర్వీసులో ప్రయోజనం చేకూర్చడం కోసం హరికృష్ణ ప్రసాద్ తప్పు చేసినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు ఆయనకు అత్యున్నత నేర అభియోగం (రూల్-14) అయిన చార్జిషీట్‌ను జారీ చేశారు. దీనిపై హరికృష్ణ ప్రసాద్‌ను వివరణ కోరగా.. తప్పులు జరుగుతాయని, దీనిని ప్రచారం చేయవద్దని అన్నారు.

ఆప్ ఎమ్మెల్యే కౌర్‌పై... చేయిచేసుకున్న భర్త



భటిండా: పంజాబ్‌లోని అధికార ఆప్ ఎమ్మెల్యే బల్జీందర్ కౌర్‌పై ఆమె భర్త సుఖ్‌రాజ్ సింగ్ చేయిచేసుకున్నాడు! దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. జూలై 10న ఓ కార్యక్రమంలో దంపతులిద్దరూ గొడవపడటం, అకస్మాత్తుగా భర్త చేయి చేసుకోవడం రికార్డయ్యింది. దీనిపై ఎమ్మెల్యే ఫిర్యాదు చేయకున్నా పంజాబ్ మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. బల్జీందర్ పటియాలాలోని పంజాబ్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ చేశారు. కొంతకాలం ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. మాఝా ప్రాంత ఆప్ యూత్ కన్వీనర్ అయిన సుఖ్‌రాజ్‌సింగ్‌ను 2019లో పెళ్లాడారు. తల్వాండి సాబో నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



తొలి దేశీయ విమాన వాహక నౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్ డెక్‌పై సేదదీరుతున్న మిగ్-29కె ఫైటర్ జెట్



ఐఎన్‌ఎస్ విక్రాంత్ కంట్రోల్ రూం లోపలి దృశ్యం



అత్యాధునిక మెడికల్ కాంప్లెక్స్‌లో ఉన్న ఆపరేషన్ థియేటర్



గంటలో 1,000 మందికి భోజనం తయారు చేయగల అత్యాధునిక కిచెన్

అలలపై వైమానిక క్షేత్రం

ఐఎన్‌ఎస్ విక్రాంత్ జలప్రవేశం

- జాతికి అంకితం చేసిన ప్రధాని
- నౌకాదళ నూతన పతాకం ఆవిష్కరణ
- బానిసత్వ జాడలను వదిలించుకున్నామని వ్యాఖ్య



ఐఎన్‌ఎస్ విక్రాంత్‌ను జాతికి అంకితం చేశాక విజయ సంకేతంగా 'వి' ఆకృతిలో నుంచున్న ప్రధాని, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దొభాల్, నేవీ ఉన్నతాధికారులు, సిబ్బంది

కొచ్చి: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో డిజైన్ చేసి, నిర్మించిన అత్యంత భారీ విమాన వాహక యుద్ధనౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్ శుక్రవారం జలప్రవేశం చేసింది. కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) ఇందుకు వేదికగా మారింది. భారీ యుద్ధ నౌకలను సొంతంగా నిర్మించుకొనే సామర్థ్యం గల అమెరికా, యూకే, రష్యా, చైనా, ఫ్రాన్స్ దేశాల జాబితాలో భారత్ కూడా సగర్వంగా చేరింది. ఈ బాహుబలి యుద్ధనౌకను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. ఐఎన్‌ఎస్ విక్రాంత్ జల ప్రవేశానికి సూచికగా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విక్రాంత్ అంటే విజయమని అన్నారు. విక్రాంత్ కేవలం యుద్ధనౌక కాదని, దేశ నైపుణ్యాలకు, ప్రతిభకు సిసలైన తార్కాణమని ఉద్ఘాటించారు. ''ఈ నౌక మన దేశానికి నూతన విశ్వాసాన్ని అందించింది. ఇది సముద్రంలో అలలపై తేలియాడే వైమానిక క్షేత్రం. ఒక నగరం. విక్రాంత్‌లో ఉత్పత్తి చేసే కరెంటుతో 5,000 ఇళ్లకు వెలుగులు పంచవచ్చు'' అని అన్నారు.

నవ భారత్‌కు ఏ సవాలూ అసాధ్యం కాదు

రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకుందని మోదీ చెప్పారు. ప్రభుత్వ ఆకాంక్షలకు ఐఎన్‌ఎస్ విక్రాంత్ తార్కాణమన్నారు. మన స్వాతంత్య్ర సమరయోధులు శక్తిసామర్థ్యాలు కలిగిన బలమైన భారత్‌ను కోరుకున్నారని, వారి కలలకు ఒక ప్రతిరూపం ఐఎన్‌ఎస్ విక్రాంత్ అని ఉద్ఘాటించారు. నవ భారత్‌కు ఏ సవాలు కూడా అసాధ్యం కాదని తేల్చిచెప్పారు. 21వ శతాబ్దంలో భారతదేశ కఠోర శ్రమ, ప్రతిభ, అంకితభావానికి, స్వావలంబనకు ప్రతీక ఈ నౌక అని వివరించారు. విక్రాంత్ యుద్ధనౌక ఎయిర్‌బేస్‌లో ఉపయోగించి ఉక్కును డీఆర్‌డీఓ సైంటిస్టులు దేశీయంగానే అభివృద్ధి చేశారని, భారత కంపెనీలు ఉత్పత్తి చేశాయని తెలిపారు. కాశీ నుంచి కొచ్చీ వరకూ ఎంత దూరం ఉందో అంత పొడవైన వైర్లను ఉపయోగించారని అన్నారు. విక్రాంత్ నిర్మాణంలో పాత్రదారులైన నావికాదళం సిబ్బంది, కొచ్చిన్ షిప్‌యార్డ్ ఇంజినీర్లు, సైంటిస్టులు, కార్మికుల కృషిని కొనియాడారు.

భరతమాత పుత్రికలపై ఆంక్షలు లేవు

భారత్‌కు గతంలో బలమైన నౌకలను నిర్మించే సామర్థ్యం ఉండేదని, బ్రిటిష్ పాలకులు బ్రిటన్ పార్లమెంట్‌లో ప్రత్యేకంగా చట్టాన్ని తీసుకొచ్చి, దాన్ని దెబ్బతీశారని వెల్లడించారు. మన నావికాదళంలో అన్ని విభాగాల్లో మహిళలను సైతం నియమిస్తుండడం సంతోషకరమైన విషయమని తెలిపారు. నేవీలో మహిళల ప్రవేశంపై ఆంక్షలను తొలగించినట్లు చెప్పారు. శక్తివంతమైన అలలకు సరిహద్దులు లేనట్లుగానే భరతమాత పుత్రికలకు సైతం సరిహద్దులు, ఆంక్షలు లేవని స్పష్టం చేశారు. 'వోకల్ ఫర్ లోకల్' అనేది ప్రతి భారతీయుడికి తారకమంత్రం కావాలని, అప్పుడు మన దేశం స్వావలంబన సాధించడానికి ఎక్కువ సమయం పట్టదని వివరించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతం, హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం నావికాదళాన్ని బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులను పెంచామన్నారు. శక్తివంతమైన భారత్.. శాంతియుత, భద్రతతో కూడిన ప్రపంచానికి దోహదపడుతుందని మోదీ చెప్పారు.

అరుదైన ఘనత సాధించాం: రాజ్‌నాథ్ సింగ్

దేశీయంగానే యుద్ధనౌకల నిర్మాణంలో మనం అరుదైన ఘనత సాధించామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఐఎన్‌ఎస్ విక్రాంత్ మనకు గర్వకారణమని అన్నారు. నూతన భారత్ సాధిస్తున్న స్వావలంబనకు ఇదొక గుర్తు అని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల సాధనకు రక్షణ శాఖ సాగిస్తున్న కృషిని వివరించారు. ఐఎన్‌ఎస్ విక్రాంత్ జల ప్రవేశ కార్యక్రమంలో ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, శర్బానంద సోనోవాల్, అజయ్ భట్, కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ పాల్గొన్నారు.

శివాజీ నౌకాదళం ప్రేరణతో..
నౌకాదళానికి కొత్త పతాకం



ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో రూపొందించిన నావికాదళ నూతన చిహ్నాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ''ఇది చరిత్రాత్మక దినం. బానిసత్వ జాడలను భారత్ వదిలించుకుంది. ఇప్పటిదాకా నావికాదళ జెండాపై బానిసత్వ గుర్తుండేది. ఈ రోజు నుంచి ఛత్రపతి స్ఫూర్తితో కొత్త జెండా రెపరెపలాడుతుంది. ఈ జెండాను శివాజీకి అంకితమిస్తున్నాం'' అన్నారు. ఐఎన్‌ఎస్ విక్రాంత్‌పై నూతన పతాకాన్ని మోదీ ఎగురవేశారు.

- నావికాదళానికి కొత్త జెండా చేరింది. ఇందులో ఎడమవైపు పైభాగాన జాతీయ జెండా ఉంది, కుడి వైపు కింది భాగంలో ఛత్రపతి శివాజీ ప్రేరణతో ఒక చిహ్నాన్ని చేర్చారు.
- నీలం రంగులో అష్టభుజి ఆకారంలో ఉన్న ఈ చిహ్నంలో రెండు బంగారు రంగు బోర్డర్లున్నాయి. అష్టభుజి ఆకారాన్ని, ఈ రెండు బోర్డర్ లైన్లను శివాజీ నౌకాదళం చిహ్నం నుంచి తీసుకున్నారు.
- అష్టభుజి ఎనిమిది దిక్కులకు సూచిక అని, అన్ని దిక్కుల్లోనూ నౌకాదళం దుర్భేద్యమని తెలియజేయడానికి ఈ చిహ్నాన్ని డిజైన్ చేసినట్లు నావికాదళం వెల్లడించింది.
- అష్టభుజి మధ్యభాగంలో నాలుగు సింహాల జాతీయ చిహ్నం. లంగరు (యాంకర్) గుర్తు డిజైన్ చేశారు. దాని కిందిభాగంలో నావికాదళం మోటో 'సం నో వరుణః' (వరుణ దేవుడా, మాపై కరుణ కురిపించు) కనిపిస్తోంది. దీన్ని రుగ్వేదం నుంచి స్వీకరించారు.

క్రెడిటంతా కొట్టేస్తున్నారు: కాంగ్రెస్

గత ప్రభుత్వాల కృషి కారణంగానే ఐఎన్‌ఎస్ విక్రాంత్ నిర్మాణం సాధ్యమైంది. కానీ మొత్తం క్రెడిట్‌ను ఇప్పుడు మోదీ కొట్టేస్తున్నారు'' అంటూ కాంగ్రెస్ ఆక్షేపించింది. గత ప్రభుత్వాల పాత్రను ఆయన గుర్తించడం లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తప్పుపట్టారు. ''విక్రాంత్ డిజైన్, తయారీ నుంచి జలప్రవేశం దాకా 22 ఏళ్లు పట్టింది. జలప్రవేశ వేళ మోదీ ప్రభుత్వముంది తప్ప ఇందులో మోదీ ఘనతేమీ లేదు. కానీ నటనలో మోదీ ఆరితేరిపోయారు'' అని దుయ్యబట్టారు. భారతదేశ సముద్ర రక్షణ విషయంలో ఐఎన్‌ఎస్ విక్రాంత్ ఆగమనం గొప్ప ముందడుగని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కలను నిజం చేశారంటూ నేవీని అభినందించారు.

క్లుప్తంగా...

తీస్తా సెతల్వాద్‌కు సుప్రీం మధ్యంతర బెయిల్



న్యూఢిల్లీ: సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 2002 గుజరాత్ మత ఘర్షణల సమయంలో ప్రభుత్వం కూల్చివేతకు కుట్ర పన్నారన్న ఆరోపణలపై పోలీసులు జూన్ 25న ఆమెను అరెస్ట్ చేశారు. సెతల్వాద్ బెయిల్ కోసం పెట్టుకున్న పిటిషన్ గుజరాత్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆమె ఇప్పటికీ జ్యుడీషియల్ కస్టడీలోనే ఉన్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని శుక్రవారం సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పిటిషన్‌పై గుజరాత్ హైకోర్టు నిర్ణయం తీసుకునేదాకా పాస్‌పోర్ట్‌ను సరెండర్ చేయాలని ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని సూచించింది.

పళనికే అన్నాడీఎంకే పగ్గాలు

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే పన్నీర్ సెల్వంతో అంతర్గత పోరులో పళనిస్వామికి భారీ ఊరట లభించింది. తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎంపికపై ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన స్టేను డివిజన్ బెంచ్ శుక్రవారం రద్దు చేసింది. దీన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని పన్నీరు సెల్వం తెలిపారు.

సూకీకి మరో మూడేళ్ల జైలు

బ్యాంకాక్: ఎన్నికల అక్రమాల ఆరోపణలపై మయన్మార్ పదవీచ్యుత నేత అంగసాన్ సూకీకి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. పలు కేసుల్లో ఆమెకు ఇప్పటికే 17 ఏళ్ల జైలు శిక్షలు పడ్డాయి. తాజా తీర్పుతో 2023 ఎన్నికలకు ముందే సూకీకి చెందిన నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీని రద్దు చేసేందుకు సైనిక పాలకులు ప్రయత్నం చేస్తారంటున్నారు.

99 శాతం మందికి కలుషిత గాలే గతి

గ్రీన్ పీస్ ఇండియా నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశ జనాభాలో అక్షరాలా 99 శాతం మంది కలుషిత గాలి పీలుస్తున్నారు. పీఎం 2.5 విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశించిన ప్రమాణాలను మీరిన గాలే దిక్కవుతోంది. గ్రీన్‌పీస్ ఇండియా సంస్థ 'డిఫరెంట్ ఎయిర్ అండర్ వన్ స్కై' పేరిట శుక్రవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని బహిర్గతం చేసింది. నివేదికలోని ముఖ్యాంశాలు..

- భారత్‌లో ప్రజలు పీలుస్తున్న గాలి డబ్ల్యూహెచ్ఓ వార్షిక సగటు గైడ్‌లైన్ కంటే ఐదు రెట్లు అధిక పీఎం 2.5 కణాలు కలిగి ఉంటున్నదే.
- దేశంలో 62 శాతం మంది గర్భిణులు అత్యంత కాలుష్య ప్రాంతాల్లో నివసిస్తున్నారు. మొత్తం జనాభాలో 56 శాతం మంది ఇలాంటి ప్రాంతాల్లోనే ఉంటున్నారు.
- ఇండియాలో అత్యధిక కాలుష్య ప్రాంతం దేశ రాజధాని ప్రాంతం–ఢిల్లీ.
- కలుషిత గాలి వల్ల వయోవృద్ధులు, శిశువులు, గర్భిణులు అధికంగా ప్రభావితమవుతున్నారు.
- గాలి కాలుష్యానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్‌ను ప్రభుత్వాలు తప్పనిసరిగా ప్రారంభించాలి.
- గాలి కాలుష్యం ఎక్కువగా ఉండేందుకు ఆస్కారం ఉన్న రోజుల్లో రెడ్ అలర్ట్ ప్రకటించాలి. ప్రజలకు ఆరోగ్య సూచనలు జారీ చేయాలి. దీనివల్ల వారు అప్రమత్తంగా వ్యవహరించేందుకు వీలుంటుంది.
- ఇప్పుడున్న జాతీయ గాలి నాణ్యత ప్రమాణాల్లో వెంటనే మార్పులు చేయాల్సిన అవసరం ఉంది.
- నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ)ను మరింత పారదర్శకంగా, శక్తివంతంగా, సమగ్రంగా రూపొందించాలి.

ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి ట్రంప్ కుట్రలు

ఆయన ఆటలు సాగనివ్వం: బైడెన్



ట్రంప్



బైడెన్

వాషింగ్టన్: అమెరికాలో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన మద్దతుదారులు కుట్రలు పన్నుతున్నారని అధ్యక్షుడు జో బైడెన్ ఆరోపించారు. అధికారం దక్కించుకోవడానికి దుర్బుద్ధితో రాజకీయ హింసను ఎగదోస్తున్న వారికి గట్టిగా బుద్ధి చెప్పాలని, తగిన గుణపాఠం నేర్పాలని అమెరికా ప్రజలకు పిలుపునిచ్చారు. 'తీవ్రవాదులను' కచ్చితంగా ఎదిరించాలని చెప్పారు. ఫిలడెల్ఫియాలోని ప్రఖ్యాత ఇండిపెండెన్స్ హాల్‌లో బైడెన్ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్ష రిపబ్లికన్లపై విరుచుకుపడ్డారు. ట్రంప్ మద్దతుదారుల అజెండా అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పేనని తేల్చిచెప్పారు. వారి దుశ్చర్యల వల్ల సమానత్వం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్నాయని పేర్కొన్నారు. వారికి రాజ్యాంగంపై నమ్మకం లేదని, అధికారమే పరమావధిగా భావిస్తున్నారని ధ్వజమెత్తారు. డొనాల్డ్ ట్రంప్, ఆయన అనుచరుల ఆటలు సాగవని హెచ్చరించారు. నాయకుడి పట్ల గుడ్డిగా విధేయత ప్రకటించడం, రాజకీయ హింసలో పాల్గొనడం వంటివి ప్రజాస్వామ్యానికి చేటు కలిగిస్తాయన్న సత్యాన్ని చరిత్ర మనకు నేర్పుతోందని బైడెన్ ఉద్ఘాటించారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం: మోదీ

సాక్షి, బెంగళూరు: దేశంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచ స్థాయి నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడం, తీరం వెంబడి అత్యుత్తమ రీతిలో పోర్టుల కనెక్టివిటీకి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రధాని శుక్రవారం మంగళూరులో పర్యటించారు. నవ మంగళూరు పోర్టు ప్రాధికారలో రూ.3,800 కోట్ల విలువైన 3 ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, ఐదు శంకుస్థాపనల్లో పాల్గొన్నారు. తర్వాత భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మేకిన్ ఇండియా ద్వారా మన ఉత్పత్తులను ప్రపంచ స్థాయిలో పెంచాలని, ఎగుమతులు మరింతగా పెరగాలని ఆకాంక్షించారు. సాగర మాల పథకం ద్వారా ఎక్కువ లబ్ధి పొందుతోంది కర్ణాటక రాష్ట్రమేనని పేర్కొన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి, రైల్వే విద్యుదీకరణ తదితర అంశాల్లో నాలుగు రెట్ల సత్ఫలితాలను సాధించినట్లు తెలిపారు. నవ మంగళూరు పోర్టు సామర్థ్యం రెట్టింపయిందని తెలిపారు. కాగా, ఈ సభకు నల్ల చొక్కాలు ధరించి వచ్చిన వారిని వెనక్కు పంపారు.

లుఫ్తాన్సా విమానాలు రద్దు

న్యూఢిల్లీ: డిమాండ్ల సాధన కోసం పైలట్లు ఒకరోజు సమ్మెకు దిగడంతో జర్మనీకి చెందిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ సంస్థ విమానాలు ప్రపంచమంతటా నిలిచిపోయాయి. వందలాది విమానాల రాకపోకలను లుఫ్తాన్సా యాజమాన్యం రద్దు చేసింది. వేతనాలు పెంచాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న డిమాండ్లతో పైలట్లు తమ విధులను బహిష్కరించారు. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు విమానాలు రద్దయ్యాయి. టర్మినల్–3 వద్ద దాదాపు 700 మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఎయిర్‌పోర్టు బయట ఆందోళన చేపట్టారు. ప్రయాణికులు కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, లేదంటే రుసుము తిరిగి చెల్లించాలని పట్టుబట్టారు. ప్రయాణికుల్లో చాలామంది విదేశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఉన్నారు. తమకు న్యాయం చేయాలంటూ వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చాలాసేపు వేచి చేసి, చేసేది లేక ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వెళ్లిపోయారు. అతి త్వరలో విమానాల రాకపోకలను పునరుద్ధరిస్తామని లుఫ్తాన్సా ప్రతినిధులు వెల్లడించారు.

మహా విపత్తుకు ముందస్తు సూచికే!

పాక్ వరదలపై నిపుణులు

- హిమాలయాల్లో శరవేగంగా కరుగుతున్న మంచు
- వాతావరణమే మహా విపత్తుగా మారే ప్రమాదం.. గ్లోబల్ వార్మింగ్‌ను అడ్డుకోకపోతే వినాశనమే



పాకిస్తాన్‌లో వరద బీభత్సం

- దేశంలో మూడో వంతు వరద నీటిలోనే
- 1,350కి పైగా మృతులు
- 5 కోట్ల మంది నిరాశ్రయులు
- 9 లక్షల పశువులు మృతి
- కొట్టుకుపోయిన 10 లక్షల ఇళ్లు
- 40కిపైగా రిజర్వాయర్లు ధ్వంసం
- కుప్పకూలిపోయిన 220కి పైగా వంతెనలు
- నీట మునిగిన 90% పంటలు
- పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకి 10 వేల కోట్ల నష్టం

వాతావరణ మార్పులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. హిమాలయాల్లో మంచు శరవేగంగా కరిగిపోతోంది. పాకిస్తాన్‌లో వరద బీభత్సం, చైనాలో కరువు కాటకాలు, భారత్‌లో కనీవినీ ఎరుగని వాతావరణ మార్పులు... వీటన్నింటికీ అదే కారణమని భారతీయ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. హిమాచల్ ప్రదేశ్‌లోని చోటా షిగ్రి హిమానీ నదాన్ని వారు కొన్నేళ్లుగా పర్యవేక్షిస్తున్నారు. అక్కడ ఈ ఏడాది రికార్డు స్థాయిలో మంచు కరిగిపోయినట్టు వెల్లడైంది. గత జూన్‌లో ఏర్పాటు చేసిన డిశ్చార్జ్ మెజరింగ్ వ్యవస్థ ఆగస్టుకల్లా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని ఇండోర్ ఐఐటీ గ్లేసియాలజిస్ట్ మహమ్మద్ ఫరూక్ ఆజం చెప్పారు. ''గత మార్చి, ఏప్రిల్‌లో మన దేశంలో ఉష్ణోగ్రతలు 100 ఏళ్ల రికార్డులను బద్దలు కొట్టాయి. హిమానీ నదాలు కరిగిపోవడమే అందుకు కారణం. గత వారం మా బృందమంతా షిగ్రి దగ్గరే ఉండి పరీక్షించాం. మంచు భారీగా కరిగిపోతోంది'' అంటూ ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ''అరేబియా సముద్రంలో అత్యధిక వేడిమి కారణంగా నీరంతా ఆవిరి మేఘాలుగా మారి ఎడతెరిపి లేకుండా వానలు కురిసి లానినో ప్రభావం ఏర్పడింది. దాంతో వాతావరణమే విపత్తుగా మారి పాక్‌ను అతలాకుతలం చేస్తోంది'' అన్నది శాస్త్రవేత్తల వివరణ.

హిమాలయాలు కరిగిపోతే...?

గ్లోబల్ వార్మింగ్ దెబ్బకు హిమాలయాల్లో మంచు గత నాలుగు దశాబ్దాల్లో కరిగిన దాని కంటే 2000–2016 మధ్య ఏకంగా 10 రెట్లు ఎక్కువగా కరిగిపోయింది! దక్షిణాసియా దేశాలకు ఇది పెను ప్రమాద హెచ్చరికేనంటున్నారు. కారకోరం, హిందూకుష్ పర్వత శ్రేణుల్లో 55 వేల హిమానీ నదాలున్నాయి. హిమాలయ నదులైన గంగ, యమున, సింధు, బ్రహ్మపుత్ర 8 దేశాల్లో 130 కోట్ల మంది మంచినీటి అవసరాలు తీరుస్తున్నాయి. 5,77,000 చదరపు కిలోమీటర్లలో వ్యవసాయ భూములకు నీరందిస్తున్నాయి. 26,432 మెగావాట్ల సామర్థ్యం ఉన్న హైడ్రోపవర్ స్టేషన్లున్నాయి. హిమాలయాల్లో మంచు కరిగిపోతే వీటన్నింటిపైనా ప్రభావం పడటమే గాక 2050 నాటికి దక్షిణాసియా దేశాల్లో 170 కోట్ల మందికి నీటికి కటకట తప్పదని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. దేశాల మధ్య నీటి కోసం యుద్ధాలూ జరగవచ్చని నిపుణులు అంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా విడుదలయ్యే కర్బన ఉద్గారాల్లో పాకిస్తాన్ వాటా కేవలం 1 శాతమే. కానీ వాతావరణ మార్పులు ఇప్పుడు ఆ దేశాన్ని బలి తీసుకుంటున్నాయి.


– సాక్షి, నేషనల్ డెస్క్

చైనాలో కరువు సంక్షోభం

- 17 ప్రావిన్స్‌లలో వరసగా 70 రోజుల పాటు ఎండలు దంచిగొట్టాయి. వడగాడ్పులకి 90 కోట్ల మంది అవస్థలు పడ్డారు
- చైనాలో ఏకంగా సగ భాగంలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి
- చైనాలో అతి పెద్ద నది యాంగ్‌జె ఎండిపోయిన పరిస్థితి వచ్చింది. 1865 తర్వాత ఈ నది నీటిమట్టం బాగా తగ్గిపోవడం మళ్లీ ఇప్పుడే.
- చైనాలోని దక్షిణ ప్రావిన్స్‌లైన హుబై, జియాంగ్జీ, అన్‌హుయాయ్, సిచుయాన్‌లలో నీళ్ల లేక విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మూతపడుతున్నాయి
- చైనాలో జల విద్యుత్‌లో 30శాతం సిచుయాన్ ప్రావిన్స్ నుంచే వస్తుంది. ఈ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి సగానికి సగం తగ్గిపోయింది
- చైనాలో కరువు పరిస్థితులు 25 లక్షల మందిపై తీవ్ర ప్రభావం చూపిస్తే, 22 లక్షలకు పైగా హెక్టార్లలో వ్యవసాయ భూమి ఎండిపోయింది.

సాక్షి విజయనగరం


శనివారం, 3, సెప్టెంబర్, 2022



నవదిన పూజలు

బాదంగి: కోడూరుమాత నవదిన పూజలు గురువారం రాత్రి నుంచి ఆరంభమయ్యాయి. చర్చి ఫాదర్ యుగల్ కుమార్ యేసు బోధనలను వినిపించారు. యాత్ర పతాకాన్ని ఆవిష్కరించారు. యేసు ఆరాధనా గీతాలు ఆలపిస్తూ కోడూరులో తిరువీధి జరిపారు. తొలిరోజు దివ్యబలిపూజ నిర్వహించారు.

కదలని గజరాజులు



కొమరాడ: మండలంలోని దుగ్గి పరిసరాల్లోనే ఆరు గజరాజుల గుంపు దిష్టవేశాయి. వారం రోజులుగా ఎటూ కదలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలం పనులకు వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు. మరోవైపు ఒంటిరి ఏనుగు అర్తాం అటవీ ప్రాంతంలో సంచరిస్తోంది. ఒంటిరి ఏనుగు సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తారసపడితే దాడిచేస్తుందని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.


4న బాల్‌బ్యాడ్మింటన్ సీనియర్స్ జట్టు ఎంపిక

బాదంగి: మండలంలోని కోడూరు హైస్కూల్ మైదానంలో ఈ నెల 4న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడే సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ జేసీ రాజు, కార్యదర్శి టి.శ్రీనివాసరావులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడతాయన్నారు.

న్యూస్‌రీల్

'సుజల స్రవంతికి' తొలి ప్రాధాన్యం

- ఎస్‌డీసీ వెంకటేశ్వరరావు



బొబ్బిలి: ఉత్తరాంధ్రలో సాగు, తాగునీటి సరఫరాకు ఆధారమైన సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం తొలిప్రాధాన్యమిస్తోందని, భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చినట్టు బొబ్బిలి భూ సేకరణ విభాగం ప్రత్యేక ఉప కలెక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో శుక్రవారం మాట్లాడారు. ప్రాజెక్టు కోసం జిల్లాలో 4,500 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. జిల్లాలోని ముగ్గురు ఎస్‌డీసీలకు ఈ బాధ్యతలు అప్పగించామని చెప్పారు. ఆయన వెంట డీటీలు ఎ.స్వర్ణలత, రామారావు ఉన్నారు.

రైతుల శ్రమదానం



కాలువలోని గుర్రపుడెక్కను తొలగిస్తున్న రైతులు

మెంటాడ: ఆంధ్ర జలాశయం ఎడమ కాలువ పూర్తిగా గుర్రపుడెక్కతో మూసుకుపోయింది. జలాశయం నుంచి సమృద్ధిగా నీరు విడిచిపెట్టినా పొలాలకు చేరడంలేదు. సమస్యను గుర్తించిన జయితి గ్రామ రైతులు శుక్రవారం శ్రమదానంతో కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించారు. సాగునీరు పొలాలకు చేరేలా కాలువలోని అడ్డంకులను తొలగించినట్టు రైతులు మీసాల మహేష్, గేదెల సత్యంనాయుడు తెలిపారు.


స్విమ్మింగ్‌పూల్ లీజుకు బహిరంగ వేలం

విజయనగరం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆక్వా స్విమ్మింగ్ పూల్‌ను లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని చీఫ్‌కోచ్ పి.అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు రెండవసారి బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.10,000 బ్యాంకు డీడీను దరఖాస్తుకు జతచేసి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 0866–2499699 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అలరించిన మృదంగ, గాత్ర కచేరీలు

విజయనగరం టౌన్: విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కళాశాల విద్యార్థులు నిర్వహించిన మృదంగ విన్యాసం ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. ఎన్. రుషికేశవరావు, వి.గణేష్, పి.వెంకటరావు, ఎన్.నాగరాజులు అద్భుతమైన ప్రదర్శనతో అందరినీ అలరించారు. అనంతరం రాజమండ్రికి చెందిన తులసి విశ్వనాథ్ గాత్ర కచేరీకి ఆహుతుల కరతాళ ధ్వనులు మిన్నంటాయి. వయోలిన్‌పై ఎం.నీలాద్రిరావు, మృదంగంపై విశాఖకు చెందిన జి.వెంకటరావులు సహకరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌వి.ప్రసన్న కుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

విజయనగరం అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పోలీస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలకు సమీపంలో అంబులెన్స్‌లను ఉంచాలన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించేలా వాహనచోదకుల్లో చైతన్యం నింపాలన్నారు. ఎస్పీ దీపికా ఎం.పాటిల్ మాట్లాడుతూ జాతీయ రహదారికి అనుసంధానమయ్యే అప్రోచ్ రోడ్లలో తప్పకుండా స్పీడ్ బ్రేకర్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వి.సుందర్, జెడ్పీ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్, విజయనగరం మున్సిపల్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు, డీసీహెచ్ఎస్ నాగభూషణరావు, డీఎస్పీ మోహన్‌రావు, ఐరాడ్ విభాగ జిల్లా మేనేజర్ శ్రీధర్, ట్రాన్స్‌పోర్టు అధికారులు, జాతీయ రహదారి విభాగ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి మదిలో నీవే...

సంక్షేమ పాలనకు ఆద్యుడివి నీవే..! జలయజ్ఞంతో సాగునీటి ప్రాజెక్టుల రూపకర్తవు నీవే..! బంజరు భూముల్లో బంగారు సిరులు కురిపించే దారి చూపింది నీవే..! పేదల వైద్యానికి భరోసా కల్పించినది నీవే..! ఆపదవేళ ఆదుకునేలా 108, 104 సేవలను అందుబాటులోకి తెచ్చినది నీవే..! ఆంధ్ర ప్రదేశ్‌లో సంక్షేమ చరితను రాసినది నీవే..! ప్రతి మదిలోనూ నీవే.. నీ వర్ధంతి రోజున ప్రతిపల్లె వైఎస్సార్ స్మరామి అంటూ నివాళులర్పించింది. నీవు అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనను స్మరించింది.

- ఊరూరా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళి
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు
- వృద్ధులు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ
- విజయనగరంలో ఆలయాల నిర్మాణానికి విరాళాలు
- పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అపర భగీరథుడు, పేదలపాలి పెన్నిధి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు శుక్రవారం ఊరూరా సాగాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 11 నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి అందించిన సేవలను గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, వైఎస్సార్ తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారంటూ ప్రశంసల వర్షం కురిపించారు.

సంక్షేమపాలనకు ఆద్యుడు వైఎస్సార్

సంక్షేమ పాలనకు ఆద్యుడు మహానేత, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచంలో ఉన్న తెలుగువారందరూ గర్వపడే విధంగా మహానేత పరిపాలన పరిపాలన సాగించారన్నారు. ఆయన ఆశయాలను ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని అన్నారు. చీపురుపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండల కేంద్రాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రి, బాబూజీ వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

గొప్పదార్శనికుడు...

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి గొప్పదార్శనికుడు అని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఆంధ్రుల ఆశాజ్యోతిగా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసిన నాయకుడిగా పేరొందన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సీఎంఆర్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యేతోపాటు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు రూ.లక్ష, శుద్ధవీధిలో రామాలయ నిర్మాణానికి రూ.లక్ష, పెద్దపల్లి వీధిలో రామాలయ నిర్మాణానికి రూ.లక్ష, దాసన్నపేట కాపువీధిలో శివాలయం నిర్మాణానికి రూ.50 వేలు చొప్పున మొత్తం రూ.3.50 లక్షలు మొత్తాన్ని ఎమ్మెల్యే కోలగట్ల అందజేశారు. ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేశారు.

బొబ్బిలిలో...

పేద, మధ్య తరగతి ప్రజలకు జీవితాల్లో వెలుగులు నింపే సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డిదేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. ఆయన తనయుడిగా నేటి ముఖ్యమంత్రి అంతకు మించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల హృదయాల్లో చెరిగిపోని ముద్ర వేసుకున్నారన్నారు. పట్టణంలోని అమ్మిగారి కోనేటి గట్టు వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణారావు, పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

సామాజిక న్యాయం

ముఖ్యమంత్రిగా అన్ని వర్గాలవారికి సామాజిక న్యాయం చేసిన నేతగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఖ్యాతి గాంచారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలకే కాకుండా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలకు కూడా అభివృద్ధి నిధులు కేటాయించిన ఘనత వైఎస్సార్‌దేనని పేర్కొన్నారు. రాజాం పట్టణంలోని మాధవ బజార్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జున కాలనీలోని అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

సంక్షేమానికి చిరునామా...

సంక్షేమానికి చిరునామా దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. నెల్లిమర్లలో రామతీర్థం జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ డీవీజీ శంకరరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలోని వృద్ధులు, సుంకరపేట ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

వైఎస్సార్.. ఓ చరిత్ర..

సంక్షేమ పాలనతో చరిత్ర సృష్టించిన మహనీయుల్లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఒకరని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పేదల జీవితాల్లో కొత్త చరిత్రను సృష్టించిన వ్యక్తి రాజశేఖరరెడ్డిగా పేర్కొన్నారు. ఎస్.కోట దేవి కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలనాయుడు బాబు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి రొంగలి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి



జీసీసీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో..

దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి తెలుగు ప్రజల కోసం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి విశేష కృషి చేశారని గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభాస్వాతిరాణి అన్నారు. విజయనగరం మండలం గొల్లలపేట పంచాయతీలో నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అక్కడి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు తెలుగుప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేశాయని మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి తెలిపారు.

సాలూరు పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర




అపర భగీరథుడు...

రైతుల పాలిట అపర భగీరథుడు, పేదల పాటిట సంక్షేమ పెన్నిధిగా మహానేత, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఆయన మన మధ్య లేకపోయినా ఆయన పథకాలు ప్రజల మనసులో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. సాలూరు కేంద్రంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ స్వర్ణయుగాన్ని అవినీతి రహితంగా ప్రస్తుత సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. అనంతరం నవజీవన ఆశ్రమంలో అన్నదానం చేశారు.

రైతుల సహకారంతోనే... పోలవరం కాలువ నిర్మాణం

- ప్రత్యేక భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొర
- మా పంట పొలాలకు దారి, సాగునీటి మాటేమిటి?
- రైతుల భిన్నాభిప్రాయాలు



రైతుల అభిప్రాయ సేకరణలో ప్రత్యేక కలెక్టర్‌కు వినతిపత్రం అంజేస్తున్న రైతులు

లక్కవరపుకోట (కొత్తవలస): ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భాగంగా పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి రైతులు సహకరించాలని భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శనదొర కోరారు. మండలంలోని చీపురవలస గ్రామంలో భూములు కోల్పోతున్న రైతులతో అభిప్రాయ సేకరణ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కాలువ నిర్మాణానికి సహకరిస్తే 3లక్షల ఎకరాలకు సాగునీరు, 8 లక్షల మందికి తాగునీరు అందుతుందన్నారు. భూములు కోల్పోయే రైతులకు సంతృప్తికరమైన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. చీపురవలసలో 95 ఎకరాల భూమి కాలువ నిర్మాణానికి అవసరమని పేర్కొన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ కాలువ నిర్మాణం జరిగే ప్రాంతంలో పంట పొలాలకు దారి, సాగునీరు మాటేమిటని ప్రశ్నించారు. ఇక్కడ సెంటు భూమి లక్ష రూపాయలకు పైగా ధర పలుకుతోందని, ఆ మేరకు పరిహారం అందజేయాలని కోరారు. లేదంటే కాలువకు ఎంత భూమి కోల్పోతున్నామో అంతే భూమి వేరొక చోట ఇచ్చినా సమ్మతమేనని అభిప్రాయం తెలిపారు. ఈ మేరకు రైతు పోరాట సమితి నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ, గాడి అప్పారావు వినతిపత్రాన్ని అందజేశారు. రైతుల వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సుదర్శనదొర తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.హర్షవర్ధిని, పోలవరం ప్రాజెక్టు ఏఈలు సి.విజయలక్ష్మి, సర్పంచ్ మచ్చ ఎర్రా రామస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు లెంక రమన్నపాత్రుడు, రైతులు పాల్గొన్నారు.

పులి బాధితులకు పరిహారం

- డీఎఫ్ఓ వెంకటేష్

విజయనగరం ఫూల్‌బాగ్: పులిదాడిలో ఆవులను కోల్పోయిన రైతులకు వెంటవెంటనే పరిహారం అందజేస్తున్నామని డీఎఫ్ఓ ఎస్ వెంకటేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బొండపల్లి మండలం కొత్తపనసల పాడు గ్రామానికి చెందిన వి.సన్యాసికి రూ.25వేలు, అదే గ్రామానికి చెందిన సీహెచ్ చిన్నయ్యకు రూ.10వేలు అందజేశామన్నారు. అలాగే, మెరకముడిదాం మండలం పులిగుమ్మిగ్రామానికి చెందిన బూర్లి లక్ష్మణరావుకు రూ.30వేలు, బాడంగి మండలం పాల్తేరు గ్రామానికి చెందిన అలజంగి రామారావుకు రూ.25వేలు, తెర్లాం మండలంలోని గొలుగువలసగ్రామానికి చెందిన బలగ భీమారావుకు రూ.30వేలు, దత్తిరాజేరు మండలంలోని ఎస్.చింతవలసగ్రామానికి చెందిన కొత్తకోట ఉగాదికి రూ.20వేలు అందజేసినట్టు పేర్కొన్నారు.

రైతులకు తగిన పరిహారం చెల్లిస్తాం

- ఆర్డీఓ సూర్యకళ




భూములు కోల్పోతున్న రైతుల వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఎమ్.వి.సూర్యకళ

గజపతినగరం: గజపతినగరం మండలం పురిటిపెంట న్యూకాలనీ మీదుగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మూడవ రైల్వేలైన్ పనుల్లో భూములు, ఆస్తులు కోల్పోతున్న వారికి తగిన పరిహారం చెల్లించేందుకు కృషిచేస్తామని విజయనగరం ఆర్డీఓ ఎమ్.వి.సూర్యకళ తెలిపారు. పురిటిపెంట గ్రామ సచివాలయంలో భూములు కోల్పోతున్న రైతులతో శుక్రవారం సమావేశమయ్యారు. మార్కెట్ ధరల ప్రకారం చెల్లింపులు జరుగుతాయని, భవనాలు, స్థలాలు, నూతన గృహాలకు చెల్లించే పరిహారం రెండున్నర రెట్లు అధనంగా ఉంటుందన్నారు. పురిటి పెంటలో 2.24 ఎకరాల భూమిని సేకరించామన్నారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను వెంటనే అందజేయాలని తహసీల్దార్ ఎం.అరుణకుమారిని ఆర్డీఓ ఆదేశించారు. అక్టోబర్ నాటికి ఈ ప్రక్రియ అంతా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రైల్వే సిబ్బంది గురునాథరావు, మండల సురేష్, కరణం ఆదినారాయణ, సర్పంచ్ ఎస్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

గర్భస్థ లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, లింగనిర్ధారణ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. పీసీ పీఎస్‌డీటీ చట్టం–1994, ఏఆర్‌టీ చట్టం అమలుపై తన చాంబర్‌లో శుక్రవారం సంబంధిత కమిటీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న గర్భలిస్థ లింగ నిర్ధారణ పరీక్షలు, స్కానింగ్ సెంటర్ల పనితీరుపై కలెక్టర్ ఆరా తీశారు. స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. సరోగసీ విధానంపై కూడా దృష్టిసారించాలన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో సదస్సులు నిర్వహించి లింగనిర్ధారణ నేరమన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి, జిల్లా టీబీ నియంత్రణాధికారి డాక్టర్ రాణిసంయుక్త, విజయనగరం ఆర్డీఓ సూర్యకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీవీఎన్ జయలక్ష్మి, దిశ సీఐ శేషు, ఐసీడీఎస్ లైజనింగ్ ఆఫీసర్ విద్య, ఎన్‌జీఓలు దుర్గ, చదలవాడ ప్రసాద్, ఎం.సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె పురిటికి వచ్చిన తల్లి మృతి


మృతిచెందిన బుగత ఆదమ్మ

విజయనగరం క్రైమ్: కుమార్తె పురుడు సందర్భంగా సేవలందించేందుకు వచ్చిన తల్లి బైక్‌పై నుంచి పడడంతో తలకు తీవ్రగాయమై మృతిచెందింది. టూటౌన్ పరిధిలో సంభవించిన ఈ సంఘటనపై పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం మండలం బంగారమ్మపేట గ్రామానికి చెందిన బుగత ఆదమ్మ (45) కుమార్తెకు నెలలు నిండడంతో ఘోషాఆస్పత్రిలో ప్రసవం కోసం చేర్చారు. గాజులరేగలో ఉన్న బంధువుల ఇంటి నుంచి రోజూ కుమార్తె వద్దకు అల్లుడితో కలిసి వెళ్లి, సేవలందించి వస్తోంది. అదేవిధంగా శుక్రవారం అల్లుడు సుంకర సతీష్‌కుమార్‌తో కలిసి బైక్‌పై ఆస్పత్రికి వస్తుండగా పుత్సలవీధి జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్‌ను వేగంగా దాటారు. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న ఆమె ఒక్క ఉదుటన ఎగిరి కిందకు పడింది. ఈ క్రమంలో తలకు తీవ్రగాయం కావడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు సన్యాసి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై ప్రసన్నకుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహానేతకు ఘన నివాళి

మాట తప్పని, మడమ తిప్పని మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన పాలన కాలంలో చేసిన ప్రజాసేవను స్మరించుకున్నారు. పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.


విజయనగరం: దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి


రాజాం: వృద్ధాశ్రమంలో వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు


పాలకొండ: జొనగ గ్రామంలో గిరిజన చిన్నారులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్న పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


పార్వతీపురం టౌన్: అన్నదానం చేస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు


భోగాపురం: సుందరపేట సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు, దుప్పట్లను పంపిణీ చేస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


కురుపాం: వృద్ధులకు బట్టలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి


శృంగవరపుకోట: ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

బాధ్యతలు నిజాయితీగా నిర్వర్తిస్తే గుర్తింపు

- డీపీఓ సన్మానసభలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


మెరకముడిదాం ఎంపీడీఓ కార్యాలయంలో డీపీఓ ఇందిరారమణిని సన్మానిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు తదితరులు

మెరకముడిదాం: ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీగా బాధ్యతలు నిర్వర్తించినప్పుడే వారికి మంచి గుర్తింపు వస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓగా రెండేళ్లు పనిచేసి డీపీఓగా పదోన్నతిపై వెళ్లిన ఇందిరారమణిని ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంపీడీఓగా మెరకముడిదాం మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించమని ఆదేశించినా సమర్థవంతంగా నిర్వర్తించి ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారుల మన్ననలు పొంది మంచి కీర్తిప్రతిష్టలు సంపాదించడంతో ఆమెకు జిల్లా అధికారిగా పదోన్నతి లభించిందన్నారు. ఇలా ప్రతి ఉద్యోగి నిజాయితీగా తమ బాధ్యతలను నిర్వహిస్తే మంచి పేరు ప్రఖ్యాతులతో పాటు పదోన్నతులు వస్తాయన్నారు. అనంతరం ఆయన డీపీఓ ఇందిరారమణిని దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డికృష్ణవేణి, తాడ్డి వేణుగోపాల్‌రావు, కోట్లవిశ్వేశ్వరరావు, కోట్లమోతీలాల్‌నాయుడు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆమెను ఘనంగా సన్మానించి బొబ్బిలివీణను బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రామకృష్ణ, తహసీల్దార్ బి.రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

- ఈనెల 11 నుంచి నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న పోటీలు


కెవి రాజు


నాని


త్రివేణి


కిషోర్


లక్ష్మి


జోగులు


కృష్ణవేణి


అశోక్


గుణ

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన 11 మంది క్రీడాకారులు అర్హత సాధించారు. గత నెల 26 నుంచి 28వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 11 నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం వెల్లడించారు. 3000 మీటర్ల పరుగు పోటీలో ఎస్.అశోక్, పి.కిశోర్, 3000 మీటర్ల రిలే పరుగు పోటీలో ఎం.శారద, జి.లక్ష్మి, షాట్‌పుట్/డిస్క్ త్రోలో బి.త్రివేణి, 10 కిలోమీటర్ల వాకింగ్‌లో కె.కృష్ణవేణి, 2000 మీటర్ల వాకింగ్‌లో ఆర్.నాని, 300 మీటర్ల పరుగు పోటీల సీహెచ్.గుణ జాతీయ పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు. అదేవిధంగా హైజంప్‌లో బి.చందు, లాంగ్‌జంప్‌లో కేవీ.రాజు, 400 మీటర్ల పరుగు పోటీలో ఎ.జోగులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారులు అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషించిన కోచ్‌లు సతీష్‌లు, రమేష్, అరకు స్పోర్ట్స్ స్కూల్ కోచ్ గణపతి, లక్ష్మణ్, పీడీ తవిటినాయుడులకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ తరఫున పి.లీలాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆరికతోట విద్యార్థులు


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్ పోటీలలో ద్వితీయస్థానం సాధించిన బాలికల, బాలుర టీమ్‌లు

రామభద్రపురం: ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన 8వ జిల్లా స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్‌లో ఆరికతోట ఉన్నత పాఠశాల బాలబాలికలు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వి.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ బాలుర విభాగంలో డి.రాఘవ, పి. బోగీశ్వరరావు, ఆర్ శ్యామ్‌కుమార్, బాలికల విభాగంలో కె.మౌనిక, ఎ.భువనేశ్వరి, కె.మధురిమ, జి.ధనలక్ష్మి, కె.భాగ్యలక్ష్మి, కె.చరిష్మాలు ప్రతిభ కనబరిచినట్లు వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారిని ప్రధానోపాధ్యాయుడు జీజీఎస్‌వీ ప్రసాదరావు, ఉపాధ్యాయులు జీసీహెచ్‌ఎస్ శర్మ తదితరులు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలలో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలి రూరల్: సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు చెందిన బాలురు, బాలికల టీమ్‌లు ద్వితీయస్థానం సాధించాయి. ఆగస్టు 26,27,28లలో యానాంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో జిల్లాకు చెందిన బాలుర, బాలికల టీమ్‌లు సత్తాచాటాయి. పోటీల ముగింపు కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ముమ్మడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌బాబు, జెడ్పీటీసీ సతీష్‌లు విజేతలను అభినందించారని, పారాది పీడీ సత్యనారాయణ తెలిపారు. విజేతలైన విద్యార్థులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించింది.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం


పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా గజపతినగరంలో కేక్ కట్ చేస్తున్న జనసేన పార్టీ నాయకులు, అభిమానులు

విజయనగరం గంటస్తంభం: సినీహీరో, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా గజపతినగరంలో పార్టీ నాయకుడు మర్రాపు సురేష్ ఆధ్వర్యంలో వేడక భారీగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ అభిమానులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సురేష్ మాట్లాడుతూ వ్యవస్థలో మార్పు కోసం పవన్ కల్యాణ్ పార్టీ పెట్టారని, ఆయన ఆశయాలకు తగ్గట్టుగా రైతులను ఆదుకుంటున్నారన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. పార్టీ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పవన్ పుట్టిన రోజు సందర్భంగా వారంరోజులు పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఆదాడ మోహనరావు, మిడతాన రవికుమార్, రామకృష్ణ బాలు, గజనతినగరం నాయకులు పండు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా ప్రాంగణంలో జాబ్ మేళా

విజయనగరం అర్బన్: వరుణ్ మోటార్స్ సంస్థలో ఖాళీల నియామకానికి సీడాప్-వైఎస్ఆర్ క్రాంతి పథం, డీఆర్‌డీఏ సంయుక్త నిర్వహణలో శనివారం స్థానిక టీటీడీసీ మహిళా ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తామని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి తెలిపారు. డిగ్రీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు నేరుగా ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావచ్చని తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లోని నిరుద్యోగులకు సంస్థలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. కమర్షియల్ ఎగ్జిక్యూటివ్-25, సేల్స్ ఎగ్జిక్యూటివ్-40, రిలేషన్‌షిప్ మేనేజర్-6, ట్రూ వేల్యూ ఎగ్జిక్యూటివ్-20 పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం 8331901360, 8074726936 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 500.00
విజయనగరం	రూ. 504.00
శ్రీకాకుళం	రూ. 504.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	50,730-00
బంగారం(22సి. 10గ్రా.)	46,500-00
వెండి (కిలో)	58,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

క్లుప్తంగా

కొబ్బరి సాగులో నూతన ఒరవడి



రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

పూసపాటిరేగ: కొబ్బరి సాగులో నూతన ఒరవడిని సృష్టించాలని కొబ్బరి రైతుల సంఘయ జిల్లా అధ్యక్షుడు మొంగం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో పైడితల్లమ్మ ఫార్మర్స్ కంపెనీ కార్యాలయంలో ప్రపంచ కొబ్బరి రైతుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొబ్బరిసాగులో సాంకేతికత ఉపయోగించినట్లయితే అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి, ఎరకయ్యదొర పాల్గొన్నారు.

సజావుగా వాహనాల వేలం

నెల్లిమర్ల: పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో వాహనాల వేలం ప్రక్రియ శుక్రవారం సజావుగా జరిగింది. స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద సీఐ రాజశేఖరనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో మహీంద్ర బొలెరో వాహనాన్ని రూ 1.2 లక్షలకు పాటదారు దక్కించుకున్నారు. అలాగే హోండా యాక్టివా వాహనాన్ని రూ. 19 వేలకు, హీరో హోండా పాషన్ ప్లస్ వాహనాన్ని రూ. 8,600కి, టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని 15 వేల రూపాయలకు పాటదారులు కైవసం చేసుకున్నారు. ఈ వాహనాలకు పాటదారులు జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని సీఐ తెలిపారు.

ఈవీఎం గోదాం తనిఖీ



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ సమీపంలోనున్న ఈవీఎం గోదాంను కలెక్టర్ ఎ. సూర్యకుమారి శుక్రవారం తనిఖీచేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తాళాలు, సీళ్లను పరిశీలించారు. ఈవీఎంల పరిరక్షణలో సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ ఎం. గణపతిరావు, తహసీల్దార్ కేవీ రమణరాజు, ఎంపీడీఓ జి. గిరిబాల, నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ ఉన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు మృతి



ఎం.జ్యోతి (ఫైల్)

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎం. జ్యోతి శుక్రవారం హఠాన్మరణం చెందారు. రోజువారీ విధుల్లో భాగంగా పాఠశాలకు వచ్చిన జ్యోతి మొదటి క్లాస్ పూర్తి చేసుకుని స్టాఫ్ రూమ్‌కు వచ్చి.. ఒక్కసారిగా కుప్పకూలిపోయిందని ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. వెంటనే ఆమెను 108 వాహనంలో మోపాడ పీహెచ్‌సీకి తరలించామని, అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారని చెప్పారు. అంతవరకు తమతో ఉన్న ఉపాధ్యాయురాలు హఠాన్మరణం చెందడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఇదే పరిస్థితి కొనసాగితే చర్యలు తప్పవు

- మధ్యాహ్న భోజనం నాణ్యతపై కలెక్టర్ ఆగ్రహం

నెల్లిమర్ల రూరల్: మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేకపోవడంపై కలెక్టర్ సూర్యకుమారి ఆగ్రహించారు. మండలంలోని సతివాడ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా వంట చేయలేదని గుర్తించిన కలెక్టర్ పాఠశాల యాజమాన్యంపై సీరియస్ అయ్యారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను పిలిపించి ఎందుకు తనిఖీ చేయడం లేదని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆస్పత్రిని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణరాజు, ఎంపీడీఓ గిరిబాల, తదితరులు పాల్గొన్నారు.

'చిట్టి గురువులు'పై అవగాహన

భోగాపురం: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చిట్టి గురువులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి రమణమూర్తి అన్నారు. ఎంఎల్‌ఓ వెల్దూటి రాములప్పుడు అధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మండలంలో ఉన్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు (మహిళలు) చిట్టిగురువులు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం సంపూర్ణ అక్షరాస్యత నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్నా నీ స్థానం సుస్థిరం...

ప్రజల కోసం పుట్టి.. ప్రజల పక్షాన నిలిచి... ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తున్న సమయంలో అశువులు బాసిన అందరి బంధువు రాజశేఖరరెడ్డి.. అంతు తెలియని లోకాలకు నిన్ను భగవంతుడు తీసుకుపోయినా మా హృదయాలలో మాత్రం మీ స్థానం సుస్థిరమని చెబుతూ వాడవాడలా రాజన్న వర్ధంతిని అభిమానులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. రాజన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



విజయనగరం: రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న నగర పాలక సంస్థ మేయర్ విజయలక్ష్మి



నెల్లిమర్ల: మండల కేంద్రంలో నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు



భోగాపురం రూరల్: రావాడలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దంతులూరి సూర్యనారాయణరాజు, తదితరులు

వైఎస్సార్ గొప్ప దార్శనికుడు..

విజయనగరం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గొప్ప దార్శనికుడని విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ 13వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక సీఎంఆర్ జంక్షన్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోలగట్లతో పాటు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నగరంలోని థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి రూ.లక్ష, శుద్ధవీధిలో రామాలయ నిర్మాణానికి రూ.లక్ష, పెద్ద పల్లివీధిలో రామాలయ నిర్మాణానికి రూ.లక్ష, దాసన్నపేట కాపువీధిలో శివాలయ నిర్మాణానికి రూ.50,000 చొప్పున మొత్తం రూ.3.50 లక్షలు మొత్తాన్ని ఎమ్మెల్యే కోలగట్ల నిర్వాహకులకు అందజేశారు. అదేవిధంగా ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, డాక్టర్ వైఎస్సార్ పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోలగట్ల మాట్లాడుతూ, అన్ని వర్గాల సంక్షేమం కోరుతూ తన శక్తినంత ధారబోసిన ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ ఒక్కరేనని చెప్పారు. నేడు తండ్రి బాటలో రెట్టింపు ఉత్సాహంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సలహా మండల డైరెక్టర్ ఎస్.బంగారు నాయుడు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ముద్దాడ మధు, ముచ్చు శ్రీను, బొద్దాన అప్పారావు, విజయ్‌శంకర్ దుబే, అల్లు చాణక్య, కాళ్ల సూరిబాబు, రెడ్డి గురుమూర్తి, బోడసింగి ఈశ్వరరావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానేతా మనసాస్మరామీ..

వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలో వాడవాడలా వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, 14 డివిజన్, కుప్పిలివీధి, తదితర ప్రాంతాల్లో రాజన్నకు నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు.

జోహార్ వైఎస్సార్..

భోగాపురం రూరల్: మండలంలో అన్ని పంచాయతీల్లో రాజశేఖరరెడ్డికి నివాళులర్పించారు. ఆయన విగ్రహాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ జోహార్ రాజన్న అంటూ నినాదాలు చేవారు. రావాడ, పోలిపల్లి, చెరుకుపల్లి, గూడెపువలస, సవరవిల్లి, ఎ. రావివలస, గుడివాడలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పాటు వైస్ ఎంపీపీ దంతులూరి సూర్యనారాయణరాజు, ఉప్పాడ శివారెడ్డి, అప్పురభుక్త పైడినాయుడు, కర్రోతు వెంకటరమణ, కర్రోతు పైడిరాజు, కొల్లి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు..

భోగాపురం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన పాలనతో చిరస్మరణీయుడిగా నిలిచాడని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, పంచాయతీ కార్యాలయం సెంటర్లలో ఉన్న రాజన్న విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం సుందరపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని రోగులకు పీఏసీఎస్ అధ్యక్షుడు సుందర రూపావతి, పడాల భానుప్రకాష్ ఏర్పాటు చేసిన పండ్లు, రొట్టెలు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు, సర్పంచ్ ఉడికల అప్పయ్యమ్మ, నాయకులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, దంతులూరి సూర్యనారాయణరాజు, పిడుగు రాంబాబు, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, కొమ్మూరు సుభోషణరావు, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, వరుపుల సుధాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో దేవుడు..

డెంకాడ: సంక్షేమ పాలనతో రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డెంకాడ పీహెచ్‌సీ రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి ..

నెల్లిమర్ల: దివంగత ముఖ్యమంత్రి రాజన్న సంక్షేమ పథకాల సారథని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు కొనియాడారు. రామతీర్థం జంక్షన్‌లోని విగ్రహానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ డీవీజీ శంకరరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా బడ్డుకొండ, పెనుమత్స మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమం రాజశేఖరరెడ్డితోనే ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో అంబళ్ల సుధారాణి, గదల సన్యాసినాయుడు, బంగారు సరోజిని, సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, అంబళ్ల శ్రీరాములనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిరస్థాయిగా నిలిచారు...

పూసపాటిరేగ: రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పతివాడ అప్పలనాయుడు, మహంతి సీతాలక్ష్మి, ఎన్. సత్యనారాయణరాజు, అల్లాడ రమేష్, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పుప్పాళ్ల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్ వద్ద నివాళులర్పిస్తున్న నగర వైఎస్సార్‌సీపీ నాయకులు



పూసపాటిరేగ: కుమిలిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న అప్పలనాయుడు, తదితరులు

ప్రజా స్పందన బాగుంది...



విజయనగరం: ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ బెల్లాన

విజయనగరం:

సంక్షేమ పథకాలు పక్కాగా అందుతుండడం వల్లే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. నగరంలోని ఏడో డివిజన్ నాగవంశపు వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ విజయలక్ష్మి, తదితరులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని మహిళలు చెప్పడంతో ఎంపీ సంతోషం వ్యక్తం చేశారు. అర్హత ఉన్న వారికి ఇంకా పథకాలు అందకపోతే తెలియజేయాలని కోరారు. పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి కొత్త ఒరవడి సృష్టించారన్నారు. ఇన్నాళ్లూ తెలుగుదేశానికి మద్దతుగా ఉన్న కొంతమంది తమ అభిమతం మార్చుకుని జగనన్నకు మద్దతు తెలియజేస్తున్నారని చెప్పారు. నగరంలో శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న అభివృద్ధి మరువరానిదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారునాయుడు, కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, జోనల్ ఇన్‌చార్జ్‌లు బోడసింగి ఈశ్వరరావు, బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, పొంతపల్లి గోపి, చిట్టిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి..

పూసపాటిరేగ: ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పేదల సంక్షేమ సారథిగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేరుగాంచారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని గుంపాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబం ఎంత లబ్ధి పొందినదీ వివరించారు. అలాగే ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ, ఎన్నికల హామీల్లో 98 శాతం వరకు పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ అప్పలనాయుడు, మహంతి కల్యాణి, ఎన్.సత్యనారాయణరాజు,మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, ఎడ్ల రామకృష్ణ, కోట్ల రఘు, పిన్నింటి ఎల్లంనాయుడు, మొంగం నాగబాబు, దేశెట్టి గణేష్, నక్కాన రమణ, చాపల సత్తిబాబు, టి.సీతారాం, వాసుపల్లి అప్పన్న, డి. ఈశ్వరరావు, శాంతాటి శ్రీనివాసరావు, పి.సత్యం మాస్టారు, తాటిశెట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: గుంపాంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

నేటి నుంచి రోటరీ నవతరోత్సవాలు

- సెంట్రల్ క్లబ్ యూత్ సర్వీసెస్ డైరెక్టర్ కేఆర్‌కే రాజు

విజయనగరం: యువతలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీయడమే ధ్యేయంగా రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో నవతరోత్సవాలు నిర్వహించనున్నట్లు క్లబ్ యూత్ సర్వీసెస్ డైరెక్టర్ కేఆర్‌కే రాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక రోటరీ హెల్త్ సెంటర్‌లో నవతరోత్సవాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏడాదీ సెప్టెంబర్ నెలలో క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా యువతకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈనెల 3న స్థానిక మెసానిక్ టెంపుల్‌లో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 5న హోటల్ ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో తెలుగు పద్యాల పఠన పోటీలు.. 6న ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు.. 8న ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో క్విజ్ పోటీలు.. 10న ఎంఆర్ కళాశాల మైదానంలో కబడ్డీ పోటీలు.. 11న ఇదే మైదానంలో ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే 11న ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో రోటరీ సూపర్ సింగర్ పోటీలు, 13న ఫ్యాన్సీ డ్రెస్ కార్నివాల్, 15న కుకింగ్ కాంపిటీషన్.. 19న మెసానిక్ టెంపుల్‌లో షైన్స్‌ఫెయిర్ పోటీలు జరుగుతాయని వివరించారు. 20న ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో బ్రైట్ ఆఫ్ ఇండియా.. 25న మెసానిక్ టెంపుల్‌లో స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు అక్టోబర్ 2న జరిగే నవతరోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కృష్ణగోపాల్ అగర్వాల్, చైర్మన్ అశోక్ మాలు, ప్రతినిధులు శంకర్‌రెడ్డి, సాయిమనోజ్, పాల్గొన్నారు.

తాగునీటి పథకం ప్రారంభం



కుళాయి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల: పట్టణంలోని ఏడో వార్డులో కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల తాగునీటి ఇక్కట్లు తొలగించడానికి కౌన్సిలర్ ప్రసాద్ చూపించిన చొరవ అభినందనీయమన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్లంతా కృషి చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు డాక్టర్ డీవీజీ శంకరరావు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల, నగర పంచాయతీ అధ్యక్షులు చనమల్లు వెంకటరమణ, చిక్కాల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం కలిగించొద్దు..

- ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు

విజయనగరం క్రైమ్: వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించొద్దని ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు కోరారు. కార్పొరేషన్ కార్యాలయం వద్దనున్న టాక్సీ స్టాండ్ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా తోపుడు బండ్ల వర్తకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో తోపుడు బండ్ల వ్యాపారులు విచ్చలవిడిగా రహదారులపై బండ్లను నిలిపి వ్యాపారాలు సాగించడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతోందన్నారు. కార్పొరేషన్ అధికారులు అనుమతించిన వర్తకులే కాకుండా ఇతరులు కూడా రహదారులపై తోపుడు బండ్లను నిలిపి వ్యాపారాలు చేయడం సరికాదన్నారు. కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, పట్టణాన్ని సుందరంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై భాస్కరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారులు మధుసూదనరావు, అన్నాజీరావు, ఇతర పోలీస్, మున్సిపల్ అధికారులు, తోపుడుబండ్ల వర్తకులు పాల్గొన్నారు.

వసతులపై ఆరా..!

నెల్లిమర్ల:

పట్టణంలోని మిమ్స్ సమీపంలోనున్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేచర్ చైల్డ్‌లైన్ ప్రతినిధులతో కలిసి నేరుగా తరగతి గదిలోకి ప్రవేశించిన ఆయన వసతులు, సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బోధన ఎలా ఉంది? మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. వసతులు ఎలా కల్పిస్తున్నారు.. అన్న అంశాలపై ఆరా తీశారు. వసతి సౌకర్యం పూర్తిస్థాయిలో లేకపోవడంతో తరగతి గదిలోనే నిద్రపోతున్నట్లు విద్యార్థులు కేసలి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం డైనింగ్ హాల్‌కు వెళ్లి భోజనాలను పరిశీలించి, ప్రిన్సిపాల్ కేబీబీ రావుకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో తెలుసుకున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పరిశీలనలో జిల్లా బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జి. హిమబిందు, సభ్యులు పి. సుధారాణి, బి. భవానీ, నేచర్ చైల్డ్‌లైన్ జిల్లా కౌన్సిలర్ జీకే దుర్గ ఉన్నారు.

సంక్షిప్తంగా...

ఎమ్మెల్యే బడ్డుకొండను కలిసిన మల్లిరెడ్డి

డెంకాడ: రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కమిటీ నాన్ అఫీషియల్ సభ్యుడిగా నియమితులైన మల్లిరెడ్డి వెంకట పాపారావు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. మోపాడలోని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఇంటికి విచ్చేసిన వెంకట పాపారావు ఎమ్మెల్యేను దుశ్శాలువాతో కప్పి సత్కరించారు.

దరఖాస్తులాహ్వానం

విజయనగరం టౌన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సర్వేజనా సుఖినోభవంతు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాబోధనతో పాటు కల్చరల్, స్పోర్ట్స్, ఆర్ట్స్, యోగా, తదితర వాటిలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు వారి వివరాలును అందజేయాలన్నారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తిని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గనివాడ ఎర్రయ్యమ్మ, బి. అనురాధ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని కొణిశ వీధి, వీటీ ఆగ్రహారం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రక్తహీనత బారిన పడకుండా ఉండాలంటే భోజనంలో ఆకుకూరలు, కూరగాలు తీసుకోవాలన్నారు.

దూరవిద్య అడ్మిషన్లు ప్రారంభం

డెంకాడ: దూరవిద్య అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని గుణుపూరుపేట హెచ్‌ఎం, కోర్సు కో ఆర్డినేటర్ కృష్ణకుమారి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. 10, ఇంటర్ విద్యను దూరవిద్య (ఓపెన్ స్కూల్) విధానం ద్వారా పూర్తి చేయాలనుకునే వారు గుణుపూరుపేట ఉన్నత పాఠశాల కేంద్రంలో అడ్మిషన్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్సు సహాయ కో ఆర్డినేటర్ శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

సహస్ర దీపాల శోభలో సీతారామచంద్రుడు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవను శుక్రవారం సాయంత్రం ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. వెండి మంటపంలో ఉన్న స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి దీపారాధన మంటపం ఏర్పాటు చేసిన ఊయలలో ఆశీనులు చేశారు. సహస్ర దీపాలను వెలిగించి ఆ శోభలో సీతారామచంద్రస్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం


విజయనగరం టౌన్: పట్టణంలోని కేవీఆర్ ఎస్టేట్స్ అపార్ట్‌మెంట్‌లో గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీగణపతి హోమం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గణనాథునికి కుంకుమార్చనలు చేపట్టారు. అలాగే గోపూజోత్సవం చేశారు. కార్యక్రమాలను అపార్ట్‌మెంట్ అధ్యక్ష్యుడు శర్మ పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిత్యసాయి పరిశ్రమను మూసివేయండి

పూసపాటిరేగ: విషం చిమ్ముతున్న నిత్యసాయి కోల్‌తారు పరిశ్రమను వెంటనే మూసివేయాలని కోనాడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పరిశ్రమ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, పరిశ్రమ నుంచి వస్తున్న కాలుష్యం వల్ల అనారోగ్యాల భారిన పడుతున్నామన్నారు. అనంతరం పోలీసులకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

అవసరాన్ని బట్టి పొత్తులు

- టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో చంద్రబాబు
- గతంలో ఎన్డీఏ నుంచి బయటకు వచ్చింది రాష్ట్ర ప్రయోజనాల కోసమే
- మూడేళ్లలో జగన్ రూ.2 లక్షల కోట్ల దోపిడీ
- వ్యవస్థలను, మౌలిక రంగాలను నాశనం చేశారు



సాక్షి, అమరావతి: పొత్తులపై అవసరాన్ని బట్టి సమయానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. ఇప్పటి వరకు పొత్తుల గురించి తానెక్కడా మాట్లాడలేదని, నాయకుల్లోనూ దీనిపై స్పష్టత ఉండాలన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్డీఏ నుంచి బయటకు వచ్చామని, మారిన పరిస్థితులను బట్టి పొత్తులపై నిర్ణయం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా విద్వేషమేనని, పాలకుల విజన్ పోయిందని విమర్శించారు. గతంలో తాను విజన్‌తో చేసిన పాలన వల్లే ఇప్పుడు హైదరాబాద్ మంచి స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర విభజన వల్ల నష్టం జరిగిందన్నారు. సీఎం జగన్ ఒక్కో కుటుంబంపై మూడేళ్లలో రూ.3.25 లక్షల భారం వేశారని ఆరోపించారు. దేశంలో ఎక్కువ పెట్రో ధరలు ఉండే రాష్ట్రం ఏపీనే అని చెప్పారు. ఎస్సీలకు ఉన్న 26 పథకాలు రద్దు చేశారన్నారు. చింతూరులో వరదల సమయంలో సీఎం జగన్ పిలిచి మాట్లాడిన బాలిక డెంగీతో చనిపోయిందని, దీనికి ఆయన ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

ఒక్క రైతూ సంతోషంగా లేదు

రాష్ట్రంలో ఒక్క రైతు కూడా సంతోషంగా లేడని, కనీసం ధాన్యం డబ్బులు కూడా చెల్లించడం లేదని చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక దొరక్క భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలపై 31 శాతం దాడులు పెరిగాయని తెలిపారు. జగన్ ఈ మూడేళ్లలో రూ.2 లక్షల కోట్లు అక్రమంగా ఆర్జించారని ఆరోపించారు. రూ.20 కోట్ల ఆదాయం లేని కంపెనీతో రూ.500 కోట్లు పెట్టి.. లేపాక్షిలో వేల కోట్ల విలువైన భూములు కొట్టేశారన్నారు. సీఎం జగన్ అవినీతి కోసం వ్యవస్థలను, మౌలిక రంగాలను నాశనం చేశారని విమర్శించారు. సింగిల్ న్యూట్రలైజేషన్ కూడా చేయకుండా మద్యం అమ్ముతున్నారన్నారు. దేశ చరిత్రలో రాజధాని లేని ఏకైక రాష్ట్రంగా ఏపీ ఉందని, ముందస్తు ఎన్నికలు వస్తే రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోతుందన్నారు. భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్ రాయలసీమలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులుగా ఉంటారని, విశాఖ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

లారీలో పేలిన సిలిండర్లు

గ్యాస్ సిలిండర్ల లారీలో మంటలు
- లారీలో షార్ట్‌సర్క్యూటే కారణం
- పెద్ద పెద్ద శబ్దాలతో భయానక వాతావరణం
- లారీలో మొత్తం 306.. పేలిపోయిన 100కు పైగా సిలిండర్లు
- బెంబేలెత్తిపోయిన సమీప ప్రాంతాల ప్రజలు
- ప్రకాశం జిల్లాలో పెను ప్రమాదం



మంటలు అంటుకున్న లారీ

కొమరోలు : అర్ధరాత్రి.. ఊరంతా గాఢ నిద్రలో ఉంది.. అంతలో ఒక్కసారిగా పెద్ద పెద్ద శబ్దాలు.. గ్రామస్తులంతా మేలుకున్నారు.. ఏం జరుగుతుందో అర్థం కాక అయోమయం.. అంతలో ఊరు బయట సిలిండర్లు గాల్లోకి లేస్తూ.. గాల్లోనే పేలిపోతున్నాయి. అలా ఒకదాని తర్వాత ఒకటి పేలిపోతూనే ఉండటాన్ని చూసి వారంతా భయపడిపోయారు. గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఈ పేలుళ్లు సంభవించాయి. అర్ధరాత్రి కావడంతో ప్రాణ నష్టం జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది ఏడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. గ్యాస్ సిలిండర్ల లోడుతో లారీ(ఏపీ21 పీవై 3476) కర్నూలు నుంచి ప్రకాశం జిల్లాలోని ఉలవపాడుకు వెళుతోంది. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కొమరోలు మండలందద్దవాడ గ్రామం సమీపంలోకి రాగానే లారీ నుంచి మంటలు వ్యాపించాయి. లారీ డ్రైవర్ మోహనరాజు మంటలను అదుపు చేయాలని ప్రయత్నించినా వల్ల కాలేదు. దీంతో లారీని ఊరి బయట నిలిపి అక్కడ నుంచి దూరంగా పరుగులుదీశాడు. వెంటనే పోలీసులకు విషయాన్ని తెలియజేశాడు. అప్పటికే మంటలు లారీ అంతా వ్యాపించి గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. లారీలో మొత్తం 306 సిలిండర్లున్నాయి. దాదాపు 100కి పైగా సిలిండర్లు పేలిపోయాయి. పోలీసులు, గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి మంటలను అదుపు చేశారు.

ఏడు గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్

రాత్రి ఒంటి గంట సమయంలో లారీలో మంటలు చెలరేగగా.. శుక్రవారం ఉదయం ఏడు గంటల సమయానికి మంటలను అదుపులోకి తెచ్చారు. ఆ సమయంలో తాటిచెర్ల మోటు నుంచి గిద్దలూరు వైపుగా వెళ్లాల్సిన వాహనాలను దారి మళ్లించారు. దద్దవాడలోనే లారీని ఆపి ఉన్నట్లయితే ఊహకు అందని ప్రాణనష్టం సంభవించి ఉండేదని, అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ఊరి బయటకు లారీని తీసుకెళ్లడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు. మార్కాపురం డీఎస్పీ కిశోర్‌కుమార్, గిద్దలూరు, కంభం సీఐలు ఫిరోజ్, రాజేష్‌కుమార్, కొమరోలు, గిద్దలూరు, బేస్తవారిపేట, కంభం ఎస్‌ఐలు సాంబశివయ్య, బ్రహ్మనాయుడు, మాధవరావు, నాగమల్లేశ్వరరావు, అగ్ని మాపక శాఖ అధికారి ఆంజనేయులు తమ సిబ్బందితో కలిసి రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

పవన్ అభిమానుల విధ్వంసం

- విశాఖ లీలామహల్ థియేటర్‌కు రూ.15లక్షల ఆస్తి నష్టం



అభిమానులు విధ్వంసం సృష్టించాక పరిస్థితి

అల్లిపురం (విశాఖ దక్షిణం): జనసేన అధినేత, సినీహీరో పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు విశాఖపట్నంలోని లీలామహల్ థియేటర్ యాజమాన్యానికి తీవ్ర నష్టాన్ని చేకూర్చాయి. పవన్ అభిమానులు కేక్‌కు బదులుగా సీట్లు, సీలింగ్, స్క్రీన్ కట్‌చేసి థియేటర్‌లో విధ్వంసం సృష్టించారు. వివరాల్లోకి వెళ్తే.. పవన్ పుట్టిన రోజు సందర్భంగా అభిమానుల కోసం థియేటర్ గురువారం జల్సా చిత్రాన్ని ఫస్ట్ షో, సెకండ్ షో ప్రదర్శించింది. అభిమానులు థియేటర్ ఆవరణలో డీజే, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఫస్ట్ షోకి సుమారు వెయ్యిమందికి పైగా హాజరయ్యారు. సెకండ్ షోకి కూడా అంతకు మించి సంఖ్యలో హాజరైన అభిమానులు థియేటర్‌లోకి చొరబడి కాగితాలు చించి గోలగోల చేశారు. అంతే కాకుండా సీట్లు కట్‌చేసి, మద్యం సీసాలతో నానా రభస సృష్టించారు. థియేటర్ సీలింగ్‌తో పాటు స్క్రీన్ కూడా పాక్షికంగా దెబ్బతింది. దీంతో యాజమాన్యం ప్రదర్శనలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ సృష్టించిన విధ్వంసానికి రూ.15లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా.

27 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుమల: రెండేళ్ల తర్వాత భక్తుల సమక్షంలో తిరుమలలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సమాయత్తమవుతోంది. ఈనెల 27 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు ఆలయ మాడ వీధుల్లో వాహన సేవలు జరగనున్నాయి. 26న అంకురార్పణ, అక్టోబర్ 1న గరుడసేవ నిర్వహించనున్నారు. ఇక కోవిడ్ కారణంగా రెండేళ్లపాటు ఆలయంలో ఏకాంతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈసారి మాడ వీధుల్లో వాహన సేవలు జరగనుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసే అవకాశముంది. ఈ క్రమంలో వారి కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. ఈనెల 20న ఉ.6 నుంచి 11 గంటల మధ్య సంప్రదాయబద్ధంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు.

దోచుకుని పంచుకోవడమే చంద్రబాబు ఆశయం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి : అధికారంలో ఉన్నప్పుడు ఆర్థిక నేరగాళ్లైన వందిమాగధులతో కలిసి దోచుకోవడం.. పంచుకోవడమే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆశయమని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. సమకాలీన రాజకీయాల్లో ఆషాఢభూతి, అష్టావక్రుడు చంద్రబాబేనన్నారు. ప్రజాస్వామ్యంలో అంకెల గారడితో.. వ్యవస్థలను మేనేజ్ చేసి అధికారంలోకి రావొచ్చని ఉదాహరణగా చూపడానికి మాత్రమే చంద్రబాబు పనికొస్తారని స్పష్టం చేశారు. తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, ఎల్లో మీడియా వ్యవహార శైలిని ఏకిపారేశారు. గత 27 ఏళ్ల చరిత్రలో జరిగిన రసాయనిక మార్పులలో రామోజీరావుతో కూడిన ఎల్లో మీడియా అనే ఉత్ప్రేరకంతో ఏర్పడిన తప్పిదమే చంద్రబాబు అని ధ్వజమెత్తారు. ప్రజాధనాన్ని దోచుకుని.. పంచుకుని.. తినేయడానికి అరుంధతి సినిమాలో పశుపతిలా వదల బొమ్మాళీ.. అంటూ చంద్రబాబును అధికారంలోకి తేవడానికి ఎల్లో మీడియా అభూతకల్పనలు సృష్టిస్తోందని చెప్పారు. ప్రజా క్షేత్రంలో వాస్తవాలను వివరించి.. చంద్రబాబు, ఎల్లో మీడియా ఆడుతున్న నాటకాలను, పన్నుతున్న పన్నాగాలను చిత్తు చేస్తున్నామన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

వెన్నుపోటుతో అధికారంలోకి వచ్చిన రోజు గొప్పా?

- ▲ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, నేతలు.. ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు తాను తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి.. గురువారానికి (1995 సెప్టెంబరు 1) 27 ఏళ్లు పూర్తవుతోందని ఎల్లో మీడియాలో గురువారం, టీడీపీ విస్తృత స్థాయి సమావేశం పేరుతో శుక్రవారం హడావుడి చేయడం చంద్రబాబు దిగజారుడుతనానికి.. సిగ్గుమాలిన చర్యలకు పరాకాష్ఠ.
- ▲ ఎల్లో మీడియా దాన్నో ఘనతగా రాస్తే.. నాటి చరిత్ర తెలియని వారు నమ్ముతారనుకోవడం పొరపాటు. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కు ఈనాడు రామోజీరావు సహకారంతో వెన్నుపోటు పొడిచి.. అధికారంలోకి వచ్చిన రోజు అని చెబితే సమంజసంగా ఉండేది. వెన్నుపోటు ద్వారా అధికారంలోకి రావడాన్ని ప్రజలు ఛీకొడతారు తప్ప స్వాగతించరు.

పొత్తుల పేరుతో నాటకాలు

- ▲ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను మొన్న చంద్రబాబు కలుస్తారని.. రామోజీరావు అడిగారట.. అలా అయితే మిమ్మల్ని కూడా నేను కలవనని అమిత్‌షా అన్నారట. ఒకవేళ అమిత్‌షా, చంద్రబాబు కలిసినా మాకు ఏ ఇబ్బంది లేదు. చంద్రబాబు లేకపోతే తమకు కష్టమవుతుంది కాబట్టి, టీడీపీతో పొత్తు కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన అనుకూల మీడియా రాసింది. దాన్నే మీడియా అడిగితే, ఆ పత్రిక వారినే అడగాలని చంద్రబాబు అనడం సిగ్గుచేటు.
- ▲ మా పార్టీకి ఒక స్పష్టత ఉంది. మాకు పొత్తులు అవసరం లేదు. ప్రజల విశ్వాసంతో గెలవాలి. మరి దీన్నే చంద్రబాబు ఎందుకు చెప్పలేక పోతున్నారు? పొత్తుల పేరుతో చంద్రబాబు, పవన్, ఎల్లో మీడియా నాటకాలు ఆడుతున్నారు. భ్రమలు కల్పించే యత్నం చేస్తున్నారు.
- ▲ కుప్పంలో కూడా ఓడిపోబోతున్నాననే విషయం చంద్రబాబుకు అర్థమైంది కాబట్టే, అక్కడికి తరచూ వెళ్తూ, నానా యాగీ చేస్తున్నారు.
- ▲ ఈనాడు, ఆంధ్రజ్యోతిలో వచ్చిన బ్యానర్ వార్తలనే అస్త్రాలుగా చేసుకుని చంద్రబాబు, ఆయన కుమారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటు. ఇటీవల నెల్లూరులో దంపతులను ఎవరో చంపితే.. ఆమె టీడీపీ కార్యకర్త కాబట్టి, వైఎస్సార్‌సీపీ నాయకులే ఆమెను చంపారన్న కోణంలో తప్పుడు వార్త రాయడం ఈనాడు పతనానికి పరాకాష్ఠ. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేసిన పాపాలే పోలవరానికి శాపాలుగా మారాయి. హోదాపై ఎప్పటికప్పుడు మాటలు మార్చాడు.

రాజకీయ పార్టీ కాదది మాఫియా

- ▲ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు కబ్జా చేసిన టీడీపీలో మిగిలిన నేతల్లో సింహభాగం అవినీతిపరులు.. అక్రమార్కులు, ఆర్థిక నేరగాళ్లే. చంద్రబాబు టీడీపీని రాజకీయ పార్టీగా కాకుండా మాఫియా సంస్థలా మార్చేశారు. అందుకే చంద్రబాబును అధికారంలో నుంచి ప్రజలు దించేశారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే ప్రజలకు ఏదో చేస్తానని చెప్పడం సిగ్గు చేటు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు.. బెల్ట్ షాపులు, ఇంకుడు గుంతలు, రెయిన్‌గన్‌లు, జన్మభూమి కమిటీలు, నీరు–చెట్టు తప్ప.. ప్రజలకు ఫలానా సంక్షేమ పథకం అమలు చేశాను అని చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్కటైనా ఉందా?
- ▲ మహానేత వైఎస్సార్ జనం మెచ్చిన ఎన్నో పథకాలను అమలు చేశారు. సీఎం వైఎస్ జగన్ వాటికి మరింత పదును పెట్టి.. జనరంజక పాలన అందిస్తున్నారు. మూడేళ్లలో డీబీటీ ద్వారా రూ.1.70 లక్షల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.
- ▲ జీవచ్ఛవంలా మారిన చంద్రబాబును అధికారంలోకి తేవాలనే దింపుడుకళ్లెం ఆశతో.. ఆయనకు ఎల్లో మీడియా సింగారం చేస్తోంది. 100 ఏళ్ల భారత్ ఎలా ఉండాలనుకుంటున్నారో.. మీ సలహాలు, సూచనలు ఇవ్వమన్నారని చంద్రబాబును ప్రధాని అడిగినట్లు 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురించడం ఆ పత్రిక పైత్యానికి పరాకాష్ఠ. ప్రజలు ఏమనుకుంటారనే ఇంగితజ్ఞానం కూడా లేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

O/o. స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

రిఫ్ నెం.బి1/224/2022 | **ఫారమ్ నెం.VI (ఎ)** | తేది : 29-08-2022

(2013 వ సంవత్సరం 30 వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన తూర్పు గోదావరి జిల్లా, దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టం-2013 నందలి 11 వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణం ప్రభావం మదింపు(ఇఐఎ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణం మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం.జె-12011/74/2005-1ఎ1,తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43(1) క్రింద సంయుక్త కలెక్టర్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా వారిని బాధిత కుటుంబాలకు పునరావాస, పునరుపాధికల్పన కల్పించు నిమిత్తం కార్యనిర్వాహకునిగా నియమించుచూ ప్రభుత్వం జి.ఓ.యమ్.నెం.1 రెవెన్యూ (భూసేకరణ), డిపార్ట్మెంట్ తేది.02.01.2015 నందు ప్రకటించబడెను.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ,విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ -15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

జిల్లా: అల్లూరి సీతారామరాజు | మండలం: దేవీపట్నం | గ్రామం : కొండమొదలు(బిట్-6)

క్రమ సంఖ్య	సర్వే నెం. స.డి.నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం (ఎ.సెంట్లు)	భూసేకరణ క్రింద విస్తీర్ణం (ఎ.సెంట్లు)	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా: ఎ-రిజిస్టర్ ప్రకారం	వెబ్ అడంగల్ ప్రకారం	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు
1	177/1	AWD	3.56	3.56	--	భోజనపు తమ్మిరెడ్డి (తండ్రి) లచ్చి రెడ్డి	కొండ	177/5	177/2	గోదావరి నది	తాడి-44 చింత-2 మామిడి-2
2	179/2	రైతు పుంజ	4.31	0.13	తమ్మిళ్ళ పింగారెడ్డి (తండ్రి) రెడ్డయ్య తమ్మిళ్ళ బాలిరెడ్డి (తండ్రి) రెడ్డయ్య తమ్మిళ్ళ మారారెడ్డి (తండ్రి) రెడ్డయ్య	తమ్మిళ్ళ బాలిరెడ్డి (తండ్రి)రెడ్డయ్య	178	180	RF	గోదావరి నది	తాడి-185 వేప-2 చింత-9 రామఫలం-2 బూరుగ-1
3				0.01		వెబ్ ల్యాండ్ నందు పేరు లేదు					
4	180/4	AWD	1.02	1.02	--	భోజనపు తమ్మిరెడ్డి (తండ్రి) లచ్చి రెడ్డి	179	180/5	కొండ	180/2,3	శ్మశాన వాటిక
5	181/1ఎ	AWD	4.98	1.67	--	ముళ్ళ దేవిరెడ్డి (తండ్రి) పెద్దిరెడ్డి	కొండ	181/2	కొండ	180	తాడి-100 మామిడి-3 నిమ్మ-1 వేప-9
6	181/1బి			1.655		ముళ్ళ రామిరెడ్డి (తండ్రి) పెద్దిరెడ్డి					
7	181/1సి			1.655		ముళ్ళ చిన దేవిరెడ్డి (తండ్రి) ఎర్రంరెడ్డి					
8	182/4	AWD	1.82	1.82	--	భోజనపు తమ్మిరెడ్డి (తండ్రి) లచ్చి రెడ్డి	182/5	183	182/5	గోదావరి నది	--
9	183/1	AWD	0.86	0.86	--	భోజనపు తమ్మిరెడ్డి (తండ్రి) లచ్చి రెడ్డి	172	183/2	183/3	183/2	తాడి-30 చింత-4 కుంకుడు -5 మామిడి-10
10	183/2	AWD	1.25	1.25	--	కూళ్ళ శేషయ్య (తండ్రి) గంగిరెడ్డి	183/1	184	183/3	గోదావరి నది	తాడి-200 మామిడి-3 కుంకుడు-3 చింత-3
11	184/1డి	రైతు పుంజ	3.83	0.95	కూళ్ళ పెంటారెడ్డి (తండ్రి)శేషయ్య కూళ్ళ శేషయ్య (తండ్రి)గంగిరెడ్డి	కూళ్ళ వెంకట రెడ్డి (తండ్రి)రామిరెడ్డి	183	184/3	Hil	గోదావరి నది	తాడి-29
12	185/2	రైతు పుంజ	0.32	0.32	అందాల పెద రామిరెడ్డి (తండ్రి) పోతిరెడ్డి అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	కొండ	185/3	185/3	కొండ	కుంకుడు-1 టేకు-1 జామ-1 తాడి-32 చింత-5 మామిడి-7 జీడి మామిడి-6
13	187/1	AWD	4.58	4.58	--	జర్త రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	184	187/2	187/4	గోదావరి నది	తాడి-253 మామిడి-3 కుంకుడు -3 రామఫలం -1
14	187/2	రైతు పుంజ	4.15	1.04	అందాల పెద రామిరెడ్డి (తండ్రి) పోతిరెడ్డి అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	187/1, 4	189	187/3	గోదావరి నది	తాడి-182 మామిడి-4 చింత-5 కుంకుడు -1 టేకు-6 కామిడి-2 జీడి మామిడి -6
15	188/1	AWD	3.92	3.91	--	అందాలలక్ష్మమ్మ (భర్త) దారప్ప రెడ్డి	187	191	188/2, 3,4,5	289	తాడి-32 జీడి మామిడి-10
16				0.01		వెబ్ ల్యాండ్ నందు పేరు లేదు					
17	188/5బి	రైతు పుంజ	0.83	0.20	అందాల పెద రామిరెడ్డి (తండ్రి) పోతిరెడ్డి అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	188/4	191	కొండ	188/1	తాడి-32 జీడిమామిడి-6
18	190/1	AWD	2.73	0.91	--	అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	189	RF	190/2	గోదావరి నది	తాడి-32 జీడిమామిడి-6
19				0.91		అందాల పెంటమ్మ (భర్త) కొమ్మిరెడ్డి					
20	190/2ఎ	AWD	0.72	0.24	--	అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	189	RF	190/3	190/1	తాడి-46 జీడిమామిడి-6
21	190/2బి			0.24		అందాల నాగిరెడ్డి (తండ్రి) రామిరెడ్డి					
22	190/2సి			0.24		అందాల పండమ్మ (భర్త) కొమ్మిరెడ్డి					
23	191/2ఎ	AWD	7.47	1.85	--	అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి	188	కొండ	191/1	189	తాడి-94 చింత-5 మామిడి-6 టేకు-2 జీడిమామిడి-6
24	191/2బి			1.85		అందాల నాగిరెడ్డి (తండ్రి) రామిరెడ్డి					
25	191/2సి			1.85		అందాల చిన రామిరెడ్డి (తండ్రి) లచ్చిరెడ్డి					
26				0.01		వెబ్ ల్యాండ్ నందు పేరు లేదు					
27	197/4	రైతు పుంజ	1.41	1.41	కునుతుల అప్పారావు (తండ్రి) చిట్టయ్య	కొనుతుల శాంతమ్మ	కొండ	198/3 ,5	199	198/3	తాడి-10
28	199/1	రైతు పుంజ	3.90	3.90	కునుతుల అప్పారావు (తండ్రి) చిట్టయ్య	కొనుతుల శాంతమ్మ	196	199/6	199/2	199/6	తాడి-100 మామిడి-2 జీడిమామిడి-1
29	203	AWD	4.39	4.39	--	కొనుతుల రాంబాబు (తండ్రి)అప్పారావు	కొండ	గోదావరి నది	204	202	జీడిమామిడి-30 తాడి-130,ఈత-25 బూరుగ-1
30	204	రైతు పుంజ	3.61	3.61	కునుతుల అప్పారావు (తండ్రి) చిట్టయ్య	కొనుతుల శాంతమ్మ	కొండ	గోదావరి నది	205	203	తాడి-80 మామిడి-1 వేప -1
31	208/2	రైతు పుంజ	6.98	6.98	చిడుగూరి లింగారెడ్డి (తండ్రి) సన్యాసి రెడ్డి	చిడుగూరి రామయ్యమ్మ (భర్త) లింగారెడ్డి	కొండ	211	209	206	తాడి-238 చింత-1 జామ-1 మామిడి-4
32	209/1	AWD	3.16	3.16	--	నేరం స్వామి (తండ్రి) కన్నయ్య	కొండ	208	209/2	208	చింత-1 తాడి-18
33	210/1	రైతు పుంజ	0.75	0.75	చిడుగూరి సోమేసి రెడ్డి (తండ్రి)వీరప్ప రెడ్డి	చిడుగూరి సోమిరెడ్డి (తండ్రి) వీరప్ప రెడ్డి	కొండ	209	210/2	కొండ	తాడి-236, సీతాఫలం-2 చింత-1
34	211/2ఎ	AWD	0.99	0.005	--	తాతూరి కాంతమ్మ (భర్త)రామిరెడ్డి	208	211/3	గోదావరి నది	211/1	తాడి-51 చింత-1
35	211/2బి			0.005		తాతూరి ముత్యాల రెడ్డి (తండ్రి) వీరప్ప రెడ్డి					
	మొత్తం		71.54	56.95							

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య**, I.A.S., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

O/o. స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

రిఫ్ నెం. బి1/222/2022 | **ఫారమ్ నెం.VI(ఎ)** | తేది : 29-08-2022

(2013వ సంవత్సరం 30వ చట్టం భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన తూర్పు గోదావరి జిల్లా, దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరిజిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టం-2013 నందలి 11 వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణం ప్రభావం మదింపు(ఇఐఎ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణం మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం.జె-12011/74/2005-1ఎ1,తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43(1) క్రింద సంయుక్త కలెక్టర్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా వారిని బాధిత కుటుంబాలకు పునరావాస, పునరుపాధికల్పన కల్పించు నిమిత్తం కార్యనిర్వాహకునిగా నియమించుచూ ప్రభుత్వం జి.ఓ.యమ్.నెం.1 రెవెన్యూ (భూసేకరణ), డిపార్ట్మెంట్ తేది.02.01.2015 నందు ప్రకటించబడెను.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్ -1, రాజమహేంద్రవరం వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ,విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ -15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

జిల్లా : అల్లూరి సీతారామరాజు | మండలం : దేవీపట్నం | గ్రామం : కొండమొదలు (బిట్-4)

క్రమ సంఖ్య	సర్వే నెం. స.డి.నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం (ఎ.సెంట్లు)	భూసేకరణ క్రింద విస్తీర్ణం (ఎ.సెంట్లు)	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా: ఎ-రిజిస్టర్ ప్రకారం	వెబ్ అడంగల్ ప్రకారం	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు
1	111/3	రైతు పుంజ	5.04	5.04	కొవ్వాసి సంకురు దొర (తండ్రి) గంగన్న దొర	కొవ్వాసి బజారమ్మ (భర్త) సంకురు దొర	112	139	116	111/1	
2	112/2	రైతు పుంజ	2.35	2.35	గొర్లె బజారమ్మ (భర్త) సీతయ్య	గొర్లె బజారమ్మ (భర్త) సీతయ్య	115	108	111	113	తాడి-95 మామిడి-2
3	113/2	AWD	2.47	2.47	గయ్యాలు	రవ్వ చిన్నయ్య (తండ్రి)మండు	114	107	112	కొండ	
4	114/1	AWD	3.09	3.09	--	కొవ్వాసి గంగరాజు (తండ్రి) సంకురు దొర	కొండ	113	115	కొండ	
5	114/3	AWD	2.03	2.03	--	బంజరు	కొండ	113	115	కొండ	తాడి-301 మామిడి-6 చింత-7, వేప-4 కుంకుడు-2
6	115	AWD	8.81	8.81	--	బంజరు	117	112	111	114	తాడి-401 మామిడి-1 చింత-4
7	117/3	AWD	0.64	0.64	గయ్యాలు	కుండల పెద్దిరెడ్డి (తండ్రి)చిన్నారెడ్డి	కాలువ	రోడ్డు	115	118	తాడి-24
8	117/5	రైతు పుంజ	3.98	3.98	ఇల్లా పెంటరెడ్డి (తండ్రి) ఎర్రం రెడ్డి	ఇల్లా దేవిరెడ్డి (తండ్రి)పెంటరెడ్డి	కాలువ	రోడ్డు	115	118	తాడి-205 చింత-8 మామిడి-7 వేప-1, టేకు-2 పెంకుటిల్లు-1
9	117/6	రైతు పుంజ	1.53	1.53	ఇల్లా పెంటరెడ్డి (తండ్రి) ఎర్రం రెడ్డి	ఇల్లా దేవిరెడ్డి (తండ్రి)పెంటరెడ్డి	కాలువ	రోడ్డు	115	118	--
10	118/1A	AWD	3.78	0.78	గయ్యాలు	చిదల అప్పమ్మ (భర్త)లచ్చిరెడ్డి	కాలువ	రోడ్డు	115	రోడ్డు	తాడి-38 మద్ది-6 వెలగ-2, చింత-2
11	118/1B			0.77		కత్తుల బుల్లమ్మ (భర్త) రామిరెడ్డి	కాలువ	రోడ్డు	115	రోడ్డు	
12	118/1E			0.74		కత్తుల పెంటమ్మ (భర్త)ఎర్రం రెడ్డి					
13	118/2	AWD	6.30	6.30	గయ్యాలు	కుండల గంగిరెడ్డి (తండ్రి)చిన్నారెడ్డి	రోడ్డు	కాలువ	115	రోడ్డు	తాడి-36 మామిడి-3 వేప-2
14	121/2	AWD	1.85	1.85	గయ్యాలు	వెల్లె లక్ష్మి (భర్త)సీతారామయ్య	120	123/2	121/3	125	-
15	121/3A	AWD	3.31	2.82		చోడి రామిరెడ్డి (తండ్రి)చిన్నబ్బు దొర	120	123/2	122	121/1	తాడి-210 విప్ప-2, చింత-4
16	122/2B	AWD	2.67	1.09	గయ్యాలు	చోడి సుబ్బయ్య (తండ్రి)బుచ్చయ్య	122/1	122/3	122/1	121	తాడి-231 చింత-5, విప్ప-5 మామిడి-3 కుంకుడు-1 ఇండిగ-1, టేకు-8 వేగిస-2
17	122/2A			1.09		చోడి పెద మంత్రమ్మ (భర్త)చిన్నయ్య	122/1	122/3	122/1	121	-
18	123/4	AWW	1.04	1.04	--	వెల్లె లక్ష్మి (భర్త)సీతారామయ్య	123/3	కొండ	123/5	123/2	తాడి-40 మామిడి-2
19	123/5	AWW	0.62	0.62	--	కాకా చిన్నయ్య దొర (తండ్రి) బాలయ్య	123/3	123/8	123/6	123/4	మామిడి-2 తాడి-20
20	123/7	AWW	1.04	1.04	--	స్వయం బీమురు (తండ్రి) దూలయ్య	122	123/6	కొండ	123/6	
21	123/8	AWD	0.82	0.82	గయ్యాలు	కాకా చిన్నయ్య దొర (తండ్రి) బాలయ్య	123/6	కొండ	123/9	123/5	
22	123/9	AWW	1.22	1.22	--	స్వయం బీమురు (తండ్రి) దూలయ్య	123/6	కొండ	కొండ	123/8	చింత-13
23	124/2	AWW	2.79	2.79	--	వెల్లె లక్ష్మి (భర్త)సీతారామయ్య	123/6	కొండ	కొండ	123/8	
24	124/3	AWD	1.33	1.33	గయ్యాలు	పూనెం రాముడు (తండ్రి)వీరయ్య	124/1	124/4	124/2	125	
25	124/4	AWD	3.88	3.88	గయ్యాలు	కారం వెంకయ్య (తండ్రి)సీతయ్య	124/3	కొండ	124/2	125	
26	130/4	AWD	0.52	0.52	గయ్యాలు	పూనెం రాముడు (తండ్రి)వీరయ్య	130/3	131	131	130/3	
27	133/A	రైతు పుంజ	12.08	6.05	1) పొత్తుల గోపాల కృష్ణ మూర్తి 2) పొత్తుల శివానందం (తండ్రి) వెంకట రామ పాపారావు	పోతుల గోపాల కృష్ణమూర్తి (తండ్రి)వెంకట రామ పాపారావు	132	కొండ	కొండ	135	
28	133/B			6.03		పోతుల శివానంద (తండ్రి) వెంకటరామ పాపారావు	132	కొండ	కొండ	135	
29	134	AWD	3.06	3.06	--	నడిపూడి రాజారెడ్డి (తండ్రి)లచ్చి రెడ్డి	135	కొండ	కొండ	166	
30	135/A	రైతు పుంజ	12.75	6.37	1) పొత్తుల గోపాల కృష్ణ మూర్తి 2) పొత్తుల శివానందం (తండ్రి) వెంకట రామ పాపారావు	పోతుల గోపాల కృష్ణమూర్తి (తండ్రి)వెంకట రామ పాపారావు	137	134	133	136	
31				6.37		పోతుల శివానంద (తండ్రి) వెంకటరామ పాపారావు					
32	135/B			0.01	--	వెబ్ ల్యాండ్ నందు పేరు లేదు					
33	136/2A	రైతు పుంజ	0.20	0.10	1) పొత్తుల గోపాల కృష్ణ మూర్తి 2) పొత్తుల శివానందం (తండ్రి) వెంకట రామ పాపారావు	పోతుల గోపాల కృష్ణమూర్తి (తండ్రి)వెంకట రామ పాపారావు	136/3	136/3	136/3	147	
34	136/2B			0.10		పోతుల శివానంద (తండ్రి) వెంకటరామ పాపారావు	136/3	136/3	136/3	147	
35	136/3A	రైతు పుంజ	8.55	4.27	1) పొత్తుల గోపాల కృష్ణ మూర్తి 2) పొత్తుల శివానందం (తండ్రి) వెంకట రామ పాపారావు	పోతుల గోపాల కృష్ణమూర్తి (తండ్రి)వెంకట రామ పాపారావు	137	168	135	148	
36	136/3B			4.275		పోతుల శివానంద (తండ్రి) వెంకటరామ పాపారావు					
37				0.005		వెబ్ ల్యాండ్ నందు పేరు లేదు					
	మొత్తం		97.75	95.26							

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య**, I.A.S., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
శనివారం ॥ 3-9-2022

విస్తరిస్తున్న రక్షణ



ఊడలుగా విస్తరిస్తుంది.
ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ
వందల ఏళ్లు జీవిస్తుంది
ఎన్నో జీవ రాశులకు ఆశ్రయమిస్తుంది
అందుకే, భగవద్గీతలో పరమాత్మ
చెట్లలో నేను మర్రిచెట్టును అన్నాడు.
మనిషి ఎదుగుదలలో మర్రిచెట్టును
శిఖరమంతగా పోల్చవచ్చు.
అలాంటి మర్రిచెట్టుకు రక్షణ కరువైతే ...!!
రోడ్లు అనో, డబ్బు వస్తుందనో...
మనిషి తన స్వార్థం కోసం మర్రిచెట్లను
తొలగించుకుంటూ పోతే...
మన మనుగడ మాత్రమే కాదు
ఎన్నో జీవరాశుల ఆశ్రయానికి
గొడ్డలిపెట్టు కాదా?!
చెట్లను కాపాడితే మనల్ని మనం
కాపాడుకున్నట్టే.
ఈ నినాదంతో మర్రిచెట్లను కాపాడుదాం.. అని బయల్దేరారు.
హైదరాబాద్‌వాసులు ఆసియా ఖాన్, కోబితా దాస్ కొల్లి, సాధన రాంచందర్.
వీరి ఆలోచనకు మద్దతునిస్తూ మరికొందరు జత కలిశారు.


మర్రిచెట్ల వద్ద సైకిల్ రైడ్


చేవెళ్ల రోడ్డులో మర్రిచెట్ల సముదాయం


మర్రిచెట్ల అవగాహనా కార్యక్రమంలో ఆసియా ఖాన్, కోబితా దాస్ కొల్లి, సాధన తదితరులు

ఒక చెట్టు ఊడలు ఊడలుగా విస్తరిస్తుందంటే ఆ చెట్టు మనకేదో సందేశం ఇస్తుందని అర్థం. కానీ, ఈ రోజుల్లో ఇది అనర్థం వైపుగా కదులుతోంది. దీనికి అడ్డుకట్టవేయడానికే మేం బయల్దేరాం అన్నారు ఆసియా, సాధన, కోబితా దాస్.

కదిలించిన వార్త

ప్రకృతి ప్రేమికులుగా ఉన్న వీరంతా కొన్నాళ్లుగా 'ట్రీ వాక్' పేరుతో నగరంలోని ముఖ్యమైన ప్రాంతాలకు వెళ్లి, వందలనాటి చెట్లను గమనించి, వాటి గురించి తెలుసుకుని వచ్చేవారు. స్కూల్ పిల్లలతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేవారు. 'కొన్నాళ్లుగా చెట్లను స్టడీ చేయడంలో ఉండే మా ఆసక్తి ఒక రోజు వచ్చిన వార్త కదిలించింది. 2019లో రోడ్డు వెడల్పు కోసం ప్రభుత్వం చేవెళ్ల నుంచి వికారాబాద్ వెళ్లే రోడ్డులో ఉన్న 9 వేల చెట్లను కట్ చేయడం లేదా వేరే చోటకు తరలించబోతున్నారు..' అనేది ఆ వార్త సారాంశం. దీంతో వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లాం. చేవెళ్ల రోడ్డులో ఉన్న ఆ చెట్ల సౌందర్యం చూడటానికి మాటలు చాలవు. అంతటి అనుభూతిని ఎలా దూరం చేస్తారు..? మాలో ఎన్నో అలజడులు. మాతో కలిసిన మరికొంత మందితో ఈ విషయాన్ని చర్చించాం. వారూ మా ఆలోచనకు మద్దతునిచ్చారు. వారం వారం ఆ చెట్లకిందనే జనాలను పోగుచేసి కార్యక్రమాలు చేపట్టడం మొదలుపెట్టాం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఆ వెయ్యి మర్రి చెట్లను రక్షించడానికి ఒక ఆన్‌లైన్ పిటిషన్ పెట్టాం. 63 వేల మంది ఈ పిటిషన్ మీద సంతకాలు చేసి, మద్దతు ఇచ్చారు. నేషనల్ హైవే అథారిటీ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, ఇతర ప్రభుత్వ అధికారులనే కలిసి మర్రిచెట్ల సంరక్షణ గురించి వివరించాం. ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేయడం మొదలుపెట్టాం' అని వివరించారు ఈ పర్యావరణ ప్రేమికులు.

తరలింపు సరైనదేనా?!

రోడ్డు వెడల్పు కోసం ఇక్కడి మర్రిచెట్లను మరో చోటకు తరలించాలనుకుంటే .. వాటిని యధాతథంగా చేయలేరు. వాటి కొమ్మలను నరికేస్తారు. కేవలం మధ్యలో ఉన్న భాగాన్నే తీసుకెళ్లి నాటుతారు. వందల ఏళ్లుగా పాతుకుపోయిన వేళ్లు లేకపోతే, ఆ చెట్టు ఎలా బతుకుతుంది. మోడుపోయినట్టుగా ఉన్న చెట్టు చిగురించినా ఎన్నాళ్లు బతుకుతుంది? అందుకే నేషనల్ (ఎన్‌హెచ్ఏ) వాళ్లను కలిశాం. కాపాడమని లెటర్లు ఇచ్చాం. తర్వాత ఈ చెట్లను కట్ చేయడం లేదని, ఈ రోడ్డు వెడల్పు చేయరు అని అదే ఏడాది వార్త వచ్చింది. సంతోషమేసింది. అయితే, అంతటితో వదిలేయలేదు. రెగ్యులర్‌గా వెళ్లి చెట్లు అన్నీ ఉన్నాయా లేదా అని చెక్ చేస్తున్నాం. మళ్లీ కిందటేడాది రోడ్డు వెడల్పుకు చెట్లను కొట్టేస్తారన్నారు. దీంతో అవగాహన కార్యక్రమాలు ఎక్కువ ఏర్పాటు చేస్తున్నాం. అధికారులను కలిసి, ప్రపంచంలో మరెక్కడా లేని ఈ మర్రి చెట్ల మార్గాన్ని తొలగించవద్దని అర్జీలు పెడుతున్నాం.

అవగాహన అవసరం

చెట్టుకు ఇవ్వాల్సిన రక్షణ గురించి తెలిస్తే, కాపాడే గుణం కూడా వస్తుంది. అందుకే, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. దీపావళి సమయంలో చెట్లకింద దీపాలు పెట్టడం, మరోసారి చెట్లకింద నిల్చొని పద్యాలు చదవడం, ఇంకోసారి నిశ్శబ్దంగా ఉండటం, చెట్టుకు స్వాతంత్ర్యం .. ఇలా రకరకాల థీమ్‌లతో చెట్ల వద్దే కాదు, నగరంలో పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. వీటిలో ప్రాచీన వృక్షాలను కాపాడటం ఎలాగో వివరిస్తున్నాం. మొత్తం పర్యావరణ వ్యవస్థను కలిగి ఉన్న మర్రిచెట్టును రక్షిస్తే సకల జీవరాశిని రక్షించినట్టే. ఇటీవలే ఢిల్లీలో ఒకచోట ఇలాగే చెట్లను మరో చోట నాటే ప్రయత్నం చేస్తే, వాటిలో చాలా చెట్లు బతకలేదని తెలిసింది. ప్రభుత్వం ఈ చెట్ల మార్గాన్ని నేచురల్ హెరిటేజ్‌గా మార్చాలన్నది మా ప్రయత్నం.

కొన్నిసార్లు నెమ్మది అవసరమే!

'జీవితంలో అన్ని చోట్లా వేగం సరికాదు. కొంత నెమ్మది కూడా మంచిది. వేగంగా వెళ్లాలనుకునేవారు ఇతర హైవేల నుంచి వెళ్లొచ్చు. ఈ ఒక్క రోడ్డును మాత్రం వదిలేయమని మేం కోరుతున్నాం' అంటారు ఆసియా ఖాన్. 'మాతోపాటు మా బృందంలో మరో ఎనిమిది మంది ఉన్నారు. మాకు సపోర్ట్ చేసే మగవారు కూడా మా బృందంలో చేరారు. స్వచ్ఛందంగా చేసే ఈ నేచర్ అందరినీ ఆకట్టుకుంటోంది. మర్రిచెట్లను కాపాడటం కోసం చేసే అవగాహన సదస్సులలో పాల్గొనేవారి సంఖ్య ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. ఈ యేడాది జూన్‌లో 914 మర్రి చెట్లకు జియో ట్యాగ్ చేయడానికి, డాక్యుమెంట్ చేయడానికి వాలెంటీర్లు చాలా రోజులపాటు పనిచేశారు. చెట్టు ఏ దిశలో, ఎలా ఉంది..అనే వివరాలతో ఫొటోలతో సహా ప్రతి మర్రి చెట్టు డేటా ఏర్పాటు చేశాం. దీనిని ఆన్‌లైన్‌లో కూడా పెట్టాం. ఇదే కాదు, తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడైనా వందల ఏళ్ల నాటి చెట్లు ఉంటే, వాటి గురించి సమాచారం సేకరించి, వాటిని కాపాడటానికి కృషి చేస్తున్నాం' అని వివరించారు ఈ పర్యావరణప్రేమికులు.

అనవసర ఆలోచనలు, అవసరాల నుంచి దూరమై, చెట్టును కాపాడుదాం.

– నిర్మలారెడ్డి

జాతీయ పోషకాహార వారోత్సవం (సెప్టెంబర్ 1–7)



నీరసమూ నిద్ర వదలగొట్టండి

సోఫా కనిపిస్తే నడుము వాల్చాలనిపిస్తోందా?
ఏ పనీ చేయలేని నీరసం
ముంచుకు వస్తోందా?
ఇదేమైనా పోస్ట్ కోవిడ్ లక్షణమా?
మరేదైనా సమస్యా?
ఇటీవల గృహిణులు నీరసాన్ని
ఫిర్యాదు చేస్తున్నారు.
పని మాని నిద్ర పోవడానికి ఇష్టపడుతున్నారు.
దీనికి పోషకాహార లోపం ఒక కారణం.
ఇతర కారణాలు కూడా ఉంటాయి.
గృహిణి నీరసంగా ఉంటే ఇల్లు నడవదు.
లేవండి. చలాకీగా మారండి.

'ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్' అన్నాడు మహాకవి గురజాడ. ఆయన బాధపడింది తగినంత పౌష్టికాహారం లేని తన కాలపు మనుషులను చూసే. సరైన ఆహారమే శక్తి. సరికాని ఆహారం నీరసం. ఫుల్లుగా తిన్నా అసలు తినకపోయినా విలోమ ప్రతిఫలం వస్తుంది. అతి నిద్ర, నీరసం ఇంటి సభ్యులకు ముఖ్యంగా గృహిణులకు ఉంటే పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. కోవిడ్ తర్వాత చాలా ఇళ్లల్లో స్త్రీలు నీరసం అని అంటూ ఉన్నారు. కోవిడ్ బారిన పడ్డ పిల్లలు కూడా అప్పుడప్పుడు నీరసం అని అనువుగాని సమయాలలో నిద్ర అని అంటూ ఉన్నారు. ఈ సమస్యలన్నింటినీ తగిన పౌష్టికాహారంతో ఎదుర్కొనవచ్చు. ఇప్పుడు దేశంలో పౌష్టికాహార చైతన్యం కోసం కోసం సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు 'పౌష్టికాహార వారోత్సవం' జరుగుతుంది. సరియైన ఆహారంతో నీరసాన్ని ఎదుర్కోవడం ముఖ్యం.

సమతుల ఆహారం: మధుమేహం, గుండె, బి.పి., స్థూలకాయం... వీటిని అదుపు చేసే ఆహారం తినడం గురించి కొందరు శ్రద్ధ పెడతారు. కాని సమగ్రంగా శరీరాన్ని చురుగ్గా ఉంచే ఆహారాన్ని పట్టించుకోరు. అసమతుల ఆహారం శరీరానికి నీరసం తెస్తుంది. కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం అతిగా తింటే మందకొడితనం వస్తుంది. అది కూడా ఒక రకమైన అలసట కలిగిస్తుంది. కేల్షియం, మెగ్నిషియం, ఐరన్, జింక్, విటమిన్లు ఇవన్నీ తగినంతగా తీసుకుంటే సరైన నిద్ర పడుతుంది. తిన్నది ఒంటికి పట్టి ఉదయానికి హుషారు వస్తుంది. లేకుంటే నిద్ర సరిగ్గా పట్టదు. మరుసటి రోజు మత్తు, అలసట, నీరసం ఉంటాయి.

జొన్నలు, కొర్రలు, గ్రీన్ టీ: నిదానంగా జీర్ణమయ్యే జొన్నలు, కొర్రలు మంచివి. చికెన్, చేపలు మేలు చేస్తాయి. పాలు, పెరుగు, గుడ్డు, సోయా, పెసలు, అలసందలు ఆహారంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరెంజ్, జామ, బొప్పాయి, స్ట్రాబెర్రీలు నీరసాన్ని, కీర మలబద్ధకాన్నీ తొలగిస్తాయి. అరటిపండు నీరసానికి బద్ధ విరోధి. బ్రొకోలి, క్యాప్సికమ్, క్యారెట్, కాలిఫ్లవర్, టొమాటోలు ఇవి ఉన్న కూరలు ముఖ్యం. ఆకుకూరలు పెంచాలి. మజ్జిగ బాగా తీసుకోవాలి. జొన్న రొట్టె, జొన్న రవ్వ ఒక పూట అలవాటు చేసుకోవాలి. ఇవన్నీ పోషకాలనిస్తాయి. గ్రీన్ టీ మిమ్మల్ని ఎనర్జిటిక్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. ఏకాగ్రతను పెంచడంతో పాటు అలసటను తొలగిస్తుంది.

తగినంత నీరు, నిద్ర:
జీవక్రియలకు నీరు అవసరం. జీవక్రియలు జరిగే కొద్దీ శరీరంలో నీటి శాతం తగ్గుతూ ఉంటుంది. అందువల్ల ఎప్పటికప్పుడు నీరు తీసుకోవాలి. లేదంటే శరీరంలో రసం పోయి నీరసం వస్తుంది. అలాగే సరియైన నిద్ర కోసం పూర్తిగా ప్రయత్నించాలి. అలజడి, ఒత్తిడి, అనవసర ఆలోచనలు నిద్రకు దూరం చేస్తాయి. నిద్ర లేకపోతే ఆరోగ్యం ఉండదు. కనుక రోజంతా ఎంత పని, చికాకులు ఉన్నా నిద్రా సమయంలో మంచి సంగీతం వింటూ, కుటుంబ సభ్యులతో మంచి మాటలు చెబుతూ, శుభ్రమైన పక్క మీద నిద్ర పోవాలి. అదే నీరసానికి సరైన విరుగుడు. నిద్ర పోయే ముందు ఒక గ్లాసు మంచినీరు తాగితే మంచిది.

మందులు: కొన్ని రకాల మందులు కూడా నిద్ర లేమికి, నీరసానికి కారణం అవుతాయి. బి.పి, యాంగ్జయిటీ, యాంటీ డిప్రెసెంట్లు వంటివి నిద్రకు విఘాతం కలిగిస్తాయి. అందువల్ల అప్పుడప్పుడు డాక్టర్‌ను కలిసి వాడుతున్న మందులు చెక్ చేయించి వాటి మోతాదును సరి చేసుకోవాలి. నిద్ర సమస్యలు ఉంటే మందులు మార్చే వీలుంటే మార్చుకోవాలి.

ఆహారం, అలవాట్లు ఇవే మనిషికి ఆరోగ్యాన్ని ఇస్తాయి. గృహిణి ఆరోగ్య బాధ్యత గృహిణిది మాత్రమే కాదు. కుటుంబానిది. అందరూ కలిసి ఇంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తప్పనిసరి.

టిప్స్

- పసుపుపచ్చని మరకలపై తాజా మీగడ అద్ది పదిహేను నిమిషాలపాటు అలాగే ఉంచాలి. తరువాత స్పూన్‌తో క్రీమ్‌ను తీసేయాలి. ఇప్పుడు ఈ వస్త్రాన్ని సర్ఫ్ నీటిలో నానబెట్టి ఉతికితే పసుపు మరక ఎక్కడా కనిపించదు.
- వేడి నీళ్లల్లో వెనిగర్, కొద్దిగా సర్ఫ్, వంటసోడా వేసి చక్కగా కలపాలి. ఈ నీటిలో బట్టను ముంచి కిచెన్ కిటికీలను తుడిస్తే జిడ్డుమరకలు, దుమ్ము ధూళీ తొలగి కిటికీలు శుభ్రంగా ఉంటాయి.





పురస్కారం


'ఏకెఏ' డాక్యుమెంటరీలో దృశ్యాలు

గీతా చిత్రలహరి

బాలీవుడ్ అనే మహా సముద్రంలో ప్రతి అల అరుదైన అనుభవాలు, జ్ఞాపకాలను మోసుకు వస్తుంది.
వాటిని అందుకునే వారు అరుదుగా ఉంటారు.
ఈ అరుదైన కోవకు చెందిన రైటర్, ఎడిటర్, డైరెక్టర్ గీతికా నారంగ్ అబ్బాసి కేరళలో జరిగిన 'ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ అండ్ షార్ట్‌ఫిల్మ్స్ ఫెస్టివల్'లో బెస్ట్ లాంగ్ డాక్యుమెంటరీ అవార్డ్ గెలుచుకుంది...

నార్త్ ఢిల్లీలోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన గీతికా నారంగ్ అబ్బాసికి బాల్యంలో ఏకైక వినోద మాధ్యమం సినిమా. కాస్త చమత్కారంగా చెప్పాలంటే, ఆమె బాల్యజీవితంలో బాల్య జ్ఞాపకాల కంటే బాలీవుడ్ సినిమాలే ఎక్కువ!

తండ్రి నారంగ్ అబ్బాసి బిమల్‌రాయ్, గురుదత్, రాజ్‌కపూర్‌ల గురించి చెప్పడమే కాదు వారి సినిమాలు చూపించేవాడు. చిన్నప్పుడు గీతికకు ఇష్టమైన కథానాయకుడు రాజ్‌కపూర్. గీతిక మాటల్లో చెప్పాలంటే రాజ్‌కపూర్ తన హావభావాలతో గ్రేట్ చార్లి చాప్లిన్‌ను తనకు పరిచయం చేశాడు.

చార్లి చాప్లిన్ సినిమాలు చూసి...

'ఈయన రాజ్‌కపూర్‌ను బాగా కాపీ కొడుతున్నాడు' అని అమాయకంగా అనుకునే రోజులవి!

ఢిల్లీలోని హిందూ కాలేజి నుంచి ఆంగ్ల సాహిత్యంలో పట్టా పుచ్చుకుంది గీతిక. ఆ తరువాత ఎడ్వర్‌టైజింగ్‌లో పీజీ చేసింది. అయితే ఆ చదువేమి తనకు అంత ఆసక్తికరంగా అనిపించలేదు. ఒక సాయంత్రం కాఫీ సేవిస్తూ...

'నాట్ మై కప్ ఆఫ్ టీ' అనుకుంది ప్రకటనల రంగం గురించి.

ఢిల్లీలోని ఒక ఫిల్మ్‌ప్రొడక్షన్ కంపెనీలో చేరడంతో ఫిల్మ్ మేకింగ్‌పై తనకు అవగాహన ఏర్పడింది. కొన్ని డాక్యుమెంటరీలకు సహాయకురాలిగా పనిచేసింది.

'హాలీవుడ్‌తో పోల్చితే మన దగ్గర డాక్యుమెంటరీల సంఖ్య చాలా తక్కువ. ఎందుకు ఇలా!' అనుకునేది చాలా సార్లు. ఆ లోటును తన వంతుగా భర్తీ చేయడానికి అన్నట్లుగా తొలిసారిగా 'గుడ్‌నైట్' పేరుతో మొదటి సారిగా షార్ట్ డాక్యుమెంటరీ తీసింది.

నాన్న తనకు సినిమాలకు సంబంధించిన విశేషాలు చెబుతుండేవాడు. ఉదా: ఫలానా సినిమాలో నృత్య బృందంలో కనిపించే అమ్మాయి ఆ తరువాత పెద్ద హీరోయిన్ అయింది...ఈ సినిమా పేరు చెప్పగానే ఆ హీరో నటవిశ్వరూపం గుర్తుకువస్తుందిగానీ, నిజానికి ఆ సినిమా కథ వేరొక హీరో కోసం తయారు చేసింది. ఆ హీరోకి నచ్చకపోవడంతో ఈ హీరోకి అవకాశం వచ్చి ఎక్కడికో తీసుకెళ్లింది.

ఈ నేపథ్యంలో గీతికకు అనిపించింది ఏమిటంటే...

'మన సినిమాల పైనే వివిధ కోణాల్లో డాక్యుమెంటరీలు తీస్తే ఎలా ఉంటుంది? చెప్పడానికి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి కదా!'

విడుదలకు నోచుకోని 'అమీర్ సల్మాన్ షారుఖ్ ఫీచర్ ఫిల్మ్' నుంచి 'అచ్చం ఫలానా హీరోలాగే ఉంటాను' అని మురిసిపోయే జూనియర్ ఆర్టిస్ట్‌ల వరకు ఎన్నో విషయాలను తన డాక్యుమెంటరీలలోకి తీసుకువచ్చింది గీతిక. ఫిరోజ్ ఖాన్‌ను 'మిమ్మల్ని చూసీ చూడగానే ప్రేక్షకులు నవ్వితే మీ స్పందన ఏమిటి?' అని అడిగిందట.

'ఆర్టిస్ట్‌లో హీరోయే కాదు జోకర్ కూడా ఉంటాడు' అని హాయిగా నవ్వాడట ఫిరోజ్. ఇలా హాయిగా నవ్వే వాళ్లతో పాటు 'అది నిన్నటి అభిప్రాయం మాత్రమే. ఈరోజు నా అభిప్రాయం మార్చుకున్నాను' అని ఏ అభిప్రాయం మీద నిలకడలేని నటులతో చిత్రమైన అనుభవాలు ఎదుర్కోవలసి వచ్చింది గీతిక.

నాటి 'గుడ్‌నైట్' నుంచి నేటి 'ఏ.కె.ఏ' వరకు రైటర్, ఎడిటర్, డైరెక్టర్‌గా గీతిక ఎన్నో విషయాలు నేర్చుకుంది. తనను తాను మెరుగుపరుచుకుంది.

ఇటీవల కేరళలో జరిగిన 'ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ అండ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్'లో గీతిక నారంగ్ తీసిన 'ఏ.కె.ఏ' డాక్యుమెంటరీకి మంచి స్పందన లభించడమే కాదు 'బెస్ట్ లాంగ్ డాక్యుమెంటరీ అవార్డ్'ను గెలుచుకుంది.

బాలీవుడ్ కథానాయకులు దేవానంద్, అమితాబ్ బచ్చన్, షారుక్‌ఖాన్‌లను పోలి ఉండే ముగ్గురు వ్యక్తులపై తీసిన డాక్యుమెంటరీ ఇది. మిమిక్రీ నుంచి స్టార్‌డమ్ వరకు చిత్రరంగానికి సంబంధించి అన్ని కోణాలు ఇందులో కనిపిస్తాయి. 'నా డాక్యుమెంటరీల లక్ష్యం నవ్వించడం కాదు, సీరియస్‌గా ఆలోచింపజేయడం' అంటుంది గీతికా నారంగ్. అలా అని నవ్వకుండా ఉండలేము, అలా అని సీరియస్‌గా ఆలోచించకుండా ఉండలేము. అదే కదా ఆమె డాక్యుమెంటరీల ప్రత్యేకత!


గీతికా నారంగ్ అబ్బాసి

సాధికారత

దారి చూపుతూ ధైర్యం చెబుతూ

విజయాలు సాధించిన వారందరూ, ఇతరుల విజయానికి తమవంతు ప్రయత్నం చేస్తారనే గ్యారెంటీ లేదు.

'ఇన్‌ఫ్లూయెన్షియల్ బిజినెస్ ఉమన్' 'ఉమెన్ ఇన్వెస్టర్స్ రోల్‌మోడల్' గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సీమా చతుర్వేది ఔత్సాహిక మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌లకు చేయూత ఇవ్వడానికి రంగం సిద్ధం చేసింది.

రకరకాల కారణాలతో వెనక్కి తగ్గాలనుకుంటున్న వారిని తన మాటలతో కొత్త బాటలో నడిచేలా, పరుగులు తీసేలా చేస్తుంది సీమాచతుర్వేది...


సీమా చతుర్వేది

ఢిల్లీలోని కాలేజీ రోజుల్లో చదువు మాత్రమే తన ప్రపంచం కాదు. వివిధ రకాలైన ఆర్థిక విశ్లేషణలను గమనించడం ద్వారా ప్రపంచాన్ని కూడా చదువుకుంది సీమాచతుర్వేది. స్టాక్ మార్కెట్ పరిణామాలను నిశితంగా గమనించేది. చదువు పూర్తయిన తరువాత ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎన్నో విజయాలు సాధించింది.

'ఇక్కడ పురుషులు మాత్రమే నిలదొక్కుకోగలరు' అనుకునే చోట తన సత్తా చాటింది.

ప్రతిభ, సామర్థ్యాలకు కొలమానం లాంటి ఎన్నో జాబితాలలో తన పేరు చోటు చేసుకుంది. బెస్ట్ ఇన్‌ఫ్లూయెన్స్‌డ్ బిజినెస్ ఉమన్‌గా పేరు తెచ్చుకుంది.

'సాధించాలనుకున్నాను. సాధించాను' అనుకోలేదు సీమ. ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా రాణించాలని కలలు కనేవారికి, రకరకాలుగా ఇబ్బందులు పడుతున్న ఔత్సాహిక మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌లకు అన్నిరకాలుగా అండగా నిలవడానికి ఏడబ్ల్యూఇ (ఎచీవింగ్ ఉమెన్ ఎంటర్‌ప్రైజ్) అనే వేదికకు శ్రీకారం చుట్టింది.

'స్త్రీ, పురుషుల మధ్య డిజిటల్ విభజన ఉంది. ఇది తగ్గి సమానత్వం రావాలంటే సాంకేతిక జ్ఞానాన్ని మహిళలకు చేరువచేయాలి. వారిలో ఉన్న సహజసిద్ధమైన ప్రతిభాసామర్థ్యాలను సాంకేతిక జ్ఞానం రెండు అడుగులు ముందుకు తీసుకువెళుతుంది. అందుకే ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా రాణించాలనుకునే మహిళలకు సాంకేతిక జ్ఞానాన్ని దగ్గర చేయాలనుకుంటున్నాం' అంటుంది సీమ.

మోటివేషనల్ స్పీకర్‌గా స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఇవ్వడం నుంచి ఈక్విటీ క్యాపిటల్ వరకు మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌లకు అన్ని రకాలుగా సహకరిస్తుంది సీమ.

సీమ ప్రోత్సాహం, చేయూత వల్ల ఎంతోమంది మహిళలు సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా ఎదిగారు. ఇందులో అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నవారున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా అసాధారణ విజయాలు సాధించినవారిలో గృహహింస బాధితులు కూడా ఉన్నారు.

తన ప్రోత్సాహం, చేయూత వల్ల ఎంతో మంది మహిళలు సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా ఎదిగారు. ఇందులో అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నవారున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా అసాధారణ విజయాలు సాధించినవారిలో గృహహింస బాధితులు కూడా ఉన్నారు.

సినిమాలు సరదాగా చూస్తుంటాంగానీ, వాటి ప్రభావం మనపై బలంగా ఉంటుంది. 'ప్రెట్టీ ఉమెన్' అనే హాలీవుడ్ సినిమా ప్రభావం తన కెరీర్‌పై బలంగా ఉందని చెబుతుంది సీమ. కార్పొరేట్ ప్రపంచం, వ్యాపార రంగాలలో తన ఆసక్తిని విజయాలుగా మలచుకోవడానికి ఆ సినిమాలోని పాత్రలు ఉపయోగపడ్డాయని చెబుతుంది సీమా చతుర్వేది.



కేరెంటింగ్



ప్రేమతోనే పెంచుతున్నారా?

సాధారణంగా ప్రతి తల్లీ తండ్రీ తమ పిల్లలను ప్రేమగా... అపురూపంగా పెంచాలనుకుంటారు. అదే సమయంలో వారు జీవితంలో ఉన్నత స్థితికి వెళ్లాలని కోరుకుంటారు. వారికి కావలసిన వాటిని సమకూర్చడం కోసం శక్తికి మించి కష్టపడతారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు వాళ్లకి కొన్ని విషయాలలో మితిమీరిన స్వేచ్ఛను ఇస్తుంటారు. మరికొంతమంది అందుకు పూర్తి విరుద్ధం. పిల్లలకు ఏ ఒక్క విషయంలోనూ స్వేచ్ఛ ఇవ్వకుండా ప్రతి విషయంలో తాము చెప్పినట్లే నడుచుకోవాలంటారు. తీవ్రమైన క్రమశిక్షణలో పెడుతుంటారు. అతి స్వేచ్ఛ వల్ల పిల్లలు పెద్దల మాటను వినకపోవడం లేదా అతి క్రమశిక్షణ వలన పంజరంలో బంధించిన పక్షుల్లా స్వేచ్ఛను కోల్పోయి ఏ పనీ చేతకాని వాళ్లలా తయారవడం వంటి దుష్ప్రభావాలు కలిగే అవకాశం ఉంది. అందుకే పిల్లలను ఎలా పెంచాలో తెలుసుకుందాం.

సానుకూల భావాలకు పాదు

తల్లిదండ్రులు చేయవలసిన మొట్టమొదటి పని పిల్లలలో పాజిటివిటీని పెంపొందించడం. ఏదీ తమకు లేదు, రాదు, తెలియదు, చేతకాదు, చెయ్యలేము అనుకోకుండా అన్నింటినీ పాజిటివ్‌గా చూడగలగడాన్ని నేర్పించాలి. చదువులో గాని, ఆటల్లో గాని వారికి కావాల్సిన ప్రోత్సాహాన్ని, ప్రేరణను తల్లిదండ్రులే పిల్లలకు అందించాలి. తద్వారా వారిలో ఏదైనా సాధించగలం అనే సానుకూల దృక్పథం పెరుగుతుంది. ఇది వారు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరేందుకు చాలా ముఖ్యం.

పరోపకార గుణం..

కొందరు తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుంచే స్వార్థాన్ని నూరిపోస్తుంటారు. స్వార్థం ఉండటం తప్పు కాదు కానీ, పరోపకార గుణం లేకపోతే మాత్రం వారు నిస్సారంగా తయారవుతారు. అందువల్ల బాల్యం నుంచి వారిలో ఇతరులకు సహాయపడే గుణాన్ని అలవాటు చేయాలి. తోటి వాళ్లకు, చుట్టుపక్కల వారికి, పెద్దవాళ్లకు ఏదైనా అవసరంలో ఉన్నప్పుడు అడగనక్కరలేకుండానే స్పందించి సాయపడేలా వారిని ప్రోత్సహించాలి. అందువలన వారు అందరితో కలివిడిగా ఉంటూ స్నేహపూరిత వాతావరణాన్ని అలవాటు చేసుకుంటారు. తద్వారా వారిలో ఏదో సాధించాలనే ఆశయం, నాయకత్వ లక్షణాలు కూడా అలవడతాయి.

చీటికిమాటికీ చిర్రుబుర్రులాడవద్దు

మనం కొన్ని సందర్భాల్లో పిల్లలపై తెలియకుండానే కోపానికి లోనవుతాం. ఉదాహరణకు వారు మన కళ్ల ముందే ఏదైనా గోడ ఎక్కడం లేదా ప్రమాదకర వస్తువులతో ఆడుకోవడం వంటివి చేసినప్పుడు పట్టరాని కోపం వస్తుంది. అయితే ఇలాంటి సందర్భాలలో కోపం కన్నా సంయమనం చాలా అవసరం. వారిని దగ్గరకు తీసుకొని అలా చేయకూడదని నెమ్మదిగా చెప్పాలి. వారు చేసిన పని వలన జరిగే అనర్థాలను వివరించాలి. మనం ఎంత ఎక్కువ వారి మీద చికాకు పడితే వారు అంత మొండిగా తయారయ్యే ప్రమాదం ఉంది. వారి అలవాటును మనం వ్యతిరేకించడాన్ని వారు సహించలేరు. అందుకే ముందుగా వారితో మంచిగా మాట్లాడి వారిని మచ్చిక చేసుకోవాలి. అలాగే పిల్లలను బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం మంచిది కాదు.

తల్లి/ తండ్రి మీద ప్రేమను పెంపొందించాలి

భార్యాభర్తల మధ్య సఖ్యతలేని పిల్లలు చిన్నప్పటినుంచి అభద్రతాభావానికి లోనవుతారు. తల్లిదండ్రులు అన్యోన్యంగా ఉంటే పిల్లలు జీవితంలో విజయం సాధిస్తారని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి. భార్యాభర్తల సఖ్యత పిల్లల ఎదుగుదలకు దోహదపడుతుంది. చాలామంది పిల్లలు అయితే అమ్మతో లేదా నాన్నతో మాత్రమే చనువుగా ఉంటారు. ఇంకొకరితో పెద్దగా మాట్లాడరు. తమకు సంబంధించిన ఏ విషయం కూడా వారితో షేర్ చేసుకోరు. ఇలా కాకుండా ఇద్దరితో సమానంగా వారి అభిప్రాయాలను పంచుకునేలా అలవాటు చేయాలి. తమకు ఎటువంటి ఇబ్బంది కానీ, అవసరం కానీ వచ్చినా, కష్టం కలిగినా ధైర్యంగా చెప్పుకునేలా వారిని ప్రోత్సహించాలి

సాధించే గుణాన్ని నేర్పాలి

పిల్లలు ఏదైనా సాధించాలనే గుణాన్ని వారికి చిన్నప్పటి నుండి నేర్పించాలి. వారు ఎప్పుడు ఏదైనా ఒక గోల్ పెట్టుకొని దాని మీద ఫోకస్ చేసేలా వారికి తర్ఫీదు ఇవ్వాలి. ఎటువంటి సవాళ్లనైనా వారు భయపడకుండా ధైర్యంగా స్వీకరించేలా వారికి ప్రోత్సహించాలి. వారి ఏ పనినైనా కష్టంతోకాకుండా ఇష్టంగా చేయడం నేర్పాలి. ఇది వారిలో పోరాట పటిమను పెంపొందించి జీవితంలో ఏదైనా సాధించాలనే తపనను వారిలో చిన్నపటి నుండి బలంగా నాటుతుంది.

మీ ఒత్తిడిని పిల్లల మీద వెయ్యవద్దు

మనలో చాలామంది మన దైనందిక జీవితంలో ఉండే ఒత్తిడి తాలూకు ప్రభావాన్ని తమ కుటుంబసభ్యులపై ముఖ్యంగా పిల్లలపై చూపిస్తుంటారు. మనకు తెలియకుండా ఇది మన పిల్లలలో ఒకవిధమైన నెగిటివిటీని పెంచుతుంది. వారు క్రమక్రమంగా మనల్ని శత్రువుల్లా చూడటం ప్రారంభిస్తారు కాబటిట ఒత్తిడిని, కోపాన్ని వారి మీద చూపించకూడదు. మనం మన పనిలో ఎంత ఒత్తిడిలో ఉన్నా వారి దగ్గరకు వచ్చేటప్పటికి అవేమీ వారి మీద చూపించకూడదు. ప్రేమగా దగ్గరకు తీసుకొని మాట్లాడటం అలవరచుకోవాలి. ఇలా చేయడం వలన వారు మనపై ఉండే భయాన్ని కోల్పోయి ప్రతి విషయాన్ని మనతో షేర్ చేసుకోవడం అలవాటు చేసుకుంటారు. దానితోపాటు మనకు తెలియకుండానే మన ఒత్తిడి కూడా ఎగిరి పోతుంది.

తప్పును అంగీకరించడం నేర్పాలి

చాలా సార్లు పిల్లలు తప్పు చేస్తే తల్లిదండ్రులను తిడతారనే భయంతో మరొకరిని నిందిస్తారు. అటువంటి పరిస్థితిలో పిల్లలకు అబద్ధం చెప్పకుండా ప్రతి చిన్న, పెద్ద తప్పును అంగీకరించడం నేర్పాలి.

బుజ్జగించి చూడండి

కొందరు పిల్లలు చిన్న విషయాలకే కోపం తెచ్చుకుంటారు. ప్రతిదానికీ మారాం చేయడం, అలగడం వంటి వాటితో పెద్దలను విసిగిస్తుంటారు. అటువంటి పరిస్థితిలో పిల్లలను తిట్టడం లేదా చేయి చేసుకోవడం వల్ల వారు మరింత మొండిగా తయారయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల సాధ్యమైనంత వరకు వారిని బుజ్జగించి చూడాలి. దారిలోకి రాకపోతే చిన్నగా బెదిరించాలి కానీ చేయి చేసుకోవడం లేదా తిట్టడం మంచిది కాదు. అలాగే పిల్లల మంచి అలవాట్లను అభినందించడం అవసరం. వారిని ప్రేమతో పెంచాలి. వారిలో ప్రేమను పెంపాలి.

చిన్న చిన్న బాధ్యతలు అప్పగించాలి

పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు తల్లిదండ్రులు వారికి ఏ పనీ చెప్పరు. ఒకవేళ వాళ్లే ఏదైనా చేయాలని ఉత్సాహం చూపించినా, నీకెందుకు ఈ పనులు, చక్కగా చదువుకో పో.. అంటూ ఉంటారు. వారు ఎప్పుడూ చదువుకోవాలని, ఎంత చదివితే అంత ప్రయోజనం అని భావిస్తారు. అయితే పిల్లలకు చదువుతోపాటు ఇంట్లో చిన్న చిన్న బాధ్యతలను కూడా అప్పజెప్పాలి. దీనివలన వారిలో కార్యదక్షత పెరిగి సంఘంలో ఎలా నడుచుకోవాలో తెలుస్తుంది. అందువల్ల రోజూ మన ఇంటిలో ఉండే కొన్ని బాధ్యతలను వారు క్రమం తప్పకుండా నిర్వర్తించేలా వారిని ప్రేరేపించాలి.

లైఫ్@360


మొక్కజొన్న అతి చౌకగా లభించే ఆహారం. దీని గింజలను కాల్చుకొని లేదా ఉడకబెట్టుకొని తింటారు. ముసురు పట్టినప్పుడు మొక్కజొన్న కండె కాల్చుకుని తింటూ ఉంటే ఆ మజానే వేరు. మొక్కజొన్న గింజల నుంచి పాప్‌కార్న్, కార్న్ ఫ్లేక్స్ తయారుచేస్తారు. మొక్కజొన్న పిండితో రొట్టెలు చేసుకుంటారు. ఇది చాలా బలవర్థకమైన ఆహారం. మొక్కజొన్న కేవలం ఆస్వాదించడానికే కాదు.. దీనిని తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అనేకం.. అవేమిటో చూద్దామా..?

కండె బలం.. గుండె బలం

మొక్కజొన్న గింజలు తినటం ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తుంది. కంకులుగా వున్నప్పుడే వాటిని తినేయవచ్చు లేదా మసాలాలు, కారాలు కూడా తగిలించి తినచ్చు. గ్రేవీలో వేసి ఫ్రైడ్‌రైస్‌తో కలిపి తినవచ్చు లేదా ఉల్లిపాయ, పచ్చిమిర్చి వంటి వాటితో కూడా చేర్చితే సాయంకాలం వేళ మంచి చిరుతిండి.

- మొక్కజొన్నలో లినోలిక్ ఆసిడ్, విటమిన్ ఇ, బి1, బి6, నియాసిన్, ఫోలిక్ ఆసిడ్ రైబోఫ్లోవిన్ అనే విటమిన్లు ఎక్కువగా ఉన్నాయి. మధుమేహాన్ని నియంత్రించే శక్తి ఉందని అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ చెబుతోంది.
- పీచు పుష్కలంగా ఉంది. ఇది జీర్ణక్రియకు బాగా పనిచేస్తుంది. ఆహారంలో పీచు ఉండడంతో మొక్కజొన్న మలబద్ధకం, మొలలు వంటివి రాకుండా కాపాడుతుంది. పేగుకేన్సర్‌ను అరికడుతుంది.
- ఎముకల బలానికి పోషకాలైన కాపర్, ఐరన్, అవసరమైన లవణాలు, మినరల్స్ మొక్కజొన్నలో పుష్కలంగా ఉన్నాయి.
- పసుపు రంగులో ఉండే ఈ చిన్న గింజలలో మెగ్నీషియం, ఐరన్, కాపర్, ఫాస్పరస్ వంటివి కూడా ఉండడంతో ఎముకలు గట్టిపడేలా చేస్తుంది. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచడానికి ఉపయోగపడతాయి.
- మొక్కజొన్నలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతిమంతంగా ఉంచడమేకాదు... శరీరంపై ముడతలు రాకుండా చేస్తాయి.
- మొక్కజొన్న గింజల నుంచి తీసిన నూనె చర్మ సంబంధ వ్యాధులకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. దీనిలో ఉండే లినోలిక్ యాసిడ్ చర్మం మీద వచ్చే మంటలను, దద్దుర్లను తగ్గిస్తుంది.
- రక్తహీనత ఉన్నవారికి మొక్కజొన్న అద్భుతమైన వరం. మొక్కజొన్నలో ఉండే ఫోలిక్ యాసిడ్ రక్తహీనతను తగ్గించి ఎర్ర రక్తకణాలను వృద్ధి చేస్తుంది.
- మొక్కజొన్న రక్తకణాల్లో కొవ్వుస్థాయులను తగ్గించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తనాళాల్లో ఏర్పడిన అడ్డంకులను తొలగించి రక్తప్రసరణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది తద్వారా గుండెపోటు, పక్షవాతం, బీపీ మొదలైన సమస్యలను అదుపులో ఉంచుతుంది.
- రోజూ మొక్కజొన్న తినేవారికి జుట్టు బలంగా ఉంటుంది. మొక్కజొన్నలో ఉండే విటమిన్ సి జుట్టును పట్టులా మృదువుగా... మెరుపులీనేలా చేస్తుంది.
- మొక్కజొన్న తక్షణశక్తిని ఇచ్చే ఆహారం. దీనిని తినడం వల్ల ఎనర్జీ లెవెల్స్ పెరుగుతాయి. ఇందులో ఖనిజాలు, పోషకాల శాతం కూడా ఎక్కువగానే ఉన్నాయి. మొక్కజొన్న తరచు తినడం వల్ల హైపర్ టెన్షన్ కూడా దూరం అవుతుంది. బీపీ, షుగర్, గుండె జబ్బులు అన్నిటికీ సరైన ఆహారం మొక్కజొన్న.

అందుకే వర్షాకాలంలోనూ, చలికాలంలోనూ సరదాకి తినడానికి మాత్రమే కాదు.. ఆరోగ్యానికి మేలు చేసే మొక్కజొన్నను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంగా ఉండచ్చు.



మీకు తెలుసా?

మిరపకాయలతో కళ్లకు ఎన్నో పోషకాలు లభిస్తాయి. రెడ్ క్యాప్సికమ్‌లో ఎ, సి, ఇ వంటి విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి కంటికి ఎలాంటి ఆక్సిడేటివ్ డ్యామేజ్ జరగకుండా నిరోధిస్తాయి. దీంతోపాటు రెటీనాను ఆరోగ్యవంతంగా ఉంచడంలో సహాయ పడతాయి.



సినిమా

హరనాథ్ మంచి మనసున్న వ్యక్తి

- సూపర్ స్టార్ కృష్ణ



కృష్ణ, పద్మజ

“నేను, హరనాథ్ కలిసి చాలా సినిమాల్లో నటించాం. అతను నిజమైన అందాల నటుడు.. అలాగే మంచి మనసున్న వ్యక్తి. నేను హీరోగా నటించిన ‘మా ఇంటి దేవత’ చిత్రాన్ని కూడా నిర్మించారు హరనాథ్’’ అని సూపర్‌స్టార్ కృష్ణ అన్నారు. బ్లాక్ అండ్ వైట్ సినిమా కాలంలో అప్పటి అమ్మాయిల కలల రాకుమారుడిగా పేరు తెచ్చుకున్నారు హీరో బుద్ధరాజు హరనాథ్ రాజు. 1936లో సెప్టెంబర్ 2న జన్మించిన ఆయన తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, బెంగాలీ భాషల్లో 167 సినిమాల్లో నటించారు. 1989, నవంబర్ 1న మరణించారాయన. కాగా హరనాథ్ జీవిత చరిత్రను ‘అందాల నటుడు’ పేరుతో డా.కంపల్లి రవిచంద్రన్ రచించారు. శుక్రవారం హరనాథ్ జయంతి సందర్భంగా ఈ పుస్తకాన్ని సూపర్ స్టార్ కృష్ణ విడుదల చేశారు. ఈ పుస్తకావిష్కరణలో హరనాథ్ కుమార్తె జి. పద్మజ, అల్లుడు జీవీజీ రాజు (‘తొలి ప్రేమ, గోదావరి’ చిత్రాల నిర్మాత), మనవళ్లు శ్రీనాథ్ రాజు, శ్రీరామ్ రాజు, పుస్తక రచయిత కంపల్లి రవిచంద్రన్ పాల్గొన్నారు.



చిరంజీవి

మాస్ యాక్షన్ స్టార్ట్

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం (ప్రచారంలో ఉన్న టైటిల్ ‘వాల్తేరు వీరయ్య’) షెడ్యూల్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీ హాసన్ హీరోయిన్. హీరో రవితేజ కీలక పాత్ర చేస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. ‘‘మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది. తాజా షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. చిరంజీవిగారిని మునుపెన్నడూ చూడని మాస్, పవర్ ప్యాక్డ్ పాత్రలో చూపించనున్నారు బాబీ. ఈ చిత్రానికి బాబీ కథ, మాటలు రాయగా, కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే ఇచ్చారు. 2023 సంక్రాంతికి చిత్రం విడుదల కానుంది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: ఆర్థర్ ఎ విల్సన్.



రాజమౌళి, ఎన్టీఆర్, నాగార్జున, అలియా భట్, రణబీర్ కపూర్, కరణ్ జోహార్

ఆ సవాల్‌ని చిత్ర పరిశ్రమ స్వీకరించాలి - ఎన్టీఆర్

‘‘ఫిల్మ్ ఇండస్ట్రీ ప్రపంచ వ్యాప్తంగా చాలా ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఎందుకంటే ప్రేక్షకులకు ఇంకా ఏదో కొత్తగా కావాలి. ఆ ఒత్తిడి ఉన్నప్పుడే మనం బాగా చేయగలం. ఆ సవాల్‌ని చిత్ర పరిశ్రమ స్వీకరించాలి. మన ప్రేక్షకుల కోసం మంచి సినిమాలు, గొప్ప చిత్రాలు తీయాలి.. తీస్తారనే నమ్మకం ఉంది’’ అని హీరో ఎన్టీఆర్ అన్నారు. రణబీర్ కపూర్, ఆలియా భట్ జంటగా ఆయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘బ్రహ్మాస్త్ర’. స్టార్ స్టూడియోస్, ధర్మ ప్రొడక్షన్స్, ప్రైమ్ ఫోకస్, స్టార్‌లైట్ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దక్షిణాదిలో ఈ సినిమాని సమర్పిస్తున్నారు. తెలుగులో ‘బ్రహ్మాస్త్రం’ పేరుతో విడుదలవుతోంది. కాగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ముఖ్య అతిథిగా వచ్చిన **ఎన్టీఆర్ మాట్లాడుతూ**– ‘‘ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో చాలా మంది నటులున్నారు. కానీ, కొందరు మాత్రమే నాపై ప్రభావం చూపారు. అమితాబ్ బచ్చన్‌గారు, రణబీర్ కపూర్ ఇంటెన్సిటీ అంటే నాకు చాలా ఇష్టం. వీరి నుంచి ఓ యాక్టర్‌గా నేను స్ఫూర్తి పొందాను. రాజమౌళి, కరణ్ జోహార్‌గార్లు ఇండియన్ సినిమా ఇండస్ట్రీని ఒక్కటిగా మార్చారని నమ్ముతున్నాను. మా నాగార్జున బాబాయ్ నటించిన హిందీ చిత్రం ‘ఖుదాగవా’ అంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే ఓ తెలుగు హీరో హిందీలో డైలాగులు చెబితే ఎలా ఉంటుందో తొలిసారి ఆ సినిమా చూసి తెలుసుకున్నాను’’ అన్నారు.

అక్కినేని నాగార్జున మాట్లాడుతూ– ‘‘రాజమౌళిగారు ‘బ్రహ్మాస్త్రం’ని సమర్పిస్తున్నారంటే సినిమా అలా ఇలా ఉండదు. ఆయాన్ చెప్పిన కథ నచ్చడంతో ఈ చిత్రంలో భాగమయ్యారు. రాజమౌళిగారు ఓ సినిమాని మూడేళ్లు చెక్కుతారు.. అలా ఆయాన్ కూడా ‘బ్రహ్మాస్త్రం’ ని మూడేళ్లు చెక్కారు’’ అన్నారు.

రాజమౌళి మాట్లాడుతూ – ‘‘బ్రహ్మాస్త్రం’ ప్రీ రిలీజ్ వేడుకను గ్రాండ్‌గా చేయాలనుకుని ఏర్పాట్లు చేశాం. ఐదు రోజుల కిందట పోలీసుల నుంచి అనుమతి కూడా తీసుకున్నాం. అయితే శుక్రవారం ఎక్కువగా వినాయక నిమజ్జనాలు ఉండటం వల్ల ప్రీ రిలీజ్ వేడుకకి బందోబస్తు ఇవ్వడం కష్టమని పోలీస్ డిపార్ట్‌మెంట్ వారు చెప్పారు.. దీంతో ప్రీ రిలీజ్ వేడుకని క్యాన్సిల్ చేసి, ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్నాం. ‘బ్రహ్మాస్త్రం’ సినిమాలో భాగం కావాలని ఐదేళ్ల కిందట కరణ్‌గారు చెప్పడంతో ఓకే అన్నాను. ఆయాన్ ముఖర్జీ ఈ కథ చెప్పినప్పుడు నా బాల్య స్మృతులు గుర్తుకొచ్చాయి’’ అన్నారు. ‘‘తారక్ అమేజింగ్ యాక్టర్. ఆయాన్ ముఖర్జీ పదేళ్ల ఆలోచనల రూపం ‘బ్రహ్మాస్త్రం’’ అన్నారు కరణ్ జోహార్.

‘‘నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ఫిల్మ్ ‘బ్రహ్మాస్త్రం’. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది’’ అన్నారు రణబీర్ కపూర్. ‘‘ఈ సినిమా మాకో ఎమోషన్’’ అన్నారు ఆలియా భట్.

నటి మౌనీరాయ్, ధర్మ ప్రొడక్షన్స్ సీఈవో అపూర్వ మెహతా, ప్రైమ్ ఫోకస్ ఫౌండర్ నమిత్ మల్హోత్రా, డిస్నీ స్టార్ ప్రెసిడెంట్ మాధవన్, స్టార్ స్టూడియోస్ హెడ్ విక్రమ్ దుగ్గల్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పరిశ్రమలో కొత్త మార్గదర్శకాలు

- వ్యక్తిగత సిబ్బంది వేతనాలను నటీనటులే చెల్లించాలి
- రోజువారీ వేతన చెల్లింపుల విధానం రద్దు
- ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలో కొత్త సినిమాల స్ట్రీమింగ్
- వీపీఎఫ్ చార్జీలు, కార్మికుల వేతనాలపై కొనసాగుతున్న చర్చలు
- కొత్త మార్గదర్శకాలను విడుదల చేసిన టీఎఫ్‌సీసీ

కరోనా తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి (టీఎఫ్‌సీసీ–తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్) ఇటీవల నాలుగు కమిటీలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. షూటింగ్‌లు నిలిపివేసి, సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం సెప్టెంబర్ 1 నుంచి చిత్రీకరణ పునః ప్రారంభించుకోవచ్చని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ఆధ్వర్యంలో నిర్మాత ‘దిల్’ రాజు పేర్కొన్నారు. షూటింగ్‌లు కూడా ఆరంభం అయ్యాయి. తాజాగా పారితోషికం, ఓటీటీ, థియేట్రికల్ అండ్ ఎగ్జిబిషన్, ఫెడరేషన్‌కు సంబంధించిన కొత్త మార్గదర్శకాలను ప్రకటిస్తూ, టీఎఫ్‌సీసీ ఓ లేఖను విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలు సెప్టెంబరు 10 నుంచి అమలులోకి వస్తాయన్నట్లుగా టీఎఫ్‌సీసీ పేర్కొంది. కాగా ఇండస్ట్రీకి చెందిన ప్రతినిధులతో విస్తృత స్థాయి సమావేశాలు జరిపాకే ఈ కొత్త మార్గదర్శకాలను నిర్ణయించినట్లుగా టీఎఫ్‌సీసీ ఆ లేఖలో స్పష్టం చేసింది. ఆ లేఖలో పేర్కొన్న మార్గదర్శకాలు ఈ విధంగా....

ప్రొడక్షన్‌కు సంబంధించిన గైడ్‌లైన్స్

- నటీనటులకు, సాంకేతిక నిపుణులకు రోజువారీ వేతనాలు ఉండవు.
- నటీనటులు వారి పారితోషికంలోంచే వ్యక్తిగత సిబ్బంది వేతనాలు చెల్లించుకోవాలి. అలాగే స్థానిక రవాణా, బస, స్పెషల్ ఫుడ్ వంటివి నటీనటులే సమకూర్చుకోవాలి. ఒప్పందాల ప్రకారమే నిర్మాతలు ఆర్టిస్టులకు పారితోషికాలను చెల్లిస్తారు. నటీనటులతో పాటు ప్రధాన సాంకేతిక నిపుణులకూ ఇవే నియమాలు వర్తిస్తాయి.
- సినిమా షూటింగ్ ప్రారంభించడానికి ముందే పారితోషికాలకు సంబంధించిన ఒప్పందాలు పూర్తవుతాయి. వీటి ప్రకారమే చెల్లింపులు ఉంటాయి.
- కాల్‌షీట్స్ టైమింగ్, సెట్స్‌లో క్రమశిక్షణకు సంబంధించిన నియమాలు కఠినంగా అమలు చేయబడతాయి. నిర్మాతల సౌకర్యార్థం సినిమాకు సంబంధించిన షూటింగ్ రిపోర్ట్‌ను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి.

ఓటీటీ : • ఓ సినిమా ఏ టీవీ చానెల్‌లో ప్రసారం కానుంది? ఏ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది? అనే అంశాలను టైటిల్స్‌లో కానీ, సినిమా ప్రదర్శనల్లో కానీ, ప్రమోషన్స్‌లో కానీ బహిర్గతం చేయకూడదు.
- థియేటర్స్‌లో రిలీజైన ఓ సినిమా ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలో స్ట్రీమింగ్ కావాలి.

థియేట్రికల్ అండ్ ఎగ్జిబిషన్

- వీపీఎఫ్ (వర్చ్యువల్ ప్రింట్ ఫీ)కి సంబంధించిన చార్జీల విషయమై డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌తో నేడు జరగాల్సిన సమావేశం 6కి వాయిదా పడింది.
- తెలంగాణలో మల్టీప్లెక్స్‌లకు ఎంత పర్సంటేజ్ ఇస్తున్నారో ఇకపై ఆంధ్రప్రదేశ్‌లోనూ అంతే ఇస్తారు.

సినీ కార్మికుల సంఘం: • కార్మికులకు సంబంధించిన సమస్యలపై తుది చర్చలు జరుగుతున్నాయి. రేట్ కార్డ్స్ ఫైనలైజ్ అయ్యాక వీటి వివరాలు అన్ని నిర్మాణ సంస్థలకు పంపించడం జరుగుతుంది.

ప్రొడ్యూసర్స్ గిల్డ్, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి తీసుకున్న నిర్ణయాల విషయమై ‘మా’ (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణుతో చర్చలు జరిపారని భోగట్టా. కొత్త మార్గదర్శకాలను ‘మా’కి లేఖ రూపంలో పంపారని సమాచారం. నటీనటుల వ్యక్తిగత సిబ్బంది పారితోషికం, సొంత రవాణా ఖర్చులు వంటివాటిపై ‘మా’ సుముఖత వ్యక్తపరిచిందట. కొత్త మార్గదర్శకాలను నటీనటులందరికీ ‘మా’ త్వరలో అధికారికంగా పంపనుందని సమాచారం.

- కొత్త మార్గదర్శకాల్లో రోజువారీ వేతనాల గురించిన అంశం ఒకటి. మామూలుగా క్యారెక్టర్ ఆర్టిస్టుల్లో పెద్ద రేంజ్ ఉన్నవారు రోజువారీ వేతనాలు తీసుకుంటారు. అయితే ఇకపై వారికి కూడా సినిమాకి ఇంత అని పారితోషికం నిర్ణయించాలనుకుంటున్నారు. మరి.. రోజువారీ వేతనాలు తీసుకునేది ఎవరూ అంటే.. అట్మాస్ఫియర్ కోసం సీన్లో నిలబడేవాళ్లు, అటూ ఇటూ కదులుతూ కనిపించేవాళ్లు, డైలాగ్స్ చెప్పే జూనియర్ ఆర్టిస్టులు .. ఇలా చిన్న స్థాయి కళాకారులు రోజువారీ వేతనాల కిందకు వస్తారు.

అప్పుడు అందరం బాగుంటాం

- అలీ



ముస్కాన్, అలీ, కృష్ణ

కృష్ణ, ముస్కాన్ రాజేందర్ జంటగా అశ్విన్ కామరాజు కొప్పల దర్శకత్వంలో సి. యశోదమ్మ, టి. చేతన్ నిర్మించిన చిత్రం ‘నేచర్’. ఈ సినిమాలోని ‘నిన్నే చూడందే..’ అనే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఈ పాటను రిలీజ్ చేసిన అలీ మాట్లాడుతూ – ‘‘నాకు ఇళయరాజాగారి పాటలంటే ఇష్టం. ఈ పాట ఆయన పాటలను గుర్తు చేసింది. యం.ఎల్. రాజా మంచి మ్యూజిక్ ఇచ్చారు. ‘నేచర్’ టైటిల్ బాగుంది. ప్రకృతి బాగుంటే మనందరం బాగుంటాం’’ అన్నారు. ‘‘ప్రకృతిని ఇష్టపడే ఓ కుర్రాడు ప్రేమలో పడ్డాక ఎన్ని కష్టాలు పడ్డాడు? ప్రేమించిన అమ్మాయిని ఎలా దక్కించుకున్నాడు? అన్నది ఈ సినిమా కథ’’ అన్నారు అశ్విన్ కామరాజు. ‘‘ఈ సినిమాకు పని చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా’’ అన్నారు ఎమ్ఎల్ రాజా. ‘‘సుధాకర్, రవి టీచర్స్. ఈ సినిమాకి ఇద్దరూ చక్కటి కథను రెడీ చేశారు’’ అన్నారు గౌతమ్ రాజు.

రిలీజ్ తర్వాత పాన్ ఇండియా అవుతుంది - విశ్వక్ సేన్



కరాటే రాజు, జుజి, విశ్వక్ సేన్

‘‘నటన, దర్శకత్వం నాకు రెండు కళ్లు. హీరోగా సక్సెస్ అయి, ఆ తర్వాత ఓ 30 ఏళ్లకు డైరెక్షన్ చేయాలనుకున్నాను. కానీ సరైన అవకాశాలు దొరక్క నా తొలి సినిమా ‘ఫలక్‌నుమా దాస్’కి నా బ్యానర్‌లో నేనే దర్శకత్వం వహించాల్సి వచ్చింది. దర్శకుడిగా నాకు పూర్తి సంతృప్తి దక్కలేదు. ఎందుకంటే ఇది రీమేక్ చిత్రం. ప్రస్తుతం నేను చేస్తున్న దాస్‌కా ‘దమ్కీ’ చిత్రం నాలోని దర్శకత్వ ప్రతిభను చూపిస్తుందనే నమ్ముతున్నాను’’ అని విశ్వక్ సేన్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘దమ్కీ’. ఈ చిత్రంలో నివేదా పేతురాజ్ హీరోయిన్. వన్మయి క్రియేషన్స్, విశ్వక్ సేన్ సినిమాస్ పతాకాలపై కరాటే రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం హైదరాబాద్‌లో వేసిన సెట్‌లో యాక్షన్ సీన్స్ తీస్తున్నారు. ఇంకా ఓ సాంగ్ బ్యాలెన్స్ ఉంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను దీపావళికి రిలీజ్ చేయాలనుకుంటున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. శుక్రవారం జరిగిన ఈ సినిమా విలేకరుల సమావేశంలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ‘‘ఈ సినిమాలో హోటల్‌లో వర్క్ చేసే కృష్ణదాస్ అనే పాత్రలో కనిపిస్తాను. యాక్షన్ కొత్తగా ఉంటుంది. బల్గేరియన్ ఫైట్ మాస్టర్స్ టోడర్ లాజరోవ్–జుజితో అద్భుతమైన క్లయిమాక్స్ సీన్స్‌ను ప్లాన్ చేశాం. ఈ కథలో కలర్స్ మారుతుంటాయి. ఆడియన్స్ నవ్వుతుంటారు.. అలాగే చెమటలు పడతాయి. కథలో అంత బలం ఉంది. అవుట్‌పుట్‌పై నమ్మకం ఉంది. అందుకే ఇతర భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేయనున్నాం. రిలీజ్ తర్వాత పాన్ ఇండియా సినిమా అవుతుంది’’ అన్నారు. ‘‘ఈ చిత్రంలో నవరసాలు ఉంటాయి’’ అన్నారు కరాటే రాజు.

సాక్షి బిజినెస్
శనివారం
3-9-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	37	58,803
నిఫ్టీ ▽	3	17,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,643	▽	140
డోజోన్స్	31,486	▽	170
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,281	▲	133
డాక్స్	13,050	▲	420
షాంఘై	3,186	▲	1
నికాయ్	27,651	▽	11

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


'సెబు' ప్రాజెక్టును విక్రయిస్తున్న జీఎంఆర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫిలిప్పైన్స్‌లోని సెబు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో తనకున్న 40 శాతం వాటాను జీఎంఆర్ గ్రూప్ విక్రయిస్తోంది. అమ్మకం కారణంగా కంపెనీ రూ.1,330 కోట్లు అందుకోవడంతోపాటు రాబోయే కాలంలో నాలుగేళ్లకు పైగా ఆదాయం స్వీకరించనుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇంటర్నేషనల్ బీవీ, అబూటిజ్ ఇన్‌ఫ్రా క్యాపిటల్ మధ్య ఈ మేరకు ఒప్పందం కుదిరింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ రుణ భారం తగ్గించడం, అధిక రాబడి కోసం ఆస్తులను మళ్లించడంపై దృష్టి సారించడంలో భాగంగా ఈ వాటాను ఉపసంహరించుకుంటున్నట్టు కంపెనీ శుక్రవారం ప్రకటించింది. 2026 డిసెంబర్ వరకు సాంకేతిక సేవలను జీఎంఆర్ అందించనుంది. సెబు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టును 2014లో జీఎంఆర్ దక్కించుకుంది.

ప్రస్తుత డిజిటల్ రుణాలకూ కొత్త నిబంధనలు

- నవంబర్ 30 నుంచి అమలు చేయాలి
- బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ ఆదేశం



ముంబై: డిజిటల్ రుణాలకు సంబంధించి ఇటీవల ప్రకటించిన కొత్త నిబంధనలను, ఇప్పటికే పంపిణీ చేసిన డిజిటల్ రుణాలకు సైతం వర్తింపజేయాలని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలను ఆర్‌బీఐ ఆదేశించింది. ఇందుకు నవంబర్ 30 వరకు గడువు ఇచ్చింది. అసాధారణ స్థాయిలో వడ్డీ రేట్లు, అనైతిక రుణ వసూళ్లను కట్టడి చేస్తూ నూతన నిబంధనలను ఆర్‌బీఐ గత నెలలో ప్రకటించింది. డిజిటల్ రుణాలకు మధ్యవర్తులుగా వ్యవహరించే ఫిన్‌టెక్ సంస్థలు కస్టమర్ల నుంచి చార్జీ వసూలు చేయకూడదని కూడా ఆదేశించింది. బ్యాంకులే ఈ చార్జీలను చెల్లించాలని నిర్దేశించింది. మొబైల్ యాప్‌లు, డిజిటల్ మాధ్యమాల ద్వారా మంజూరు చేసే రుణాలకు ఈ నూతన నిబంధనలు వర్తిస్తాయి. ఇప్పటికే తీసుకున్న డిజిటల్ రుణాలు, తాజాగా తీసుకునే వాటికి కొత్త నిబంధనలు అమలుకానున్నాయి. ప్రస్తుత రుణాలనూ కొత్త నిబంధనల పరిధిలోకి తీసుకొచ్చేందుకు తగిన సమయం ఇస్తున్నట్టు ఆర్‌బీఐ పేర్కొంది. కొత్త నిబంధనల కింద రుణాన్ని బ్యాంకు నేరుగా రుణ గ్రహీత ఖాతాకు జమ చేయాల్సి ఉంటుంది. లెండింగ్ సర్వీస్ ప్రొవైడర్ లేదా డిజిటల్ లెండింగ్ యాప్ (డీఎల్‌ఏ) ద్వారా రుణ దరఖాస్తు వచ్చినప్పటికీ, ఆ రుణాన్ని మంజూరు చేసే సంస్థ, నేరుగా రుణ గ్రహీతకు అందించాలి.

ఒలెక్ట్రాకు 100 ఈ-బస్‌ల ఆర్డర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ తాజాగా 100 ఈ-బస్‌లకు ఆర్డర్ అందుకుంది. అసోం రోడ్డు రవాణా సంస్థ నుంచి ఈ మేరకు లెటర్ ఆఫ్ అవార్డ్ స్వీకరించింది. డీల్ విలువ రూ.151 కోట్లు అని సంస్థ సీఎండీ కె.వి. ప్రదీప్ ఈ సందర్భంగా తెలిపారు. కంపెనీ తయారీ ఎలక్ట్రిక్ బస్‌లు ఇప్పటికే దేశవ్యాప్తంగా 5 కోట్లకుపైగా కిలోమీటర్లు ప్రయాణించాయని గుర్తు చేశారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి కంపెనీకి ఇదే తొలి ఆర్డర్. తొమ్మిది నెలల్లో ఈ బస్సులను డెలివరీ చేయనుంది. ఒలెక్ట్రాను మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రమోట్ చేస్తోంది. కాగా, గ్రీన్‌టెక్ సెక్యూరిటీల జారీ ద్వారా రూ.800 కోట్ల వరకు నిధులను సమీకరించడానికి బోర్డ్ ఆమోదం తెలిపిందని ఒలెక్ట్రా పేర్కొంది.



సెన్సెక్స్ ప్లస్, నిఫ్టీ మైనస్

పరిమిత శ్రేణిలో ట్రేడైన సూచీలు



ముంబై: లాభ, నష్టాల మధ్య పరిమిత శ్రేణిలో ట్రేడైన స్టాక్ సూచీలు శుక్రవారం చివరికి మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 37 పాయింట్లు పెరిగి 58,803 వద్ద స్థిరపడింది. నిఫ్టీ మూడు పాయింట్లు నష్టపోయి 17,539 వద్ద నిలిచింది. ఆర్థిక, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, ప్రైవేట్ రంగ బ్యాంక్స్ షేర్లు లాభపడ్డాయి. ఆటో, ఐటీ, ఫార్మా, ఇంధన ప్రభుత్వ బ్యాంక్స్ షేర్లు నష్టపోయాయి. ఉదయం సెన్సెక్స్ 202 పాయింట్లు బలపడి 58,969 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 58,559 వద్ద కనిష్టాన్ని, 59,109 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 55 పాయింట్లు పెరిగి 17,598 ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 17,476 - 17,644 శ్రేణిలో కదలాడింది. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపును నిర్ణయించే యూఎస్ జాబ్ డేటా విడుదల(నేటి రాత్రి)కు ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడ్ అవుతున్నాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 31 పైసలు క్షీణించి 79.87 స్థిరపడింది. ట్రేడింగ్ నాలుగురోజులే ఈ జరిగిన ఈ వారంలో సెన్సెక్స్ 31 పాయింట్లు, నిఫ్టీ 19 పాయింట్లు నష్టపోయాయి.

''కేంద్ర బ్యాంకుల వడ్డీరేట్ల పెంపు అంచనాలు, అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి ఆందోళనలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, రూపాయి క్షీణత అంశాలు ఇన్వెస్టర్లలో రిస్క్ తీసుకొనే సామర్థ్యాన్ని తగ్గించాయి. డాలర్ ఇండెక్స్ బలోపేతం, యూఎస్ బాండ్లపై రాబడులు పెరిగిన నేపథ్యంలో మార్కెట్లు స్వల్పకాలం ఒడిదుడుకులకు లోనవ్వచ్చు'' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ రిటైల్ రీసెర్చ్ హెచ్ సిద్ధార్థ ఖేమా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఎన్‌డీటీవీ షేరు ఏడో ట్రేడింగ్ సెషన్‌లోనూ అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్‌ఈలో ఐదుశాతం లాభపడి రూ.515 వద్ద స్థిరపడింది.
- నిఫ్టీ 50 ఇండెక్స్‌లో చోటు దక్కించుకోవడంతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 4% లాభపడి రూ.3,352 వద్ద స్థిరపడింది.

స్టార్‌బక్స్ సీఈవో మనోడే..!

- లక్ష్మణ్ నరసింహన్ నియామకం
- అక్టోబర్ 1న పగ్గాలు
- 2023 ఏప్రిల్ నుంచి పూర్తి స్థాయి బాధ్యతలు



న్యూయార్క్: మరో బహుళజాతి సంస్థ పగ్గాలు భారత సంతతి వ్యక్తి చేతికి రానున్నాయి. స్టార్‌బక్స్ తదుపరి సీఈవోగా లక్ష్మణ్ నరసింహన్ (55) ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం రెకిట్ బెంకిసర్ సీఈవో పనిచేస్తున్నారు. ఈ బాధ్యతల నుంచి సెప్టెంబర్ 30న తప్పుకుంటారు. అక్టోబర్ 1న స్టార్‌బక్స్ ఇన్‌కమింగ్ సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత సీఈవో అయిన హోవార్డ్ షుల్ట్జ్‌తో కలసి పనిచేస్తారు. 2023 ఏప్రిల్ 1 నుంచి పూర్తి స్థాయి సీఈవోగా, స్టార్ బక్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో భాగం అవుతారని కంపెనీ ప్రకటించింది. అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు ఎన్నింటికో ప్రస్తుతం భారత సంతతి వ్యక్తులు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సత్యానాదెళ్ల, ఆల్ఫాబెట్ సుందర్ పిచాయ్, ట్విట్టర్ సీఈవో పరాగ్ అగర్వాల్, అడోబ్ శంతను నారాయణన్, డెలాయిట్ పునీత్ రెంజెన్ తదితరుల సరసన నరసింహన్ కూడా చేరనున్నారు. ప్రస్తుతం లండన్ కేంద్రంగా పనిచేస్తున్న నరసింహన్ యూఎస్‌కు మారనున్నారు.

విద్యాభ్యాసం..

కాలేజీ ఆఫ్ ఇఫ్ ఇంజనీరింగ్, యూనివర్సిటీ ఆఫ్ పుణేలో మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన లక్ష్మణ్ నరసింహన్ ఉన్నత విద్యాభ్యాసం అంతా విదేశాల్లో సాగింది. జర్మనీలో మాస్టర్స్ డిగ్రీ, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని లాడర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్నేషనల్ స్టడీస్, వార్టన్ స్కూల్ ఆఫ్ ది యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా నుంచి ఫైనాన్స్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. ఐకానిక్ కంపెనీలో చేరుతుండడం పట్ల నరసింహన్ సంతోషం వ్యక్తం చేశారు. ''హోవార్డ్, స్టార్ బక్స్ బోర్డు, కంపెనీ లీడర్‌షిప్ టీమ్‌తో సన్నిహితంగా కలసి పనిచేసేందుకు సుముఖంగా ఉన్నాను. స్టార్‌బక్స్ భాగస్వాముల ఉమ్మడి సహకారంతో కంపెనీని తదుపరి వృద్ధి దశలోకి తీసుకెళతాం'' అని ప్రకటించారు. నరసింహన్‌కు బ్రాండ్ల అభివృద్ధిలో, కంపెనీల నిర్మాణంలో మంచి ట్రాక్ రికార్డు ఉన్నట్టు స్టార్‌బక్స్ ప్రకటించింది. వినియోగదారు కేంద్రంగా, డిజిటల్ ఆవిష్కరణలతో భవిష్యత్తు ఆకాంక్షలను నెరవేరుస్తారని ఆశిస్తున్నట్టు పేర్కొంది. నరసింహన్ లోగడ పెప్సికో, మెకిన్సే అండ్ కంపెనీలోనూ పనిచేశారు. స్టార్‌బక్స్ 80కు పైగా దేశాల్లో కాఫీ స్టోర్లను నిర్వహిస్తోంది. భారత్‌లో టాటాలతో జాయింట్ వెంచర్ కింద కార్యకలాపాలు కొనసాగిస్తోంది.

బహుళజాతి కంపెనీల చీఫ్‌లుగా భారతీయులు...

పేరు	కంపెనీ
సుందర్ పిచాయ్	ఆల్ఫాబెట్, గూగుల్
సత్య నాదెళ్ల	మైక్రోసాఫ్ట్
పరాగ్ అగర్వాల్	ట్విట్టర్
లీనా నాయర్	చానెల్
అరవింద్ కృష్ణ	ఐబీఎం గ్రూపు
శంతను నారాయణన్	అడోబ్ గ్రూపు
అజయ్‌పాల్ సింగ్ బంగా	మాస్టర్‌కార్డ్
జయశ్రీ ఉల్లాల్	అరిస్టా నెట్‌వర్క్స్
రాజీవ్ సూరి	నోకియా ఐఎన్‌సీ
జార్జ్ కురియన్	నెట్‌యాప్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-9-2022	
విశాఖ	500-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	465-00
విజయవాడ	465-00
రిటైల్ ధర (డజను)	66.00
2-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.70

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	50,584	▲	175
బంగారం (99.5 స్వచ్ఛత)	50,381	▲	174
వెండి (కిలో)	52,472	▲	450

తొమ్మిదో వసంతంలోకి 'బి న్యూ మొబైల్స్'



హైదరాబాద్: ప్రముఖ మొబైల్స్ విక్రయ సంస్థ బి న్యూ మొబైల్స్ ఎనిమిది ఏళ్లు పూర్తి చేసుకుని, తొమ్మిదో వసంతంలోకి అడుగుపెట్టింది. వార్షికోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన మొబైల్స్‌పై 50% వరకు స్టోర్స్‌లో, ఆన్‌లైన్‌లోనూ డిస్కౌంట్ లభిస్తుంది. అలాగే ఎంపిక చేసిన టీవీలపై రూ.7వేల వరకు, లాప్‌ట్యాబ్‌లపై రూ.5వేల వరకు క్యాష్ బ్యాక్‌ను అందిస్తుంది. ప్రారంభ ధర రూ.1,599కే స్మార్ట్ వాచ్‌లను పొందవచ్చు. ఎస్‌బీఐ కార్డు ద్వారా కొనుగోలుపై 7.5% వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. ప్రజల నిత్య జీవనంలో కీలకమైన సెల్‌ఫోన్లతో పాటు అన్ని రకాల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను సామాన్యులకు అందజేయడంలో బి న్యూ ముందంజలో ఉంటుందని సంస్థ సీఎండీ యరగుంట్ల బాలాజీ చౌదరి తెలిపారు. ''తెలుగు రాష్ట్రాల్లో 150పైకి షో రూమ్‌లను కలిగి ఉన్నాము. త్వరలోనే మరిన్ని షోరూంలను అందుబాటులోకి తీసుకొస్తాము. ముఖ్యంగా దిగువ మధ్య తరగతి ప్రజలకు సెల్‌ఫోన్లను తక్కువ ధరలకే అందించేందుకు గ్రామీణ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టిని సారించాము'' అని బాలాజీ పేర్కొన్నారు.

ఎవరెస్ట్ బ్యాంక్ కో-బ్రాండెడ్ వీసా కాంటాక్ట్‌లెస్ క్రెడిట్ కార్డులు

పతంజలి ఆయుర్వేద్ నేపాల్ భాగస్వామ్యంలో



హైదరాబాద్: పతంజలి ఆయుర్వేద్ నేపాల్ సంయుక్త భాగస్వామ్యంతో ఎవరెస్ట్ బ్యాంక్ కో-బ్రాండెడ్ వీసా కాంటాక్ట్‌లెస్ క్రెడిట్ కార్డ్స్‌ను ఆవిష్కరించింది. మొదటి మూడునెలల పాటు ఇష్యూయెన్స్ ఫీజుపై 50% డిస్కౌంట్ పొందవచ్చు. కొనుగోళ్లపై భారీ క్యాష్ బ్యాక్ ఆఫర్స్ అందిస్తుంది. ఆటో చెల్లింపుతో పాటు 14-45 రోజుల వడ్డీలేని కొనుగోళ్ల సదుపాయాన్ని కల్పిస్తుంది. కార్డుపై క్రెడిట్ లిమిట్ వరకు ప్రమాద మరణ బీమాను అందిస్తుంది.

పోరాడి ఓడిన ప్రణయ్

జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ పోరాటం ముగిసింది. టోక్యోలో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ ప్రణయ్ 17-21, 21-15, 20-22తో ఆరో ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కీలకదశలో ప్రణయ్ తడబడి మూల్యం చెల్లించుకున్నాడు. ముఖాముఖిగా ఇప్పటివరకు చౌ తియెన్ చెన్, ప్రణయ్ ఎనిమిదిసార్లు తలపడగా... ఐదుసార్లు చౌ తియెన్ చెన్, మూడుసార్లు ప్రణయ్ గెలిచారు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన ప్రణయ్‌కు 4,125 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 3 లక్షల 28 వేలు) తోపాటు 6,050 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



సూపర్-4కు పాక్

హాంకాంగ్ 38కే ఆలౌట్



షార్జా: ఆసియా కప్ టి20 టోర్నీలో పాకిస్తాన్ భారీ విజయంతో 'సూపర్-4' దశకు అర్హత సాధించింది. గ్రూప్ 'ఎ' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పాక్ 155 పరుగులతో హాంకాంగ్‌ను చిత్తు చేసింది. మొదట పాకిస్తాన్ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఓపెనర్ రిజ్వాన్ (78; 6 ఫోర్లు, 1 సిక్స్), ఫఖర్ జమన్ (53; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఖుష్దిల్ షా (35 నాటౌట్; 5 సిక్సర్లు) చెలరేగారు. తర్వాత హాంకాంగ్ 10.4 ఓవర్లలో 38 పరుగులకే కుప్పకూలింది. ఓపెనింగ్ నుంచి 11వ వరుస బ్యాటర్ దాకా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఇన్నింగ్స్‌లో ఎక్స్‌ట్రాలే (10) టాప్ స్కోరు అయ్యాయి. షాదాబ్ 8 పరుగులిచ్చి 4 వికెట్లు, నవాజ్ 5 పరుగులిచ్చి 3 వికెట్లు తీశారు. భారత్, శ్రీలంక, పాక్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో నేటి నుంచి 'సూపర్-4' దశ మ్యాచ్‌లు జరుగుతాయి.

సూపర్-4 షెడ్యూల్

సెప్టెంబర్ 3: శ్రీలంక x అఫ్గానిస్తాన్
సెప్టెంబర్ 4: భారత్ x పాక్
సెప్టెంబర్ 6: భారత్ x శ్రీలంక
సెప్టెంబర్ 7: పాక్ x అఫ్గానిస్తాన్
సెప్టెంబర్ 8: భారత్ x అఫ్గానిస్తాన్
సెప్టెంబర్ 9: శ్రీలంక x పాక్
సెప్టెంబర్ 11: ఫైనల్


గాయంతో జడేజా అవుట్



దుబాయ్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో భారత జట్టుకు కీలక ఆటగాడు దూరమయ్యాడు. మోకాలి గాయంతో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తప్పుకున్నాడని, టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు అతను అందుబాటులో ఉండటం లేదని టీమ్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో 35 కీలక పరుగులు చేసిన జడేజా, హాంకాంగ్‌తో మ్యాచ్‌లో 4 ఓవర్లలో 15 పరుగులే ఇచ్చాడు. జడేజా స్థానంలో మరో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇటీవల జింబాబ్వేతో వన్డేలు ఆడిన అక్షర్, అంతకు ముందు వెస్టిండీస్‌తో చివరిసారిగా టి20ల్లో బరిలోకి దిగాడు.

నాదల్ ముందంజ

- మూడో రౌండ్‌లోకి స్పెయిన్ స్టార్
- డబుల్స్‌లో విలియమ్స్ సిస్టర్స్ ఓటమి
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



న్యూయార్క్: కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచే లక్ష్యంతో బరిలోకి దిగిన స్పెయిన్ దిగ్గజం, రెండో సీడ్ రాఫెల్ నాదల్‌కు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ కొంత ప్రతిఘటన ఎదురైంది. తొలి రౌండ్‌లాగే తొలి సెట్‌ను కోల్పోయిన అతను ఆ తర్వాత తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో ముందంజ వేశాడు. 'నా కెరీర్‌లో అతి చెత్త ఆరంభాల్లో ఇది ఒకటి'... యూఎస్ ఓపెన్ రెండో రౌండ్‌లో ఫాబియో ఫాగ్నిని (ఇటలీ)పై విజయం తర్వాత స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ వ్యాఖ్య ఇది. తొలి సెట్‌లో, ఆ తర్వాత రెండో సెట్‌లో సగం వరకు కూడా నాదల్ ఆట చూస్తే అలాగే అనిపించింది. అయితే అసలు సమయంలో తేరుకున్న అతను ఆ తర్వాత దూసుకుపోయాడు. 2 గంటల 43 నిమిషాల పాటు సాగిన పోరులో చివరకు విజేతగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో నాదల్ 2-6, 6-4, 6-2, 6-1తో ఫాగ్నినిపై గెలుపొందాడు. తొలి సెట్‌ను కోల్పోవడంతో పాటు రెండో సెట్‌లో కూడా ఒక దశలో నాదల్ 2-4తో వెనుకబడ్డాడు. అయితే ఏడో గేమ్‌లో సర్వీస్‌ను నిలబెట్టుకోవడంతో పాటు ప్రత్యర్థి సర్వీస్‌ను వరుసగా రెండుసార్లు బ్రేక్ చేసి నాదల్ సెట్‌ను గెలుచుకున్నాడు. ఆ తర్వాత తిరుగులేని ఆటతో అతను ఫాగ్నినికి చెక్ పెట్టాడు. మూడో రౌండ్‌లో నాదల్ రిచర్డ్ గాస్కే (ఫ్రాన్స్)తో తలపడతాడు. మరో మ్యాచ్‌లో మూడో సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) 6-2, 6-1, 7-5తో ఫెడెరికో (అర్జెంటీనా)ను ఓడించి ముందంజ వేశాడు.

తన రాకెట్‌తో ముక్కుకు...

ఫాగ్నినితో మ్యాచ్ సందర్భంగా నాదల్‌కు అనూహ్య రీతిలో స్వల్పంగా గాయమైంది. నాలుగో సెట్‌లో కుడి పక్కకు జరిగి వైడ్ బ్యాక్‌హ్యాండ్ ఆడే క్రమంలో రాకెట్‌పై నాదల్ పట్టు కోల్పోయాడు. వేగంగా కోర్టును తాకిన రాకెట్ అంతే వేగంగా వెనక్కి వచ్చి అతని ముక్కుకు బలంగా తాకింది. రక్తస్రావం కావడంతో ఆటను నిలిపేసి వెంటనే అతను వైద్య చికిత్స తీసుకున్నాడు. ముక్కుపై బ్యాండేజీతో ఆ తర్వాత ఆటను కొనసాగించి అతను విజేతగా నిలిచాడు. తాను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానని, ముక్కు పగిలినట్లు భావించానన్న నాదల్... అంత చెత్తగా ఆడుతున్నందుకు తనకు లభించిన చిన్నపాటి శిక్ష అంటూ సరదాగా వ్యాఖ్యానించాడు.

విలియమ్స్ సిస్టర్స్‌కు నిరాశ...



సొంత ప్రేక్షకుల ముందు చివరిసారిగా ఆడేందుకు నాలుగున్నరేళ్ల తర్వాత డబుల్స్‌లో జోడీ కట్టిన 'విలియమ్స్ సిస్టర్స్' మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు. 'వైల్డ్‌కార్డ్'తో ఈ టోర్నీలో అడుగు పెట్టిన సెరెనా-వీనస్ ద్వయం 6-7 (5/7), 4-6 స్కోరుతో లూసీ హర్డెకా-లిండా నొస్కోవా (చెక్ రిపబ్లిక్) జోడీ చేతిలో ఓటమి పాలైంది. అయితే ఆడినంత సేపు అభిమానులంతా 'విలియమ్స్' నినాదాలతో ఉత్సాహపరిచారు. తొలి సెట్ టైబ్రేకర్‌లో 19 స్ట్రోక్‌ల పాయింట్‌ను వీరిద్దరు గెలుచుకున్నప్పుడైతే దాదాపు 24 వేల సామర్థ్యం గల స్టేడియం మొత్తం హోరెత్తింది. సెరెనా-వీనస్ కలిసి మహిళల డబుల్స్‌లో 14 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచారు.

షేక్‌హ్యాండ్‌కు నిరాకరణ...



మహిళల సింగిల్స్‌లో అజరెంకా (బెలారస్) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. రెండో రౌండ్‌లో ఆమె 6-2, 6-3తో మార్టా కొస్టయుక్ (ఉక్రెయిన్)ను ఓడించింది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత సహజంగా ఇద్దరు ప్లేయర్లు చేతులు కలిపే సంప్రదాయానికి భిన్నంగా కొస్టయుక్ దూరం జరిగింది. తన దేశంపై రష్యా దాడికి నిరసనగా (రష్యాకు బెలారస్ సహకరిస్తోంది) ఆమె ఈ పని చేసింది. చివరకు ఒకరి రాకెట్‌ను మరొకరు తాకించి ఇద్దరూ నిష్క్రమించారు.

ప్రిక్వార్టర్స్‌లో జబర్

ఐదో సీడ్ అన్స్ జబర్ (ట్యూనిషియా) తొలిసారి యూఎస్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మూడో రౌండ్‌లో జబర్ 4-6, 6-4, 6-3తో షెల్బీ రోజర్స్ (అమెరికా)పై గెలిచింది. గతంలో ఆరుసార్లు యూఎస్ ఓపెన్‌లో ఆడిన జబర్ మూడో రౌండ్ దాటి ముందుకెళ్లలేదు.

కిరియోస్‌కు భారీ జరిమానా



ప్రతీ టోర్నీలో క్రమశిక్షణను ఉల్లంఘించి భారీగా జరిమానాలు చెల్లించడంలో 'డాక్టరేట్ పొందిన' నిక్ కిరియోస్ (ఆస్ట్రేలియా) మళ్లీ అదే తప్పు చేశాడు. గ్యాలరీలో కూర్చున్న అభిమానులను ఉద్దేశిస్తూ అసభ్యకర భాష వాడిన అతను క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించాడు. దాంతో నిర్వాహకులు కిరియోస్‌కు 7,500 డాలర్లు (సుమారు రూ. 6 లక్షలు) జరిమానా విధించారు.

బోపన్న ఇంటిదారి

భారత ఆటగాడు రోహన్ బోపన్నకు పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా నిరాశే ఎదురైంది. డబుల్స్‌లో బోపన్న-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) 6-7 (2/7), 2-6 స్కోరుతో సొనెగో-వవసోరి (ఇటలీ) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోపన్న-జువాన్ యాంగ్ (చైనా) జోడీ 5-7, 5-7తో డబ్రోస్కీ (కెనడా)-పర్సెల్ (ఆస్ట్రేలియా) ద్వయం చేతిలో ఓడిపోయారు. పురుషుల డబుల్స్‌లో మరో భారత ఆటగాడు రామ్‌కుమార్-కాసిక్ (సెర్బియా) 4-6, 4-6తో బొలెలి-ఫాగ్నిని (ఇటలీ) చేతిలో పరాజయం పొందారు.

తొలిసారి అధ్యక్షుడిగా ఆటగాడు

- భారత మాజీ గోల్‌కీపర్ కల్యాణ్ చౌబేకు ఏఐఎఫ్‌ఎఫ్ పగ్గాలు
- అధ్యక్ష ఎన్నికల్లో 33-1 ఓట్ల తేడాతో బైచుంగ్ భూటియాపై విజయం



న్యూఢిల్లీ: మైదానంలో ఆటగాళ్లు గోల్ కోసం శ్రమిస్తుంటే... కేంద్ర మంత్రి స్థాయి వారు ఫుట్‌బాల్ సంఘంలో ఏళ్ల తరబడి తిష్టవేసి రాజకీయాలు చేశారు. ఇలా ఆటకు సంబంధంలేని వారే 85 ఏళ్ల పాటు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్)ను ఏలారు. ఏనాడూ మాజీ కెప్టెన్ కానీ, దిగ్గజ ప్లేయర్ కానీ సమాఖ్యలో అధ్యక్ష స్థానంలో లేనే లేరు. దీంతో రాజకీయాలతో మసకబారిన ఏఐఎఫ్‌ఎఫ్ చివరకు మన ఫుట్‌బాల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 'ఫిఫా' నిషేధానికి గురైంది. చివరకు రోజుల వ్యవధిలోనే సడలింపుతో ఊపిరి పోసుకున్న ఏఐఎఫ్‌ఎఫ్‌కు ఇప్పుడు కొత్త జవసత్వాలు మాజీ ఆటగాడి రూపంలో వచ్చాయి. భారత మాజీ గోల్ కీపర్ కల్యాణ్ చౌబే 85 ఏళ్ల ఏఐఎఫ్‌ఎఫ్ చరిత్రలో అధ్యక్షుడైన ఆటగాడిగా నిలిచారు. మాజీ కెప్టెన్, దిగ్గజం బైచుంగ్ భూటియా ఈ ఎన్నికలో ఓడినప్పటికీ మైదానంలోలాగే ఓ ఆటగాడి చేతిలోనే ఓడాడు. రాజకీయ నాయకుడి చేతిలో కాకపోవడం గొప్ప ఊరట. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో 46 ఏళ్ల కల్యాణ్ చౌబే అధ్యక్షుడిగా ఏకపక్ష విజయం సాధించారు. ఆయన 33-1 ఓట్ల తేడాతో భూటియాను ఓడించారు. ఆశ్చర్యకరంగా మాజీ కెప్టెన్‌కు ఒక్క ఓటే రావడం విచిత్రం! భూటియా, ఐఎం విజయన్, లారెన్స్, హైదరాబాద్‌కు చెందిన భారత మాజీ కెప్టెన్ షబ్బీర్ అలీ ఆటగాళ్ల ప్రతినిధులుగా ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) సభ్యులుగా వ్యవహరిస్తారు. మిగతా 14 మంది ఈసీ మెంబర్లంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం జనరల్ సెక్రటరీ జీపీ ఫల్గుణతో పాటు అవిజీత్ పాల్, పి.అనిల్ కుమార్, వాలంక నటాషా, మాలోజి రాజే ఛత్రపతి, మేన్ల ఎతెన్పా, మోహన్ లాల్, ఆరిఫ్ అలీ, కె.నీబౌ సెఖోస్, లాల్గింగ్లోవా, దీపక్ శర్మ, విజయ్ బాలి, ఇంతియాజ్ హుస్సేన్ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గోపాలకృష్ణ కొసరాజు కోశాధికారి పదవి కోసం పోటీపడి 1-32తో కిపా అజయ్ (అరుణాచల్ ప్రదేశ్) చేతిలో ఓడారు.

మంచి గోల్ కీపర్...

కల్యాణ్ చౌబే మాజీ గోల్ కీపర్, మంచి గోల్‌కీపర్ కూడా. 1996లో మోహన్ బగాన్ సీనియర్ క్లబ్ తరఫున అరంగేట్రం చేశారు. తదనంతరం ఈస్ట్ బెంగాల్, జేసీటీ, సాల్గావ్‌కర్ తదితర క్లబ్‌లకు 2003 ఏడాది వరకు ప్రాతినిధ్యం వహించారు. అంతకంటే ముందు జూనియర్ స్థాయిలో భారత అండర్-17, అండర్-20 జట్ల తరఫున ఆసియా యూత్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. 1999-2000లో ప్రి-ఒలింపిక్ క్వాలిఫికేషన్‌లో భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత్ మూడుసార్లు విజేతగా నిలువడంలో గోల్‌కీపర్‌గా చౌబే కీలకపాత్ర పోషించారు. ప్రత్యక్ష రాజకీయాల్లో 2019లో బీజేపీ తరఫున బెంగాల్‌లో ఎంపీ పదవికి పోటీ చేసి ఓడిపోయారు.

క్వాలిఫయర్-2కు తెలుగు యోధాస్



పుణే: అల్టిమేట్ ఖో-ఖో లీగ్‌లో తెలుగు యోధాస్ జట్టు క్వాలిఫయర్-2 మ్యాచ్‌కు అర్హత పొందింది. చెన్నై క్విక్‌గన్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో తెలుగు యోధాస్ 61-43తో గెలిచింది. తెలుగు యోధాస్ కెప్టెన్ ప్రతీక్, ఆదర్శ్ రాణించారు. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన ఒడిశా జగర్‌నాట్స్, గుజరాత్ జెయింట్స్ క్వాలిఫయర్-1లో తలపడగా ... ఒడిశా జగర్‌నాట్స్ 57-43తో నెగ్గి ఫైనల్ చేరింది. నేడు జరిగే క్వాలిఫయర్-2లో గుజరాత్‌తో తెలుగు యోధాస్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో ఒడిశాతో ఆడుతుంది.

క్లుప్తంగా

'బర్డ్'లో ఉచితంగా గ్రహణం మొర్రి ఆపరేషన్లు

తిరుపతి తుడా: గ్రహణం మొర్రితో బాధపడుతున్న పేద పిల్లలకు తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న బర్డ్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని ఆస్పత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్పరెడ్డి శుక్రవారం తెలిపారు. శస్త్రచికిత్సల కోసం ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీలో పేర్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అపాయింట్‌మెంట్, ఇతర వివరాల కోసం 7337318107 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మంత్రి విశ్వరూప్‌కు అస్వస్థత

- హైదరాబాద్‌కు తరలింపు
- ఆరోగ్యం నిలకడగానే ఉందన్న వైద్యులు

అమలాపురం టౌన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆస్పత్రిలో చేరారు. అమలాపురం నియోజకవర్గంలో అప్పటి వరకూ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమల్లో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమాలు ముగిశాక మధ్యాహ్నం అమలాపురంలో ఆయన బస చేసే సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహానికి చేరుకున్నారు. అప్పటికే నీరసంగా ఉన్న ఆయన ఎడమ చేయి లాగుతూ కాళ్లు, చేతి వేళ్లు తిమ్మిర్లు ఎక్కి అస్వస్థతకు గురయ్యారు. మంత్రి విశ్వరూప్ బొల్లినేని ఆస్పత్రి వైద్యుడికి ఫోన్ చేసి తన అనారోగ్య పరిస్థితిని వివరించారు. ఆయన తక్షణమే ఆస్పత్రిలో చేరాలని సూచించారు. ముందు జాగ్రత్తగా మంత్రిని రాజమహేంద్రవరం బొల్లినేని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మంత్రి ఆర్యోగ పరిస్థితి పూర్తి నిలకడగా ఉందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బొల్లినేని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. మెదడులో మైల్డ్ క్లాట్ ఒకటి ఏర్పడి తక్షణమే వదిలేయడం వల్ల అస్వస్థతకు గురయ్యారని, ఎంఆర్ఐ రిపోర్టులో ప్రస్తుతానికి ఎలాంటి సమస్యా లేదని వచ్చిందని చెప్పారు. విశ్వరూప్‌ను ఎంపీ మార్గాని భరత్ పరామర్శించారు. అనంతరం ఎంపీ హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత శుక్రవారం రాత్రి మంత్రిని విమానంలో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఆయన వెంట ఎంపీ భరత్ ఉన్నారు.

ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సు ప్రారంభం


సదస్సును ప్రారంభిస్తున్న లోకాయుక్త చీఫ్ జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి తదితరులు

కర్నూలు(హాస్పిటల్): ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియన్ స్టేట్స్ కాన్ఫరెన్స్ శుక్రవారం కర్నూలులోని జీఆర్‌సీ కన్వెన్షన్‌లో ప్రారంభమైంది. మూడు రోజులు ఈ కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. తొలిరోజు కర్నూలు ఆర్థోపెడిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు(సీఎంఈ) నిర్వహించారు. ఈ సీఎంఈని అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌సేన్(చండీగర్) ప్రారంభించారు. సాయంత్రం నిర్వహించిన సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లోకాయుక్త చీఫ్ జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఇటువంటి వైద్య సదస్సుల ద్వారా యువ వైద్యులు మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకుని రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ అసోసియేషన్ దక్షిణ భారత అధ్యక్షుడు డాక్టర్ సెల్వరాజ్, కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుట్టి, సైంటిఫిక్ హెడ్ డాక్టర్ సతీష్ కోటి, సైంటిఫిక్ చైర్మన్ డాక్టర్ వై.తిమ్మారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ధర్మారావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీవీఎస్ మూర్తి, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ డాక్టర్ టి.విజయ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా జియాఉద్దీన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా షేక్ మహ్మద్ జియాఉద్దీన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముత్యాలరాజు ఉత్తర్వులు జారీచేశారు. జియాఉద్దీన్‌కు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. రెండేళ్లపాటు ఆయన ఆ పదవిలో కొనసాగుతారు.

కోనేరు మధుకి సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో కోనేరు మధుకి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం విచారించింది. అనంతరం మధుకి నోటీసులు జారీ చేసింది.

రాష్ట్రంలో ఆంధ్ర గోపుష్టి కేంద్రాలు

విజయవాడలో ఈ నెలాఖరున తొలిస్టాల్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సేంద్రియ దేశీ ఆవు పాల (ఏ–2) ఉత్పత్తులు మార్కెట్‌లోకి రాబోతున్నాయి. 'ఆంధ్ర గో పుష్టి' పేరిట పాలు, వెన్న, నెయ్యి, పన్నీరు ఇలా వివిధ రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. విజయవాడలో ఈ నెలాఖరున తొలి కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఆ తర్వాత దశల వారీగా రాష్ట్రంలోని ప్రముఖ నగరాల్లో ఏర్పాటుచేయనున్నారు. జెర్సీ, హెచ్‌ఎఫ్ జాతి పశువుల నుంచి వచ్చే పాలను ఏ–1 పాలుగానూ.. ఒంగోలు, పుంగనూరుతో పాటు గిర్, సాహివాల్, రెడ్సింధీ జాతి దేశీ ఆవుల నుంచి వచ్చే పాలను ఏ–2 పాలుగా పిలుస్తారు. మూపురం కలిగిన పశువుల పాలల్లో హానికర రసాయనాలు (బీసీఎం–7) ఉండవని, వీటిలో కేసిన్ ప్రొటీన్ పదార్థం అధికంగా ఉండడంవల్ల క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులను ఎదుర్కొనేందుకు చక్కని ఔషధంగా పనిచేస్తుందని పలు పరిశోధనల్లో నిర్ధారణ కావడంతో ఈ పాలకు అంతర్జాతీయంగా డిమాండ్ ఎక్కువ. విజయవాడ, వైజాగ్‌లో లీటర్ రూ.80–100 చొప్పున విక్రయిస్తుంటే, హైదరాబాద్‌లో రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తుంటారు. ఇక వీటి పేడ ద్వారా తయారుచేసే ఎరువును కిలో రూ.7 చొప్పున, మూత్రాన్ని లీటరు రూ.75 చొప్పున స్థానికంగా విక్రయిస్తున్నారు.

ఐదేళ్లలో దేశవాళీ గోజాతి రెట్టింపు లక్ష్యం

రాష్ట్రంలో 2019 పశుగణన ప్రకారం.. 7.87లక్షల దేశీ ఆవులు, 11.93 లక్షల సంకర, విదేశీ జాతి పశువులున్నాయి. రాష్ట్రానికి చెందిన ఒంగోలు, పుంగనూరుతో పాటు గిర్, సాహివాల్, రాతి, రెడ్సింధీ వంటి అంతరించిపోతున్న దేశీ నాటు ఆవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ సేంద్రీయ పాలు, పాల ఉత్పత్తులను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో 50 శాతం సబ్సిడీపై



ఒక్కోటి రూ.30లక్షల అంచనా వ్యయంతో వైఎస్సార్ దేశవాళీ గో జాతుల పెంపకం కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే తొలివిడతలో గతేడాది 57 కేంద్రాలు ఏర్పాటుచేయగా, మలివిడతలో 52 కేంద్రాలు మంజూరు చేశారు. 27 కేంద్రాలు త్వరలో గ్రౌండింగ్ కానున్నాయి. ఒక్కో క్షేత్రంలో 20 దేశీ ఆవులు, ఓ ఆంబోతును అందిస్తుండగా, పునరుత్పత్తి ద్వారా వీటి సంతతిని ఐదేళ్లలో రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆంధ్ర గో పుష్టి పేరిట బ్రాండింగ్

ఒక్కో ఆవు రోజుకు 6–8 లీటర్ల చొప్పున ఏడాదిలో 220 రోజులపాటు పాలు ఉత్పత్తి చేస్తాయి. పాల ఉత్పత్తి, వినియోగం క్రమేపి పెంచడం, ఉప ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడంతో పాటు ఆవుపేడ, గో మూత్రం, పంచగవ్య, జీవామృతం వంటి ఉప ఉత్పత్తులకు 'ఆంధ్ర గో పుష్టి' పేరిట ప్రత్యేక బ్రాండింగ్ ద్వారా మార్కెట్‌లోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించింది. నేషనల్ స్టాండర్డ్స్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌ఎస్‌ఓపీ) ప్రమాణాలతో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాలకు అదితి ఆర్గానిక్ సర్టిఫికేషన్ (బెంగళూరు) ద్వారా ఆర్గానిక్ సర్టిఫికేషన్ చేయిస్తున్నారు. ఏ–2 పాలు, పాల ఉత్పత్తుల విక్రయాల కోసం రైతుల ద్వారా

సేంద్రియ పాల ఉత్పత్తులకు మార్కెటింగ్

అంతరించిపోతున్న దేశీవాళీ ఆవుల సంతతిని వృద్ధి చేయడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ దేశవాళి గో జాతుల పెంపకం కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది. ఈ క్షేత్రాల్లోని దేశీ ఆవుల పాలు, పాల ఉత్పత్తులతోపాటు ఉప ఉత్పత్తులను ఆంధ్ర గో పుష్టి పేరిట మార్కెటింగ్ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. పాడి రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రాష్ట్రంలోని ప్రముఖ నగరాల్లో ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటుచేస్తున్నాం. తొలిస్టాల్ ఈనెలాఖరున విజయవాడలో అందుబాటులోకి రానుంది.

– పూనం మాలకొండయ్య, స్పెషల్ సీఎస్, పశుసంవర్థక శాఖ

'ఆంధ్ర గో పుష్టి' పేరిట ప్రముఖ నగరాల్లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నారు. విజయవాడలోని పశుసంవర్థక శాఖ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో తొలిస్టాల్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో సేంద్రీయ పాలతో పాటు నెయ్యి, పన్నీరు వంటి ఉప ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మలివిడతలో విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి 50కు పైగా నగరాల్లో నెలకొల్పేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రారంభించిన ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్స్‌తో పాటు త్వరలో ఏర్పాటుచేస్తున్న అమూల్ అవుట్‌లెట్స్, రైతుభరోసా కేంద్రాల ద్వారా కూడా మార్కెటింగ్ చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. త్వరలో ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్ 'జైవిక్ ఖేతి' ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు కసరత్తు జరుగుతోంది.

చిరస్మరణీయుడు వైఎస్సార్


తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు


నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి తదితరులు

- రాష్ట్ర వ్యాప్తంగా ఘన నివాళి
- పేదలకు అన్నదానం, వస్త్రదానం
- పలుచోట్ల రక్తదాన శిబిరాలు

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆ మహానేతకు ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్ 2004 మే 14 నుంచి 2009 సెప్టెంబరు 2 వరకు అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు.. అందించిన మానవీయ, సుపరిపాలనను స్మరించుకున్నారు. భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు, నేతలు రక్తదానం చేశారు. పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. తిరుపతి తుడా సర్కిల్‌లో స్థానిక ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి.. వైఎస్సార్‌కు నివాళులర్పించి అన్నదానం చేశారు. చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నేతృత్వంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. జీడీనెల్లూరులోని పాపిరెడ్డిపల్లెలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు.. వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. రూరల్‌లోని కాంద్రలో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో పలుచోట్ల రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు.. చిలుకలూరిపేటలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, వేమూరు నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఒంగోలులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. పామూరు మండలం బొట్లగూడూరులో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ.. వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీలు రంగయ్య, మాధవ్, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీలు చింతా అనురాధ, వంగా గీత, మార్గాని భరత్, పిల్లి సుభాష్ చంద్రబోస్, పలువురు ఎమ్మెల్యేలు మహానేతకు నివాళులర్పించారు. నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, భీమవరంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, తణుకులో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

పాలకుడు ఎలా ఉండాలో చూపిన నేత వైఎస్సార్

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహానేత డాక్టర్ వైఎస్సార్ పాలన ఒక స్వర్ణయుగంలా సాగిందని, పాలకుడు అంటే ఎలా ఉండాలో చూపించిన నాయకుడు వైఎస్సార్ అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కొనియాడారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు లేళ్ల అప్పిరెడ్డి అధ్యక్షతన దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సజ్జల మాట్లాడుతూ.. వైఎస్సార్ పేరు చెబితే ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు గృహాలు.. ఇలా ఎన్నో పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. కానీ చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తుకు రాదని అన్నారు. తండ్రి స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ ముందుకెళ్తున్నారని చెప్పారు. మూడేళ్లలోనే 30 ఏళ్ల సామాజిక అభివృద్ధిని సీఎం జగన్ తెచ్చారని ప్రశంసించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లకుండా చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎల్లో మీడియాలు.. రోజు ఏదో ఒక విషయంపై దుష్ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. వారి విష ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ సందర్భంగా వైఎస్సార్‌తో కలిసి పనిచేసినప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ బ్రీఫ్ హిస్టరీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణ మాట్లాడుతూ.. వైఎస్సార్‌కు సాటి వచ్చే సీఎం ఏ రాష్ట్రంలో లేరన్నారు. వైఎస్సార్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం రక్తదానం, అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలను పెద్ద ఎత్తున కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, శాసనమండలిలో విప్ జంగా కృష్ణమూర్తి, ఏపీటీడీసీ చైర్మన్ ఆరిమండ వరప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకరరావు, చల్లా మధు(స్కిల్ డెవలప్‌మెంట్), ఉత్తర అమెరికాలో ప్రభుత్వ ప్రతినిధి పండుగాయల రత్నాకర్, నవరత్నాల అమలు ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన్ రావు, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్ హారిక, పలువురు పార్టీ నేతలు, ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లు, అభిమానులు పాల్గొన్నారు.

రూ.7 లక్షల గుట్కా స్వాధీనం

- లారీ సీజ్.. డ్రైవర్, క్లీనర్ అరెస్టు

సబ్బవరం: పశ్చిమ బెంగాల్ నుంచి కాకినాడకు అక్రమంగా తరలిస్తున్న రూ.7 లక్షల విలువ చేసే 40 బస్తాల గుట్కాను గురువారం రాత్రి అనకాపల్లి జిల్లా సబ్బవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిహార్ నుంచి కాకినాడ పోర్టుకు మూడ్రోజుల క్రితం బియ్యం బస్తాల లోడ్‌తో లారీ బయల్దేరింది. మార్గమధ్యంలో పశ్చిమ బెంగా వచ్చేసరికి డ్రైవర్ బెల్లంకొండ రవితేజకు మధ్యవర్తి వీరబాబు అనే వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. పశ్చిమ బెంగాల్ నుంచి కాకినాడ పోర్టుకు 40 బస్తాల నిషేధిత గుట్కా ప్యాకెట్లు తరలించేందుకు బేరం కుదుర్చుకున్నాడు. బియ్యం బస్తాల లోడ్‌పై గుట్కా బస్తాలను లోడ్ చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న సబ్బవరం పోలీసులు మండలంలోని చిన్నయ్యపాలెం వద్ద గురువారం రాత్రి లారీని అదుపులోకి తీసుకున్నారు. లారీని సీజ్‌చేసి డ్రైవర్‌తో పాటు క్లీనర్ బోరాడ గణేష్‌ను ఆరెస్టుచేసి కోర్టుకు తరలించామని సీఐ రంగనాథం శుక్రవారం తెలిపారు.

'పారిశ్రామిక ప్రగతిలో వైఎస్సార్‌ది ప్రత్యేక బ్రాండ్'

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఏపీలో కోస్తా తీరం అభివృద్ధిపై దివంగత సీఎం వైఎస్సార్ ప్రత్యేక దృష్టి సారించారని ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ కొనియాడింది. పారిశ్రామిక ప్రగతిలో ఆయనది ప్రత్యేక బ్రాండ్ అని తెలిపింది. వైఎస్సార్ హయాంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెట్టిందని ఏపీఐఐసీ ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళగిరిలోని ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఎండీ జవ్వాది సుబ్రహ్మణ్యం, ఇతర ఉన్నతాధికారులు వైఎస్సార్ 13వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ.. శ్రీసిటీ, బ్రాండిక్స్, అచ్యుతాపురం సెజ్ వంటి అనేక కీలక ప్రాజెక్టులు వైఎస్సార్ హయాంలో మొదలైనవేనన్నారు. ఆ మహానేత శరీరానికి మాత్రమే మరణమని.. వైఎస్సార్ ఆత్మీయ పాలన, సంక్షేమ పథకాలు, పారిశ్రామికాభివృద్ధి ఎప్పుడూ అమరమేనని చెప్పారు. అనంతరం వైఎస్సార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

శనగ ఎన్‌బీఈజీ-452 విత్తనం విడుదల


నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ కేంద్రంలో సాగులో ఉన్న ఎన్‌బీఈజీ-452 రకం శనగ

నంద్యాల(అర్బన్): శనగలో ఎన్‌బీఈజీ–452 అనే కొత్త రకం విత్తనం విడుదలైందని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. స్థానిక పరిశోధన స్థానం కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జేజీ–11కు ప్రత్యామ్నాయంగా ఎన్‌బీఈజీ–452 రకాన్ని విడుదల చేశామని చెప్పారు. ఈ రకం ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి ఇస్తుందన్నారు. ఎండు తెగులును తట్టుకుంటుందన్నారు. ఇది గింజ నాణ్యతలో జేజీ–11ను పోలి ఉంటుందని పేర్కొన్నారు. నాణ్యమైన ఫౌండేషన్, టీఎల్ విత్తనాలను నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పొందవచ్చని ఆమె తెలిపారు. టీఎల్ విత్తనం ధర కిలో రూ.95 ఉండగా, ఫౌండేషన్ విత్తనం కిలో రూ.100 చొప్పున లభిస్తుందని చెప్పారు. విత్తనాల కోసం రామరాజు (9866884486), లోకేశ్వరరెడ్డి (9996477936)ని సంప్రదించాలని సూచించారు.

విభజన సమస్యల పరిష్కారమే అజెండా

సాక్షి, అమరావతి: విభజన సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా శనివారం తిరువనంతపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరగనున్న దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో ప్రస్తావించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. విభజన జరిగి ఎనిమిదేళ్లైనా పలు సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండటంపై రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశంలో గట్టిగా గళమెత్తనుంది. తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరిస్తూ తగిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్రాన్ని కోరనుంది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నేతృత్వంలో అధికారుల బృందం ఈ సమావేశానికి హాజరు కానున్న విషయం తెలిసిందే. సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే అధికారుల బృందానికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన నేపథ్యంలో త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని ఆర్థిక మంత్రి బుగ్గన సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారు.

- విభజన చట్టం షెడ్యూల్ 9లోని ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్ల ఆస్తులు, అప్పులు విభజనపై షీలా భిడే కమిటీ నివేదిక ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు పంపిణీ జరగలేదని సమావేశంలో ప్రస్తావించనున్నారు. వాటి ఆస్తులు, అప్పులను జనాభా ప్రాతిపదికన త్వరగా పంపిణీ చేయాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరనుంది.
- విభజన చట్టం షెడ్యూల్ 10లోని 142 ఇన్‌స్టిట్యూషన్స్‌కు చెందిన ఆస్తులు, అప్పులను జనాభా ప్రాతిపదికన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరనుంది.
- విభజన చట్టం షెడ్యూల్ 13లో మంజూరు చేసిన 11 విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో పనిచేసేందుకు వీలుగా కేంద్రం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. ఈ సంస్థలకు ఇప్పటి వరకు కేవలం 27 శాతం నిధులనే మంజూరు చేశారని, 2024 ఏప్రిల్ నాటికి పూర్తి స్థాయిలో పనిచేయాలంటే మిగిలిన నిధులను త్వరగా విడుదల చేయాలని ఏపీ కోరనుంది.
- విభజన చట్టంలో పేర్కొన్న మేరకు రామాయపట్నం పోర్టును కేంద్రం వెంటనే చేపట్టాలని, విభజనతో నష్టపోయిన ఏపీకి పారిశ్రామిక రాయితీలను ఇవ్వాలని కోరనుంది.
- ఢిల్లీలోని ఏపీ భవన్‌ను తెలంగాణ, ఏపీకి జనాభా ప్రాతిపదికన పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెంటనే అనుమతి ఇవ్వాలని కోరనుంది.
- రాష్ట్ర విభజన జరిగిన ఆర్థిక ఏడాదిలో రెవెన్యూ లోటు భర్తీకి సంబంధించిన గ్రాంట్‌ను మంజూరు చేయాలని సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయనుంది. ఉమ్మడి రాయలసీమలోని వెనుకబడిన నాలుగు జిల్లాలు, ఉత్తరాంధ్రలోని వెనుకబడిన మూడు జిల్లాలకు విభజన చట్టంలో పేర్కొన్న మేరకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని ఇవ్వాలని కోరనుంది.

పేదల పక్షపాతి వైఎస్సార్: గవర్నర్ విశ్వభూషణ్



సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పక్షపాతని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కొనియాడారు. అట్టడుగు వర్గాల సమస్యలను అర్థం చేసుకోవడమే కాకుండా సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన అసమాన నాయకత్వం, పరిపాలన దక్షతకు రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులు, పలు సంక్షేమ పథకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కొనియాడారు. ఈ మేరకు రాజ్‌భవన్ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశాయి.

ప్రజల గుండెల్లో వైఎస్సార్‌ది సుస్థిర స్థానం

- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

హనుమాన్‌జంక్షన్ రూరల్: తెలుగు ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కొనియాడారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ కేవీపీ రామచంద్రరావు స్వగ్రామమైన కృష్ణా జిల్లా బాపులపాడు మండలం అంపాపురంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆయన.. కేవీపీ, రఘువీరారెడ్డి తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ పాలన సాగించారని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల అమలులో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఆయన చివరి శ్వాస వరకు ప్రజా సంక్షేమం కోసమే పరితపించారన్నారు. ఆయన మరణంతో ఉమ్మడి ఏపీ పాలన అస్తవ్యస్థంగా మారిపోయి.. రాష్ట్ర విభజనకు కారణమైందని చెప్పారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ మరణానంతరం ఒక్కరోజైనా ఆయన్ని తలచుకోని రోజు లేదన్నారు. కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ.. వైఎస్సార్ అకాల మరణం తన జీవితంలో మర్చిపోలేని దుర్ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు వట్టి వసంత్‌కుమార్, సాకే శైలజానాథ్, వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దాదాపు రెండు వేల మందికి కేవీపీ కుటుంబసభ్యులు వస్త్రాలు పంపిణీ చేశారు.


అంపాపురంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేవీపీ, ఉండవల్లి, రఘువీరారెడ్డి, శైలజానాథ్

భారత రాజకీయాల్లో వైఎస్సార్ గొప్ప నేత

- కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్
- పోలవరంలో సింహభాగం ఖ్యాతి వైఎస్‌దే: జస్టిస్ చలమేశ్వర్
- పోలవరం వద్ద వైఎస్ విగ్రహం ప్రతిష్టించాలి: సంజయ్ బారు
- కేవీపీ రచించిన 'జలయజ్ఞం–పోలవరం.. ఒక సాహసి ప్రయాణం' పుస్తకం ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: ఆధునిక భారత దేశ రాజకీయాల్లోనే వైఎస్సార్ గొప్ప నాయకుడని కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ కొనియాడారు. పోలవరం సాగునీటి ప్రాజెక్టుకు చాలా చరిత్ర ఉందని, కానీ వైఎస్ హయాంలోనే ప్రాజెక్టు కార్యరూపం దాల్చిందని చెప్పారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ కేవీపీ రామచంద్రరావు రచించిన 'జలయజ్ఞం – పోలవరం.. ఒక సాహసి ప్రయాణం' అనే పుస్తకాన్ని వైఎస్సార్ 13వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఇక్కడ ఆవిష్కరించారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని ప్రధానమంత్రి మాజీ సలహాదారు, సీనియర్ జర్నలిస్టు సంజయ్ బారుకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో జైరాం రమేశ్ జూమ్ కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోని ప్రతి మూలకు నీరందించే లక్ష్యంతో పని చేశారని రమేశ్ చెప్పారు. ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, విద్య, సాగునీటి రంగాలపై ఎక్కువ దృష్టి పెట్టారని తెలిపారు. జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆ ఖ్యాతిలో సింహభాగం వైఎస్‌కే దక్కుతుందన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఓట్ల పండుగ మాత్రమే కాదని, రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమలు చేయడమని తెలిపారు. 2004లో యూపీఏ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన ఆర్కిటెక్ట్ వైఎస్సార్ అని సంజయ్ బారు అన్నారు. పోలవరం ప్రాజెక్టు వద్ద వైఎస్సార్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని చెప్పారు. ఎమెస్కో విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కేవీపీతో పాటు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి రమాకాంత్ రెడ్డి, సీఎంవో మాజీ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.